# మార్టిన్ లూథర్ కింగ్



స్టానిస్లేవ్ కోండ్రషోవ్

C-5863

300-92
కోల్పోయిన్ - మార్టిన్

SC... ..D

SCANNED
11/11/2019

# మార్టిన్ లూథర్ కింగ్

JR FAVOUR OF REVIEW

స్టానిస్లేవ్ కోంద్రషోవ్

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
విజ్ఞాన భవన్, 4-1-435 బ్యాంక్ స్ట్రీట్
హైదరాబాద్-500 001

Publication No : 1410/MKJP Copies : 1100

First Edition : August, 1989

Title Name : MARTIN LUTHER KING

Price : Rs. 12-00

Translated into Telugu : SODUM RAMMOHAN

Published in Cooperation with
v/o Mezhdunarodnaya Kniga, Moscow

© Telugu Translation :
VISALAANDHRA PUBLISHING HOUSE
On behalf of v/o. Mezhdunarodnaya Kniga, Moscow

C 5863
Library
300.92

Copies available at :
VISALAANDHRA PUBLISHING HOUSE
Vignana Bhavan, 4-1-435 Bank Street
Hyderabad - 500 001

VISALAANDHRA BOOK HOUSE
Vijayawada, Hyderabad, Visakhapatnam, Tirupati,
Anantapur, Guntur, Hanmakonda, Kakinada.

ISBN : 81-7098-154-9

Printed at: Padmavathi Art Printers, Hyderguda, Hyderabad-29

# విషయసూచిక


| | | పేజి |
|---|---|---|
| బాల్యం - తొలి అనుభవాలు | ... | 5 |
| పొరపాట్ల నుంచి గుణపాఠం | ... | 15 |
| సత్యం జయిస్తుంది | ... | 27 |
| విజయం ! లేక ఇది విజయమేనా ? | ... | 39 |
| జనమే నాయకులను సృష్టించారు | ... | 50 |
| నిస్వార్థ పోరాట యోధుని ఆత్మత్యాగం | ... | 71 |



"నేను మానవ జాతిని ప్రేమించడానికీ, సేవించడానికి ప్రయత్నించాను. నేను న్యాయం కోసం శాంతి కోసం రణభేరీ మోగించాను. నేను నిబద్ధతా జీవితాన్ని వారసత్వంగా వదలాను."

నేను 1960 లలో సోవియట్ వార్తాపత్రిక 'ఇజ్వెస్తియా'కు న్యూయార్క్‌లో విలేరిఖగా పనిచేసినప్పుడు సహజంగానే మానవ హక్కులకోసం పౌరహక్కులకోసం నల్ల అమెరికన్లు సాగించిన పోరాటం లోని తీవ్రమైన, సంక్లిష్టమైన సమస్యలను అవగాహన చేసుకోడానికి కృషి చేశాను. ఆ క్రమంలో అనివార్యంగానే నల్ల అమెరికన్ల సుప్రసిద్ధ నాయకుడయిన మార్టిన్ లూథర్‌కింగ్ వ్యక్తిత్వంపట్ల ఆసక్తి వ్యక్తం చేశాను. ఆయనది ఆకర్షవంతమైన వ్యక్తిత్వం.

లూథర్ కింగ్‌ను సృష్టించిందీ అమెరికా సమాజమే, ఆయన్ను నాశనం చేసిందీ అమెరికా సమాజమే. 39 యేళ్ళ వయసులో ఆయన హత్య చేయబడ్డారు. ఇప్పటికి ఇరవైయేళ్ళు దాటినప్పటికీ ఆయన విస్మృతుడు కాలేదు. అమెరికా పౌరరంగంలోనూ అమెరికా సరిహద్దులకు ఆవలా కింగ్ పేరు బలంగా ఇప్పటికీ ప్రతిధ్వనిస్తూనే వుంది. తన దేశ చరిత్రలోనూ 20 వ శతాబ్దపు విముక్తి ఉద్యమ చరిత్రలోనూ మార్టిన్ లూథర్ కింగ్‌కు ప్రాముఖ్యమైన, గౌరవప్రదమైన, శాశ్వతమైన స్థానం వుంది.

1968 లో మార్టిన్ లూథర్ కింగ్ హత్యచేయబడింది లగాయతు ఆయన జన్మదినాన్ని జాతీయసెలవుదినంగా ప్రకటించే సమస్య అమెరికా కాంగ్రెస్ (పార్లమెంటు)లో పదిహేనుసార్లు లేవనెత్త బడింది. 1983 లో యీ మేరకు ఒక బిల్లు ఆమోదింపబడి అధ్యక్షుడు సంతకం గూడా చేశారు. ఈనాడు జనవరి మాసంలోని మూడవ సోమవారం అమెరికాలో మార్టిన్ లూథర్ కింగ్ జన్మదినంగా యేటా పాటింపబడు

తున్నది. కవికి జీవన చరమలక్ష్యమే వుంటుందితప్ప అతనికి జీవితంలో ముందుకు ఎగబాకే పనివుండదు అని రష్యన్ కవి అలెగ్జాండర్ బ్లాక్ ఒకసారి అన్నారు. కవులకు సంబంధించి ఆయన అంతర్దృష్టి నిస్సంశయంగా వాస్తవమైనది. అయితే పౌరప్రముఖులు జీవితంలో ముందుకు వెళ్ళడంకాక జీవన చరమలక్ష్యాలు కలిగివుండడం చాలా అరుదైపోయింది.

కానీ ఆయన దేశానికి డాక్టర్‌సింగ్ రాజకీయ ప్రాముఖ్యం యెలాటిదంటే. ఆయనకు సంబంధించి జీవన చరమలక్ష్యం గురించి ప్రస్తావించడమే చాలా సముచితంగా వుంటుంది. ఆయన జీవితం అకాలంలో అంతరించినప్పటికీ, మరణానంతరం ఆయన అమరజీవి అయ్యారు. ఆయన తన సమకాలికుల మనసుల్లోనూ వారి వారసుల మనసుల్లోనూ జీవిస్తున్నారు. మహానుభావులు జ్యోతులవంటివారు. వారు మనచుట్టూ గల ప్రపంచాన్ని వెలుగులతో నింపి మనకు మార్గం చూపుతారు.

మార్టిన్ లూథర్‌కింగ్ అన్నిరూపాల్లోని పీడనకూ వర్ణ వివక్షకూ వ్యతిరేకంగానూ స్వేచ్ఛా న్యాయాల విజయంకోసమూ పోరాడారు. తన సుప్రసిద్ధ ప్రసంగంలో ఆయన యిలా కలగన్నారు. "ఏదో ఒక రోజు మునుపటి బానిసల కుమారులూ బానిస యజమానుల కుమారులూ అంతా ఒక చోట అన్నదమ్ముల్లాగా కూచుంటారు," మరి ఆయన కల వాస్తవ రూపం దాల్చిందా ?

ఒక్కమాటలో చెప్తే, నల్ల అమెరికన్లు లాంఛనప్రాయంగా చట్టపరంగా సమానత్వం సాధించి నప్పటికీ వాస్తవంలో వారిప్పటికీ అసమానతకు గురువుతూనే వున్నారు.

మరైతే డాక్టర్ కింగ్ సాధించిందేమిటి ? ఆయన చాలా సాధించారు. ఆయన పోరాట వత్తిడికి తట్టుకోలేక అమెరికాసమాజం తోటి నల్ల పౌరులను కొత్త కళ్ళతో చూడక తప్పలేదు. ఆయన నల్ల అమెరికన్లలో స్వాభిమాన భావాన్నీ తమ సొంత శక్తిపై విశ్వాసభావాన్నీ కలిగించారు. చివరకు బహుశా తాను ఎన్నడూ వూహించనిది ఆయన సాధించారు.

"నిజమైన సౌభ్రాతృత్వంలోని సౌందర్యమూ శాంతిలోని సౌందర్యమూ ఎవరికైతే వజ్రాలకంటె, వెండికంటె, బంగారంకంటె ఎక్కువ విలువైనవో అలాటి వారికి "సౌందర్యమే సత్యం, సత్యమే సౌందర్యం" అని ఎవరినుద్దేశించి ఆయన వ్యాఖ్యానించారో వారికి ఆయన తానే స్వయంగా ఒక ఆదర్శంగా పరిణమించారు.

అనేక సమావేశాల్లో పత్రికల వారికి కేటాయించబడిన స్థానాల్లో కూచుని నేను మార్టిన్ లూథర్‌కింగ్‌ను చూశాను. ఆయన వేదికపైకి రాగానే హాలంతా ప్రశాంత వాతావరణం నెలకొనేది; శ్రద్ధతోనూ గౌరవంతోనూ నిండిన ప్రశాంతత అది. నేను చికాగో విశ్వవిద్యాలయంలో ఒకసారి ఆయన్ను కాసేపు కలశాను; ఆయనతో కరచాలనంచేసి ఆయన హస్త స్పర్శను అనుభూతి చెందాను; ప్రశాంతమైన గంభీరమైన నల్లగా నిగనిగలాడే ఆయన కళ్ళనూ దృఢమైన, విశాలమైన పెదాలనీ బలమైన చుబుకాన్నీ చాలా దగ్గరగా చూశాను. ఖంగుమనే ఆయన కంఠస్వరం విన్నాను. ఆయన కంఠస్వరం సంయమనాత్మకంగా లయబద్ధంగా వుండేది. అది వుద్వేగాన్నిబట్టి ఒక్కోసారి పైకి ఎగిసేది, ఒక్కోసారి కిందికి దిగేది. డాక్టర్ కింగ్‌కు ఎప్పుడూ సమయం చాలేదికాదు. అందుచేత ఆయనకొక సహాయకుడుండేవాడు. ఆయనకు డ్రస్సు అదీ ఆయనే అందించేవాడు. బాప్టిస్టుఫాదిరీ ధరించే ముదురు నల్లకోటు ధరించే వాడాయన: తన తరువాత కార్యక్రమ మేమిటో ఆయనకు గుర్తు చేసే వాడు. మా వార్తా పత్రిక్కి ఇంటర్వ్యూ ఇవాల్సిందిగా నేను విజ్ఞప్తి చేశాను. కింగ్ అంగీకరించాడు. అయితే అమెరికాశైలీ సరళిలో ఆయన కార్యక్రమాలన్నీ ముందే నిర్ణయింపబడివుండేవి. పైగా ఆకార్యక్రమం పట్టిక తన వద్ద వుండేదికాదు. అందుచేత అట్లాంటాలోని తన ప్రధాన కార్యాలయంలో అడిగి కనుక్కోవలసిందిగా కోరారాయన. ఆయన కార్యదర్శినుంచి నాకు సమాధానం వచ్చింది. డాక్టర్ కింగ్ అప్పుడు అట్లాంటాలో లేరనీ ఆయన అట్లాంటా వచ్చేదాకా ఆగండనీ నన్ను ఆయన కోరాడు. డాక్టర్ కింగ్ నిరంతరం తిరుగుతుండేవారు,

ఎప్పుడూ చాలా రద్దీగా వుండేవారు. ఏం చేద్దాం నాకు ఇంటర్వ్యూ చిక్కలేదు. నేను సజీవంగా వున్న కింగ్ గురించి రాయాలను కున్నప్ప టికీ ఇప్పుడు మరణించిన కింగ్ గురించే రాయవలసి వస్తున్నది.

సాధారణంగా ఏవయసులో అయితే అమెరికా రాజకీయ నాయకుల జీవితాలు వికసించ ప్రారంభిస్తాయో సరిగ్గా ఆ వయసులో డాక్టర్ కింగ్ చంపబడ్డాడు. కింగ్ కోరుకుంది అందరిలా ముందుకు సాగే జీవితంకాదు, ఆయన కోరుకుంది కోట్లాదిమంది నల్ల అమెరికన్లకు న్యాయం. అట్లా నాకు చెందిన యీ నల్ల అమెరికన్‌ను బహుశా ప్రతి అమెరికా గృహమూ ఎరుగును. ఆయన లక్ష్యం కేవలం ప్రపంచ ప్రఖ్యాతికాదు; అయితే ఆ ప్రపంచ ప్రఖ్యాతి అనుకోకుండానే లభించింది. 1963 మే మాసంలో బర్మింగ్ హామ్ పోలీసులు ప్రదర్శకులపై, భయంకరమైన జర్మన్ కుక్కలను దాడికి వుసికొల్పడంతో ఆ ప్రపంచ ప్రఖ్యాతి లభించింది. 35 యేళ్ళ వయసులో ఆయనకు 1964 డిసెంబరులో నోబెల్ శాంతి బహుమతి లభించింది. అయితే అంతటితో ఆయన ఆగిపోయారు కాదు. ఆయన దృష్టిలో, తనపై నమ్మకం పెట్టుకున్న దక్షణాది అమెరికాలోని ఉత్తరప్రాంత అమెరికాలోని కోట్లాది నల్లప్రజల భవితవ్యమే అత్యంత ముఖ్యమైనది. ఉత్తమ జీవితంకోసం వాళ్ళంతా తనపైన్నే ఆశలు పెట్టుకున్నారు. ఆయన వారిలో అలాటి ఆశలను రేకెత్తించడమేకాక వాటి సాఫల్యంకోసం జీవితాంతమూ కృషి చేశారు; ఆ ఆశలకు న్యాయం చేకూర్చడం కష్టమనికూడా ఆయన ఎరుగును. ఆయన్ను నల్ల అమెరికా అధ్యక్షుడు అన్నారు. అయితే విశేషమేమిటంటే, అలబామా, దక్షిణ కరోలినా, జార్జియా, మిసిసిపిలకు చెందిన నిరక్షరాస్యులైన నల్ల పాలికాపులకు ఆయన అధ్యక్షుడికంటె ఎక్కువే. ఆయన తన ప్రజలకు వాగ్దానం చేసిన చోటికి నడిపించిన ప్రవక్త మోసెస్‌తో సమానం.

# బాల్యం - తొలి అనుభవాలు

మార్టిన్ లూథర్ కింగ్ 1929 జనవరి 15 న జార్జియా రాష్ట్రంలోని అట్లాంటాలో జన్మించారు. ఆయన తండ్రిగారు అప్పుడు ఎబెనెజర్ బ్యాప్టిస్ట్ చర్చిలో సహాయక ఫాదిరీగా పనిచేసేవారు. (ఫాదిరీ అంటే క్రైస్తవుల మత గురువు).

ఆ కుటుంబం పూర్వీకులు బానిసలుగా వుండేవారు. మార్టిన్ తాత (అమ్మ నాన్న) 1863లో బానిస తల్లిదండ్రులకు జన్మించారు. 1863 అంటే అధ్యక్షుడు లింకన్, నల్ల బానిసలకు విముక్తి ప్రకటించిన సంవత్సరం. 1894లో ఆయన్ను ఎబెనెజర్ బ్యాప్టిస్ట్ చర్చిలో ఫాదరీగా నియమింపబడ్డారు. ఆయన తాత మత పరమైన భావాలు కలవాడే కాక ఆచరణాత్మకమైన దృక్పథం కలవాడు కూడా కావడంవల్ల అట్లాంటాలోని నీగ్రో చర్చిల్లో ఆ చర్చిని ఒకానొక అత్యంత గౌరవ ప్రదమైనదిగా ఆర్థికంగా పటిష్ఠమైనదిగా తీర్చిదిద్దారు. తోటి మత గురువులే కాక స్థానిక నల్ల జనాలు కూడా మార్టిన్ తాతను ఎంతో గౌరవించేవారు.

మార్టిన్ తండ్రి విద్యా ప్రాముఖ్యాన్ని ప్రారంభంలోనే గుర్తించినవాడు కావడం వల్ల తన బిడ్డలను చదివించడానికి ఎంతో కృషిచేశాడు; డబ్బు కూడా బాగా ఖర్చుపెట్టాడు. మార్టిన్ లూథర్ కింగ్ సెకెండరీ పాఠశాల చదువు ముగించి మోర్‌హౌస్ కాలేజీలో పట్టా పొందారు; ఆనాడు అట్లాంటాలో నల్ల అమెరికన్ల వున్నత విద్యా సంస్థగా వుండేదది. కింగ్ మంచి విద్యార్థి. ఆయన తండ్రి ఆయన్ను చర్చికోసం చదివించాలనుకున్నాడు. నల్ల ఫాదిరీలు నమ్మకమైన ఆదాయం సంపాదించే అవకాశం వుందని ఆయన ఎరుగును. అంతేకాదు నల్ల ఫాదరీని నల్లవారంతా గౌరవించడమేకాక తెల్ల జనాలు సైతం కాస్త మర్యాద చూపేవారు. అయితే చర్చి మాత్రం మార్టిన్‌ను వెంటనే ఆకర్షించిందికాదు. ఆయన డాక్టర్ కావాలని కొన్నాళ్ళు కలలు కన్నాడు. తరువాత కాలేజీలో చదివేప్పుడు ఆయనకు వక్తృత్వ కళలో ఆసక్తి పుట్టింది; విద్యార్థుల రాజకీయ ప్రసంగాల పోటీలో ఆయనకు మొదటి బహుమతి లేకపోతే రెండవ బహుమతి లభించేది. అప్పటికి ఆయన తండ్రి ఓ ముఖ్యమైన మత గురువు అయివుండడం తోనూ పౌరహక్కుల వుద్యమంలో చురుగ్గా పాల్గొంటూ వుండడంతోనూ మత శాస్త్ర ప్రొఫెసర్ల పలుకుబడి మూలంగానూ మార్టిన్ మతశాస్త్ర విద్యాధ్యయనం పట్ల ఆసక్తి చూపారు. ఆయన యీ జీవితాన్ని ఎంపిక చేసుకోవడంలో యివన్నీ పని చేశాయి.

మోర్ హౌస్ కాలేజీలో పట్టా పుచ్చుకోగానే మార్టిన్‌లూథర్‌కింగ్ ఉత్తర ప్రాంత అమెరికాలో తన చదువు కొనసాగించాడు; పెన్సిల్వేనియాలోని చెస్టర్ వద్దగల క్రోజర్ థియలాజికల్ సెమినరీ (మతశాస్త్ర విద్య నేర్పే ఒక సంస్థ)లో చేరారు. అక్కడ మతశాస్త్ర విద్యలో డిగ్రీ పుచ్చుకున్నాడు. తర్వాత 1955 లో బోస్టన్ విశ్వవిద్యాలయంలో ఆయనకు పిహెచ్‌డి. డిగ్రీ లభించింది. ఉత్తర ప్రాంత అమెరికాలో నల్లవారు సైతం యూనివర్శిటీలోచేరి చదువుకో వచ్చు. మార్టిన్ లూథర్ ఉత్తర ప్రాంత అమెరికాలో దక్షిణ ప్రాంతం నుంచి పారిపోయి వచ్చిన ఒక నల్ల అమ్మాయిని కలుసుకున్నాడు. ఆమె పేరు కోరెట్టాస్కాట్. ఆమె సంగీత పాఠశాలలో చదువుతుండేది. గొప్ప గాయకురాలు కావాలన్నది ఆమె స్వప్నం. అయితే మొత్తానికి కోరెట్టాస్కాట్, మార్టిన్ లూథర్‌కింగ్‌లు కలుసుకుని పరస్పరం ప్రేమించుకున్నారు.

బాహ్యంగా మాత్రం జీవితం ఎలాటి ఒడిదుడుకులు లేకుండా సాగుతూ ఉండింది. అదృష్ట వశాత్తు యీ బలిష్ఠమైన యువకుడి స్థితిగతులు సవ్యంగా వున్నాయి. అతడు లోటు అన్నది యేనాడూ యెరుగడు. ఎప్పుడూ చక్కటి బట్టలు ధరించేవాడు. మంచీ మర్యాద తెలిసినవాడు. బాగా విద్యావంతుడు. తన కుమారుడు ముందుకెళ్ళడానికి తండ్రితనకు చేతనైందల్లా చేశాడు. తండ్రి తన కుమారునిచూసి గర్వించేవాడు. మత శాస్త్రం చదివిన తన కుమారుని తన సహాయకునిగా నియమించు కున్నాడు. ఎబెన్‌జెర్ బ్యాప్టిస్ట్ చర్చిని తమ "కుటుంబ సంస్థ"గా కాపాడుకోవాలన్న వుద్దేశంగా ఆయన అలాచేశాడు. కింగ్ కుటుంబం అట్లాంటాలోని నల్ల పెట్టీబూర్జువా వర్గానికి చెందింది.

అవును, జీవితంలో అన్నీ చక్కగా అమరాయి ... అయితే నువ్వు ఆలోచించకపోతేనే, అన్నీ అమరిన నీ ఇళ్ళు అనే గుల్లలో నువ్వు దాక్కుంటేనే, నీ వ్యక్తిగత గౌరవం గురించి పట్టించుకోకుంటే అడుగడుగునా నీపై దాడిచేసే తెల్లవారి శత్రుప్రపచంలో జీవించడం నువ్వు నేర్చుకుని వుంటేనే. మార్టిన్ తండ్రి తన కుమారునికి ప్రపంచంలో ఓ స్థిరమైన స్థానం కల్పించా లనుకున్నాడు. అంటే దాని అర్థంయేమిటిమరి? ఆ ప్రశ్నకు అనివార్యంగా లభించే సమాధానం యిదీ; ముఖ్యంగా అమెరికా సంయుక్త రాష్ట్రాల్లోని దక్షిణ ప్రాంతాల్లో నివ సించే ఓ నల్ల వ్యక్తికి,రెండవ తరగతి ప్రజలమధ్య స్థిరమైన స్థానం కల్గించడంమే అవుతుంది. అంటే మామూలు మాటల్లో చెబితే రెండవతరగతి పౌరులమధ్య స్థిరమైన, గౌరవప్రదమైన స్థానం కల్పించడం మాత్రమే అవుతుంది. అతడు కనుక దక్షిణప్రాంతానికి చెందిన నల్ల వ్యక్తిఅయ్యే పక్షంలో అతడికిగల

పి.హెచ్‌డి. డిగ్రీ కూడా అతడికి ప్రాథమిక మానవహక్కులకు హామీ కల్పించదు. తనకు పి.హెచ్.డి. రాకముందే కింగ్‌కు ఆ విషయం తెలుసు.

చాలాచిన్న వయస్సులోనే పాఠశాల జీవితం ప్రారంభమవుతుంది. నల్ల కుర్రాడికైతే అది ప్రత్యేక పాఠశాలేతప్ప ఉమ్మడి పాఠశాల కాదు. మార్టిన్ అయిదేళ్ళ వయసులోనే తన మొదటిపాఠం నేర్చుకున్నాడు. ఆ వయసులో అతడు ఇద్దరు తెల్లకుర్రాళ్ళస్నేహం పోగొట్టుకున్నాడు. ఆ కుర్రాళ్ళిద్దరు పొరుగున గల పళ్ళదుకాణం యజమాని కుమారులు. ఆ కుర్రాళ్ళు మార్టిన్‌తో కలిసి ఆడుకునే వాళ్ళు. వాళ్ళు వున్నట్టుండి అతనికి కనిపించకుండా తప్పించుకోసాగారు. మార్టిన్ వాళ్ళింటికి పరుగెత్తికెళ్ళి ఆడుకుందాం రండర్రా అని పిల్చేవాడు. అయితే వాళ్ళ తల్లిదండ్రులేమో పైకి వ్యతిరేకత వ్యక్తం చేయకుండానే, లౌక్యంగా తమ బిడ్డలు ఇంట్లోలేరనో ఆడుకునేతీరికలేదనో సమాధానంచెప్పి పంపేవాళ్ళు. వాళ్ళు ఆ విధంగా తమ సొంతపద్ధతిలో యీ నల్లకుర్రాళ్ళని కలవడం తప్పించారు; అంతేకాదు దీనికంతా వివరణ, సంజాయిషీ యిచ్చుకునే బాధ్యతను మార్టిన్ తల్లిదండ్రుల మీదికే నెట్టారు. మొత్తానికి వాళ్ళు ఆ బాధ్యతనుంచి తప్పించుకున్నారు. దీంతో మార్టిన్ దిమ్మెరపోయి తనకు అర్థంకాని యీ విషయాన్ని అమ్మ ముందుంచాడు. అతడు తొట్టతొలిసారిగా బానిసత్వం గురించీ, ఉత్తరం, దక్షిణం మధ్యసాగిన అంతర్యుద్ధంగురించీ తాను నల్లవాడిగా పుట్టిన వాస్తవంగురించీ తన స్నేహితులు తెల్లకుర్రాళ్ళు కావడం గురించీ దానినుంచీ బయల్దేరిన భయంకరమైన పర్యవసానాల గురించీ అన్నీ తల్లిదగ్గరే నేర్చుకున్నాడు. అతని తల్లి మాత్రం యేం చేస్తుంది? ఆ కుర్రాడితలలో ఏ క్షణమైనా సత్యం తళుక్కున మెరవడానికి సిద్ధంగా వున్నపుడు, తెలియనివారెవరైనా ఆ సత్యం అతడికి తెలియ చెప్పడానికి సిద్ధంగా వున్నప్పుడు ఆ ఎరుకని కాస్త ఆలస్యం చేయడంలో అర్థంయేముంది? ఆమె మార్టిన్‌తో యిలా అంది. "నువ్వా అందరిలాగే మంచోడివి" అది సత్యమే కానీ ఆ సత్యం జీవిత వాస్తవాలను మార్చడం జరగలేదు. ఆ వాస్తవాలు మరింత స్పష్టంగా అనుభూతం అయ్యాయి.

మోర్‌హౌస్ కాలేజీలో చదివేప్పుడు మార్టిన్ వేసవి సెలవుల్లో చాపల తయారీ ఫ్యాక్టరీలో పనిచేస్తూ డబ్బులు సంపాయించే వాడు. ఆ ఫ్యాక్టరీలో అతడికొక సత్యం తెలిసింది. ఒకే పనిచేసే నల్ల విద్యార్థులకంటె తెల్ల విద్యార్థులకు ఎక్కువ చెల్లించేవారు.

చెస్టర్‌లోనూ బోస్టన్‌లోనూ కింగ్ కాస్తస్వేచ్ఛగా వూపిరి పీల్చుకున్నాడు, నల్లవాళ్ళకీ తెల్లవాళ్ళకీ మధ్యగల విభజన రేఖ అంత బలంగా వుండేది కాదు.

తెల్ల విద్యార్థులతో సామరస్యసంబంధాలు లేకపోయినప్పటికీ మొత్తానికి సంబంధాలు ప్రశాంతంగావుండేవి. ఏదిఏమైనా ఉత్తరప్రాంతంలో కూడా నల్లవాళ్ళు ఎల్లప్పుడూ జాగ్రత్తగా వుండాల్సిన అవసరం వుండేది. అవమానకరమైన పరిస్థితులు ఎదురు కాకూడదు అంటే నల్లవాళ్ళు జాగ్రత్తగా మెలగవలసివచ్చేది.

ఏమైనా ఉత్తర ప్రాంతంలో నల్లసోదరులు కాస్త స్వేచ్ఛగా వూపిరిపీలుస్తు న్నారని మార్టిన్ భావించాడు. తన చదువు ముగియ వచ్చేసరికి అతడు అక్కడే అలాగే వుండిపోదామనుకున్నాడు. రెండు నీగ్రో చర్చిల్లో మతగురువు వుద్యోగం ఇస్తామని ఆయనకు ప్రతిపాదించారు. అయితే దక్షిణ ప్రాంతంలో పరిస్థితులు యెలా వున్నప్పటికీ అది అతడి సొంతప్రదేశం కదా. ఇది తన జన్మస్థలం అన్న అనుబంధానికి తోడుగా ఇప్పుడు బాధ్యతా భావం అనేది ఒకటి అదనంగా వచ్చి పడింది. భద్రంగా బతుకుదామన్న భావంతో ఉత్తర ప్రాంతానికి పారిపోవడ మంటే ద్రోహం చేసినట్లేనన్నభావం తలెత్తింది. అందుచేత అతడు దక్షిణ ప్రాంతమే కోరుకున్నాడు. పరీక్షకోసం నిర్వహించే పూజా ప్రసంగం అదీ ముగిశాక, మాంట్‌గోమరీ (అలబామా) లోని డెక్సర్ వీథిలోని బ్యాప్టిస్ట్ చర్చిలో మతగురువుగా నియమింపబడ్డాడు. మతతత్వశాస్త్రం పిహెచ్. డి. డిగ్రీ పుచ్చు కున్నాక మార్టిన్ లూథర్‌కింగ్ 1955 జూన్‌లో తన భార్యతో కలసి అక్కడకు వెళ్ళాడు. తర్వాత త్వరలోనే ఆయన జీవితాన్ని మార్చిన ఘటన సంభవించింది.

ఆమె పేరు రోజా పార్క్స్. ఆ నల్ల యువతి ఆ పట్టణంలోని ఒక డిపార్ట్‌మెంట్ స్టోర్‌లో కుట్టుపని చేస్తుంది. 1955 డిసెంబర్ 1 వ తారీకున సాయంత్రం పని అయిపోగానే ఆమె బయటకు వచ్చి ఓ మునిసిపల్ బస్సులోకి ఎక్కింది. అప్పుడే సాయంత్రం ప్రారంభమైంది కాబట్టి బస్సునిండా జనం కిట కిటలాడుతున్నారు. బస్సు డ్రైవర్ తెల్లవ్యక్తి. అతడు రోజా పార్క్స్ దగ్గరకు వచ్చి తెల్లవారికి సీట్లుకావాల లేచి నిల్చోమన్నాడు. రోజాపార్క్స్‌నే కాక మరో ముగ్గురు నల్ల ప్రయాణీకుల్ని వుద్దేశించి కూడా అతడామాట అన్నాడు. రోజువారీ మామూలును దృష్టిలో పెట్టుకుని మిగతా ముగ్గురూ బస్సుడ్రైవర్ మాట శిరసా వహించారు. కానీ రోజాపార్క్స్ మాత్రం సీటులోనుంచి లేవలేదు. పగలంతా పని చేసి ఆమె బాగా అలసిపోయి వుండింది. అప్పుడామెను బలవంతంగా సీటు నుంచి లాగిపారేశారు. శాంతికి ముప్పుతెచ్చిందన్న సాకుతో ఆమెను అరెస్టుకూడా చేశారు.

మాంట్ గోమేరీలో కానీ దక్షిణ ప్రాంతంలోని మరే పట్టణంలో కానీ శాంతిని కాపాడ్డమంటే ఇదీ అసలు కథ : బస్సులో ఎక్కబోయే నల్ల ప్రయాణీ

కుల్ని ఎవరూ తిట్టకపోతే వాళ్ళు ముందు ద్వారం గుండానే బస్సులోకి ప్రవేశిం చొచ్చు. బస్సెక్కి డబ్బు చెల్లించి దిగిపోవాలి. ఒకవేళ బస్సు గనక కదల్లేదను కోండి- చాలాసార్లు ఇలా జరిగింది కూడా- నల్ల ప్రయాణీకులు బస్సు దిగి వెనక ద్వారం గుండా మళ్ళీ బస్సులోకెక్కి ఖాళీగా వున్న సీట్లల్లో కూచోవచ్చు. అయితే తెల్ల ప్రయాణీకులకు గనక చాలనన్ని సీట్లు లేకపోతే మాత్రం వాళ్ళు ఆ సీట్లు కూడా వదలు కోవలసిందే.

మాంట్ గోమెరా పట్టణంలో దాదాపు 50 వేల మంది నల్లవారు నివసి స్తూండేవారు. అంటే పట్టణ జనాభాలోని ప్రతి ముగ్గురిలోనూ ఒకరు నల్ల వారన్నమాట. కానీ మునిసిపల్ బస్సు ప్రయాణీకుల్లో మాత్రం వీరి శాతం 70 దాకా వుండేది. రోజా పార్క్స్ అరెస్టుతో నల్లవారి సహనం పూర్తిగా చచ్చింది. ఒక రోజు బస్సు ప్రయాణాన్ని బహిష్కరించాలన్న భావం పుట్టింది.

బహిష్కరణ నిర్వహించాలనుకున్న వారికి సమావేశం యేర్పాటు చేసు కోడానికి గాను యువకుడైన మార్టిన్ లూథర్ కింగ్ తన చర్చిలో సౌకర్యం కల్పించాడు. డిసెంబరు 5 వ తారీకున బహిష్కరణ నిర్వహించాలనుకున్నారు. నల్ల జనాభాలో కనీసం 60 శాతం మంది తమకు తోడు ఉంటారని నిర్వాహకులు ఆశించారు కానీ తెలివితేటలు గల పోలీస్ ప్రధాన అధికారి తమకు సహకరిస్తాడని వారు ఆశించ లేదు. ఆ పోలీస్ ప్రధాన అధికారి, బహిష్కరణను ఖాతరు చేయొద్దని నల్ల వాళ్ళకు విజ్ఞప్తి చేశాడు. అయితే బహిష్కరణను కొనసాగించే వారిని తాను బలపరుస్తానని మాత్రం హామీ యిచ్చాడు. ఆయన మొత్తానికి బహిష్కరణ నిర్వాహకులకు సహాయపడ్డాడు. డిసెంబరు 5 వ తారీకున ప్రతి బస్సు వెనకా ఓ పోలీస్ మోటారు సైకిల్ వెంబడించింది. ఈ పోలీస్ ఎస్కార్ట్ చూసేసరికి మెతగ్గా వున్న నల్లవారు సైతం ప్రమాదం ఎదురు కావచ్చునని తప్పుకోసాగారు తప్ప బస్సులు ఎక్కాలనుకోలేదు. బహిష్కరణ దాదాపు నూటికి నూరుపాళ్ళు విజయవంతం కావటం నిర్వాహకులను ఆశ్చర్యంలో ముంచింది.

ప్రొద్దున ఆరు గంటలకు మార్టిన్ లూథర్ కింగ్ వంటగదిలో కూచుని కాఫీ తాగుతున్నాడు. ఏమవుతుందోనన్న ఆదుర్దాతో ఆవేశంతో ఆయనకు రాత్రి సరిగా నిద్రపట్టలేదు. ఇంతలో "ఇలా రండి త్వరగా చూద్దురు గానీ" అంటూ ఆయన భార్య కోరెట్టా కేకేసింది. వాళ్ళ కిటికీ దగ్గరున్న బస్టాపంతా పూర్తిగా నిర్మానుష్యంగా వుంది. అప్పుడే ఒక బస్సు అటు వెళ్ళింది. అందులో ఒక్క

పిట్ట కూడా లేదు. పూర్తిగా ఖాళీగా వుందది. మామూలుగా అయితె అలా ప్రొద్దున్నే బయల్దేరే బస్సుల్లో నల్ల జనం నిండా వుండే వారు. ఇళ్ళల్లో పని చేసే నల్ల యువతులు వంటపని చేసే యువతులు యిలాటి వారంతా ఆ బస్సు నిండా వుండేవారు. వీరు పట్టణంలోని తెల్లవాళ్ళ ఇళ్ళల్లో పని చేస్తారు. ఇంతలో మరో బస్సు వెళ్ళింది- అది కూడా ఖాళీగా, పూర్తి ఖాళీగా వెళ్ళింది. తరువాత వచ్చిన బస్సులో ఇద్దరే ఇద్దరు తెల్ల ప్రయాణీకులున్నారు. ముందు సీట్లు, వెనక సీట్లు అన్నీ ఖాళీగానే వున్నాయి. ఆ ఖాళీ బస్సుల్లో వాళ్ళు నృత్యం కూడా చేసుకోవచ్చు.

అదే రోజు ఉదయం రోజా పార్క్స్ నేరం చేసినట్లు ధృవీకరించుకుని 14 డాలర్లు జరిమానా విధించారు. ఆ రోజు సాయంకాలం బహిష్కార కమిటీ అధి నేతగా కింగ్‌ను ఎన్నుకున్నారు. విజయం సాధించేదాకా బహిష్కారం కొనసాగు తుందని ప్రకటింపబడింది. అయితే ఏమాటకామాటే చెప్పుకోవాలి, ప్రతి ఒకరూ ఆ విషయం నమ్మారు కాదు.

ఆ కమిటీలో నేతృత్వ స్థానానికి మార్టిన్ లూథర్ కింగ్ ఎన్నికయ్యా డంటే అందుకు కారణం ఆయన మాంట్‌గోమేరీకి క్రొత్తగా వచ్చిన వ్యక్తి కాబట్టి, స్థానిక అధికార ప్రతినిధుల్లో కానీ పోటీనల్ల గ్రూపుల్లో కానీ ఆయనకు ప్రత్యర్థు లెవరూ లేకపోవడమే. అందరికీ ఆమోదయోగ్యమైన వ్యక్తి కావలసివచ్చింది; ఆ వ్యక్తి ఆయనే. ఆయనకు ఏకగ్రీవ తోడ్పాటు లభించింది. నాయకత్వంకోసం ప్రయత్నించని కింగ్ విస్తుపోయాడు. ప్రతి ఒకటీ చాలా త్వరగా సంభవించింది; అయితే అందులో ఎక్కువ భాగం దాని పాటికదే సంభవించింది.

"మాకొక మోసెస్ ప్రసాదించబడ్డా" డని ఆ పట్టణానికి చెందిన నల్ల వ్యక్తి ఒకరు చాలాకాలం తర్వాత అన్నారు. ఆ వ్యక్తి పేరు ఇ. డి. నిక్సన్. బహిష్కరణ అనే భావం నిక్సన్ బుర్రలో పుట్టిందే. నల్లవారికి ఆశించిన దాని కంటె ఎక్కువే లభించింది. అయితే ఆరోజు అప్పటికింకా వారికా విషయం తెలీదు. బహిష్కరణ కమిటీకి ఆకస్మికంగా ఎన్నుకోబడిన నాయకుడు తన ప్రప్రథమ రాజకీయ ప్రసంగాన్ని హడావిడిగా ఇరవై నిమిషాల్లో రాయక తప్పింది కాదు. చర్చిలో పూజా పునస్కారాలు చేయడానికి ఆయన మామూలుగా పదిహేను గంటలపాటు సన్నాహాల్లో మునిగేవాడు. హోల్ట్ వీథిలోని అపరిచిత చర్చిలో జరగబోయే సమావేశానికి ఆలస్యంగా హాజరు కాకూడదంటే మరి హడావిడిగా ఇరవై నిముషాల్లోనే ఆ ప్రసంగం రాయక తప్పలేదు. జనంతో కిటకిటలాడుతున్న చర్చి అంతా అల్లకల్లోలంగా వుంది. వీధిలోవున్న 4 వేలమంది

నల్లజనం కూడా అల్లకల్లోలంగా వున్నారు. అసాధారణమైన ఆ విస్తృత సంఖ్యలోని శ్రోతల్ని చూసి ఆయన ఎంత సంతోషించారో అంత కంగుతిన్నారు. ఆయన గొంతు మాత్రం దృఢంగా, గట్టిగా లయబద్ధంగా ఇలా వినిపించింది.

"ప్రజలు అలసిపోయే సమయం వస్తుంది. మనల్ని ఇంత కాలంగా అగౌరవిస్తూ వచ్చిన వారి నుద్దేశించి యీ విషయం తెలియ చెప్పడానికి యీ సాయంత్రం మనమిక్కడ ఆలకూడాం; అయ్యా మేము అలసిపోయాం, సామాజిక బహిష్కరణతోనూ, అవమానాలతోనూ పీడనతాడనలతోనూ మేము అలసిపోయామని తెలియజెప్పడానికి మనమిక్కడ ఆలకూడాం. నిరసన తెలపడంతప్ప మనకు మరో ప్రత్యామ్నాయంలేదు. అనేక యేళ్ళపాటు మనం ఆశ్చర్యం కలిగించే సంయమనం ప్రదర్శించాం. మనపట్ల వారు వ్యవహరిస్తున్న తీరుతెన్నులు మనకు నచ్చినట్లు మనం కొన్నిసార్లు మన శ్వేత సోదరులకు తెలిపాము. అయితే ఆ సంయమనం నుంచి బయట పడడానికి మనమీరాత్రి ఇక్కడ చేరాం."

ఆ బహిష్కరణ 381 రోజులపాటు కొనసాగి చరిత్రకెక్కింది. అది సమానత్వంకోసం క్రియాశీలంగా ప్రారంభమైన పోరాటంగా అది యిపుడు పరిగణింపబడుతున్నది.

నల్లవారు మరీ అస్తవ్యస్తంగా సంఘటితం కాలేదు. మొత్తం మీద వారు సంఘీభావం వ్యక్తం చేశారు. నల్లటాక్సీ యజమానులేమో బహిష్కరణలో పాల్గొన్న వారిని ఇంటి దగ్గర్నుంచీ పని దగ్గర వదలి మళ్ళీ ఇంటికి చేర్చేవారు. ఈ పనికి వారు బస్సులో వసూలు చేసే ఛార్జీలను మాత్రమే వసూలు చేశారు తప్ప ఎక్కువ వసూలు చేయలేదు. బహిష్కరణ కోసం పంపిన డబ్బుల్తో 20 వాహనాలు కొన్నారు. నల్ల ప్రయాణీకులను పనిదగ్గరకు చేరవేయడానికి ఆ వాహనాలు అవసరం. అయితే మొత్తం మీద అత్యధిక సంఖ్యాకులు ప్రొద్దున్నే లేచి కాలినడకనే వెళ్ళేవారు. నల్లవారి ఇళ్ళకూ వారు పనిచేసే తెల్ల కుటుంబాలున్న ఇళ్ళకూ మధ్య కొన్నిమైళ్ళ దూరం వుండేది. అందుచేతనే యీ బహిష్కరణ "స్వేచ్ఛకోసం నడక"గా పిలవబడసాగింది.

ఇప్పుడు కింగ్‌కు నగరంలో పేరొచ్చింది. కొత్తగా లభించిన పేరు ప్రఖ్యాతులతో. ప్రథమంగా కొంతమంది గౌరవించసాగారు. ప్రథమంగా మరి కొంత మంది ద్వేషించసాగారు. ప్రేమకంటె ద్వేషమే ఎక్కువ అనుభూతమవుతుందని ఆయన కనిపెట్టాడు. ఏది ఏమైనా ద్వేషం తన్ను తాను వ్యక్తీకరించుకోడానికి ఎక్కువ ఫలప్రదమైన పద్ధతులను వినియోగించు కుంటుంది. జనవరి 30 వ తారీకున అంటే బహిష్కరణ ప్రారంభమైన రెండవ మాసంలో

శ్వేతజాతి దురహంకారులు ఆయన ఇంటిపై బాంబు విసిరారు. అది మొదటి బాంబు, ఆ తర్వాత చాలా పడ్డాయి. అది ఇంటి ముందర పోర్చ్‌పైపడి పేలింది. కింగ్ ఎక్కడో సమావేశంలో వున్నాడు, ఆయన భార్యకొరెట్టా, చిన్న కూతురు గాయపడకుండా తప్పించుకున్నారంటే అది అద్భుతంకిందలెక్క.

కింగ్ యువకుడు, అనుభవరహితుడు. ఆయన సాధించాలనుకుంటున్న లక్ష్యం అంత కష్టమైందేమీకాదు. తెల్లవారు ఏ షరతులపై పౌర రవాణా సౌకర్యాలను వినియోగించు కుంటున్నారో నల్లవారికికూడా అదే హక్కు సాధించి పెట్టాలన్నది ఆయన లక్ష్యం. ఆ లక్ష్యం స్వార్థహితమైనది. ఎందుకంటే ఆ యువ పురోహితుడికి సొంతకారు వుంది. చర్చి ఆయన యింటికి దగ్గరే. బస్సుల విషయంలో సమాన హక్కులు సాధించాలన్నప్పటికీ తన ప్రాణాలను సమర్పించ డానికేకాక తనకు దగ్గరగా వున్న వారి ప్రాణాలను కూడా మూల్యం చెల్లించ డానికి సిద్ధంకాక తప్పదని ఆయన గ్రహించాడు. ఆయన ఎన్నుకోబడింది మహా అయితే బహిష్కార కమిటీ నాయకుడి గానే తప్ప అంతకు మించి మరేమీ కాదు. ఆ మాత్రానికే ఆయన శ్వేతవర్ణ దురహంకారుల దాడులకు ప్రధాన లక్ష్యంగా తయారయ్యాడు.

బస్సుల బహిష్కరణ అనివార్యంగానే కింగ్ ఏ పంథా అవలంబించాలి అనే సమస్యను లేవనెత్తింది. తాను ఆ సమయంలో పడ్డానని ఆ తరువాత ఒప్పుకో డానికి ఆయనేం సిగ్గు పడలేదు.

ఆయన ఇంటి ముందున్న పోర్చ్‌పై మొదటి బాంబు పేలే సమయానికి కింగ్‌లో సందేహాలున్నాయి. నగర మేయర్ డబ్ల్యు. ఎ. గేల్ ("ట్యాకీ") పోలీసుల్ని వెంటపెట్టుకొని నేరస్థలానికి వచ్చినపుడు కోపోద్రిక్తులయిన నల్ల జనాలు ఆయన మీదబడి కొట్టడానికి సిద్ధంగా వున్నారు. నగర మేయర్, శ్వేత వర్ణ దురహంకారులపట్ల పక్షపాతం చూపాడన్నది వారి భావం. కింగ్ ఇంటికి హడావిడిగా వచ్చి ఏ క్షణాన్నయినా గలభా జరగవచ్చునని గ్రహించాడు. ఆయన పడిపోయిన పోర్చ్‌ను లేవనెత్తి కోపోద్రిక్తంగా వున్న నల్లవారిని మొత్తానికి ఎక్కడివారిని అక్కడికి పంపించగలిగాడు. (పోర్చ్ అంటే ఇంటి ముందున్న దారిపైగల తేలికపాటి కప్పు).

**"కంగారు పడకండి...మనం హింసను అవలంబించడం లేదు... మనం మన శ్వేత సోదరులను ప్రేమించాలి నన్ను ఆపినప్పటికీ యీ ఉద్యమం మాత్రం ఆగదు. మనం చేస్తున్నది న్యాయబద్ధమైనది..."**

ఏమైనా మాంట్ గోమెరీ నల్ల పౌరులు విజయం సాధించారు.

నల్లవారికి బస్సుల్లో ఇష్టం వచ్చిన చోట కూచునే అధికారం వున్నదని 1956 డిసెంబరు 21 వ తారీఖున అమెరికా సుప్రీం కోర్టు తీర్పు యిచ్చింది.

దక్షిణాది రాష్ట్రాలకు చెందిన శ్వేతవర్ణ దురహంకారులు ప్రప్రథమంగా కింగ్ దృఢ దీక్షను చవి చూశారు. యువ మత గురువుకు నూతన జీవితం ప్రారంభమైంది; అది పోరాట యోధుని జీవితం. నిద్రకు కూడా దూరమై పోరాడడం నేర్చుకున్నాడు; ఏదో అప్పుడప్పుడూ మాత్రమే కుటుంబ సభ్యుల్ని చూసేవాడు. ఆయన ఇప్పుడు జాతీయ స్థాయి గుర్తింపుగల వ్యక్తి; రాజకీయ ప్రసంగాలు చేస్తూ, అవసరమైన డబ్బులు కష్టపడి వసూలు చేస్తూ సంఘీభావాన్నీ సానుభూతినీ సాధించడానికి కృషిచేస్తూ ఆయన అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో విస్తృతంగా పర్యటించాడు. స్వేచ్ఛా ప్రదర్శనల అగ్రభాగాన నిల్చే గౌరవ ప్రదమైన అధికారమూ, ప్రమాదకరమైన అధికారమూ రెండూ లభించాయి.

బహిష్కరణ పోరాటం అనంతరం కింగ్ పెద్ద, సుసంఘటిత గ్రూపుల శక్తి యేమిటో అర్థం చేసుకున్నాడు. ఆయన క్రమేణా అహింసాయుతమైన ప్రజా "ప్రత్యక్ష కార్యాచరణ" ఎత్తుగడలను రూపొందించాడు; మహాత్మాగాంధీ పద్ధతులను దక్షిణాదిరాష్ట్రాల వాస్తవాలకు అన్వయింప చేశాడు. బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో మహాత్మాగాంధీ పౌరశాసనోల్లంఘన ఆయుధాన్ని చేపట్టాడు. గాంధీలాగే కింగ్ కూడా 19 వ శతాబ్దికి చెందిన సుప్రసిద్ధ అమెరికన్ కవీ, తత్వవేత్త అయిన హెన్రీ థోమా భావాలచే వుత్తేజం పొందాడు. హెన్రీ థోమా "పౌరశాసనోల్లంఘన" (సివిల్ డిస్ ఒబీడియన్స్) అనే తన గ్రంథంలో ప్రభుత్వం చేసే న్యాయబద్ధం కాని చట్టాలను, చర్యలను ప్రతిఘటించే అధికారం పౌరుల కున్నదని వాదించాడు.

మరైతే అహింస ఎందుకు? కింగ్, తాను యీ పద్ధతిని ఎందుకు ఎంపిక చేసుకున్నాడో పలుసార్లు వివరించాడు. "లుక్" అనే పత్రిక కోసం రాసిన వ్యాసంలో (ఆయన మరణించాక ఆ వ్యాసం అచ్చయింది) ఆయన యిలా అన్నారు :

"అహింస అన్నది దక్షిణ ప్రాంతంలో సృజనాత్మక సిద్ధాంతం; ఎందుచేతనంటే, నీగ్రోలను భౌతికంగా మట్టుబెట్టే అవకాశం కోసం ఆత్రంగా ఎదురు చూసే పచ్చి సామాజిక బహిష్కార వాదులను అది నిరాశా నిస్పృహలకు గురి చేసింది. వీధుల్లో క్రియాశీలమైన నిరసన వ్యక్తం చేయడానికి అహింసాయుత ప్రత్యక్ష కార్యాచరణ నీగ్రోలకు తోడ్పడింది; అది పీడకుల తుపాకుల నోళ్ళు మూసింది; ఎందుకంటే ఎంత పీడకుడయినా పట్టపగలు నిరాయుధులయిన

పురుషులపై స్త్రీలపై పిల్లలపై కాల్పులు జరపలేకపోయాడు. ఉత్తర ప్రాంతంలో పది రోజుల్లో జరిగిన దాడుల్లో సంభవించిన ప్రాణనష్టంకంటె దక్షిణ రాష్ట్రాల్లో సాగిన నిరసన సందర్భంగా జరిగిన ప్రాణనష్టం తక్కువగా వుండడానికి యిదే కారణం".

కింగ్ దృష్టిలో అహింస అంటే చెడ్డను ప్రతిఘటించకుండా వుండడం కాదు. ఆయన యిలా నొక్కి చెప్పారు. "అన్యాయమైన వ్యవస్థకు నిష్క్రియా పరంగా సహకరిస్తే, అది పీడకునిలాగే పీడితుని కూడా చెడువానిగా చేస్తుంది."

తన పోరాటం తాలూకు తొలి సంవత్సరాల అనుభవం గురించి కింగ్ యిలా రాశారు. "జాతి రుగ్మతలను ప్రక్షాళనం చేయడానికి బ్రహ్మాండమైన రక్తపాతం జరగాలని కొందరన్నారు. వారు తమ హింసా పద్ధతిని కవ్వింపు చర్యనూ సమర్థించుకోడానికి చారిత్రక సంప్రదాయాన్ని చూపించారు; రోమ్ లోని స్పార్టకస్‌నుంచి అమెరికా అంతర్యుద్ధం వరకూగల చారిత్రక సంప్రదాయాన్ని వారు ప్రస్తావించారు. అయితే 1955 లో దక్షిణ ప్రాంతంలోని నీగ్రో, తనకు వ్యతిరేకంగా మోహరించిన శక్తుల బలాన్ని అంచనా కట్టి యీ పద్ధతిలో తన విజయానికి స్వల్పాతి స్వల్ప అవకాశం కూడా లేదని గ్రహించాడు. అతడు నిరాయుధుడు, అసంఘటితుడు, తర్ఫీదులేని వాడు, ఐక్యత లేనివాడు, అన్నిటికంటె ముఖ్యంగా తెలిసి తెలిసి రక్తం చిందించడానికి మానసికంగానూ నైతికంగానూ సన్నద్ధంగాలేడు. అవసరమైతే స్వేచ్ఛకోసం మరణించడానికి అవసరమైన ధైర్యాన్ని అతడి నిరాశా నిస్పృహలు అతడిలో సిద్ధంచేసిన మాట నిజమే అయినప్పటికీ విజయావకాశం లేనందువల్ల జాతి పరంగా ఆత్మహత్య చేసుకోడానికి అతడు సుముఖంగా లేడు."

జనాలను సమీకరించడమే తన మార్గమని కింగ్ గ్రహించాడు. కోర్టు తీర్పులతో సామాజిక బహిష్కారాన్ని (సెగ్రిగేషన్) అధిగమించడం సాధ్యం కాదని గుర్తించాడు. సామాజిక బహిష్కారానికి వ్యతిరేకంగా ఆయన ప్రజా ప్రదర్శనలను, బహిష్కరణను, బైఠాయింపు కార్యకలాపాలను ప్రతిపాదించి అమలుపరచాడు. ఆయన దక్షిణ ప్రాంతంలోని శ్వేతవర్ణ దురహంకారులకు వ్యతిరేకంగా అహింసతో కూడిన ప్రత్యక్ష సంఘర్షణా పంథాను ఎన్నుకున్నాడు. ఆ విధంగా ఆయన బుద్ధిపూర్వకంగానే సంక్షోభాలను, ఉద్రిక్తతను సృష్టించాడు. ఆయన ఉద్రిక్తతను "సృజనాత్మకమైనది"గా అభివర్ణించాడు. ఎందుచేతనంటే, నల్లవారు తమ డిమాండ్లనూ కృతనిశ్చయాన్నీ ప్రస్ఫుటంగా ప్రదర్శించడం ద్వారా అంతర్ వర్ణ సంబంధాలతో నూతన వాతావరణం సృష్టించగలిగారు.

సంక్షోభాలన్నవి అన్యాయమైన చట్టాలనూ, సామాజిక బహిష్కార పద్ధతినీ రద్దుచేయడానికి వుద్దేశించిన సంప్రదింపుల దిశగా సాగే మార్గాలు; ప్రజా కార్యాచరణలచే పటిష్ఠం కాబడే సంప్రదింపులవి.

ప్రయాణం ఎల్లప్పుడూ మొదటి అడుగుతోనే ప్రారంభమవుతుంది. మాంట్‌గోమెరీలో మార్టిన్‌లూథర్ కింగ్ తన మొదటి అడుగువేసినపుడు ఆ ప్రయాణం ఎంత దీర్ఘమైనదో ఆయనకు తెలీదు.

రోజాపార్క్స్, ఇంకా మాంట్‌గోమేరీకి చెందిన 50 వేల మంది నల్లవారు ఇప్పుడు బస్సుల్లో ముందున్న సీట్లల్లోనే కూచుంటున్నారుకానీ, వ్యతిరేకులు ఉరిమిచూస్తూంటే కొంత మంది మళ్ళీ వెనక సీట్లకు జారుకుంటున్నారు. అలాగే అప్పుడప్పుడు సాయంత్రం పూట తెల్లవారు, నల్లవారు కలిసి పక్కపక్కన కూచుంటున్న బస్సులను తగలబెడుతున్నారు. రెస్టారెంట్లు, కెఫేల, హోటల్‌ల పార్క్‌ల ద్వారాల వద్ద యిప్పటికీ "తెల్లవారికి మాత్రమే" అన్నబోర్డులు వేలాడుతున్నాయి.

నేను 1961 లో ప్రప్రథమంగా దక్షిణ ప్రాంతానికి వెళ్ళినపుడు, అంటే సుప్రసిద్ధమైన బస్సుల బహిష్కరణ జరిగాక అయిదేళ్ళకు మాంట్‌గోమేరీలోని ఎలైట్ కెఫె ముందు నేనొక నోటీసు గమనించాను. తాము అనుకున్న ఏ ఖాతాదారునికి సేవ చేసేందుకైనా నిరాకరించే అధికారం కెఫే యజమానులకు వున్నదని ఆ నోటీస్‌లోవుంది. "ఏ ఖాతాదారుడైనా" అంటే అర్థం ఏ నల్ల వ్యక్తి అయినా అనే.

నేను ఆ పర్యటన సందర్భంగా మార్టిన్ లూథర్‌కింగ్‌తో పరోక్ష పరిచయం చేసుకున్నాను. దక్షిణ ప్రాంత అమెరికాలోని సంప్రదాయాలతో ప్రత్యక్ష పరిచయం కూడా చేసుకున్నాను.

## పొరపాట్ల నుంచి గుణపాఠం

అప్పటికి నేనింకా అమెరికాకు కొత్తవాణ్ణే. న్యూయార్క్‌లో ఆరు వారాల కంటె ఎక్కువ గడపలేదు. నేను అప్పుడు పార్క్ ఎవెన్యూలోని 87 వ వీథిలో మూలన నివసిస్తున్నాను. అక్కడికి హార్లెమ్ అట్టే దూరంలోలేదు. (హార్లెమ్ అంటె న్యూయార్క్‌లో నల్లవారు నివసించే ప్రాంతం-అనువాదకుడు) హార్లెమ్ ప్రక్క వీథే అయినప్పటికీ అది వేరుగానే వుండేది. నేను మొదట అమెరికన్ల నిర్దాక్షిణ్యపు ఆత్మ విమర్శ చూసి నివ్వెరపోయాను. వారు హార్లెమ్‌ను ఛాలా నీచంగా "నీగ్రోలపేట" (గెట్టో) అని పిల్చేవాళ్ళు. హార్లెమ్ చుట్టూ గోడలు

లేవు, ముళ్ళ తీగెలు లేవు, కాపలా కుక్కలులేవు భౌతికంగా మాత్రం అది మన్‌హట్టన్‌తో కలిసిపోయి వుండేది. అయినప్పటికీ ప్రజలు మామూలుగానే దాని "నీగ్రోల పేట" అనే ప్రస్తావించేవాళ్ళు.


ఆ వర్షాకాలపు రోజుల్లో నేను లెక్షింగ్టన్ అవెన్యూలోని 86వ వీధి నుంచి భూగర్భ రైల్వేలోకి దూరబడేవాణ్ని. రైలుపెట్టెలు హార్లెమ్ వాసులతో కిట కిట లాడుతూండేవి. వారంతా "హండ్రెడ్స్" అనే ప్రాంతంలో భూగర్భ రైల్లో ఎక్కేవారు. నేను నగరానికి కొత్త కాబట్టి వీరితో నాకు బంధుత్వం వున్నట్లు భావించేవాణ్ణి. వారు కూడా మొత్తానికి కొత్తవారే. మా మధ్య పరస్పర సంబంధాలు లేనట్లు నేను కూడా భావించేవాణ్ని. అంటే మా మధ్య మానసికంగా అడ్డగోడ ఉన్నట్లుండేది. వారి దృష్టిలో నేనొక తెల్లవాణ్ణి తప్ప మరేమీకాదు.

నేను రాయాల్సిన అంశాల్లో నల్లవారి వ్యవహారాలు కూడా ఒకటని ఒక విలేఖరిగా సహజంగానే నేను అనుకున్నాను. కొద్ది కాలంపాటు అమెరికాలో వుండడానికి వచ్చిన నా స్నేహితులొకరు అప్పుడు నాతో యిలా అన్నారు. "నల్ల వాళ్ళ జీవితం గురించి ఇది బాగలేదనీ అది బాగాలేదనీ మనం రాస్తుంటాం. కానీ. క్యాడిలాక్స్ కార్లు నడిపే నల్లవారిని నేను చూశాను..."

మరి ఆనాడు నల్లవారి పరిస్థితి యేమిటి ? వారు క్యాడిలాక్స్ కార్లు నడుపు కుంటూవుండినారా? లేక తెల్లవారితో దెబ్బలు తింటూవుండినారా? 1961 డిసెంబరు ఆఖరు ప్రాంతంలో నేనూ నా మిత్రుడూ దక్షిణ ప్రాంతానికి వెళ్ళాం. నల్ల అమెరికన్ల పరిస్థితి గురించి క్రిస్‌మస్ సందర్భంగా వార్తలు రాయడానికి మేము అటు వెళ్ళాం.

...వాషింగ్టన్ రైలు చట్టనూగా నగరం దిశగా దూసుకుపోతున్నది. టెన్నిస్, జార్జియా సరిహద్దుల్లో చట్టనూగా నగరం వుంది. ఉషోదయం కాబోతున్నది, చలిగాలులు వీస్తున్నాయి. మబ్బులు కదులుతున్నాయి. రైళ్ళోని నల్ల పని మనిషి (అటెండెంట్) మమ్మల్ని ఉదయం ఏడు గంటల ప్రాంతంలో లెగ్గొట్టాడు. మేము చలికి వణుకుతూ ప్లాట్ ఫారమ్ మీదకు దిగాం. ప్లాట్ ఫారమ్ అంతా ఆరుబయలుగావుంది. అంతకు కాస్త ముందే రైళ్ళోంచి దిగిన తెల్లజాతి కండక్టర్ నల్లజాతి అటెండెంట్‌ను వుద్దేశించి. వాషింగ్టన్‌లో వాతావరణం యెలా వుందని ప్రశ్నించాడు ఆ నల్లజాతి వ్యక్తి చాలా అణకువగా ఒకే ఒక మాటతో "అవును సార్, లేదు సార్" అంటూ సమాధానాలిస్తున్నాడు.

అతను మునుపటితరం నల్లవారి రైల్వే అటెండెంట్ల ట్రేడ్‌యూనియన్‌కు చెందిన వ్యక్తి. అంతకు ముందు సాయంత్రం అతడు అతి అణుకువ స్వభా



డాక్టర్ కింగ్ అమెరికాలోని దక్షిణ ప్రాంతరాష్ట్రాలకు మహాత్మా గాంధీ పద్ధతులను అన్వయింప చేస్తూ అహింసా, సామూహిక "ప్రత్యక్ష కార్యాచరణ" ఎత్తుగడలను రూపొందించాడు.

వంతో సగం సేవకుడిగానూ సగం విదూషకుడిగానూ తన పాత్ర నిర్వర్తించాడు. నవ్వించే విదూషకుడంటే పెద్దమనుషులకు అయిష్టమేమీ లేదని తెలుసుకుని అతడు అలా ప్రవర్తించాడు. కాకపోతే ఆ విదూషకుడు వాళ్ళకు కాస్త దూరంగా నిలబడాలి. అయితే అలా విదూషకుడిగా ప్రవర్తించడం అతడి సహజ స్వభావం కాదు. తనకు పరిచయం వున్న తెల్లవారు మరి నల్లవారిని ఆ విధంగానే ఊహించుకుంటారు కాబట్టి అతడలా విదూషకపాత్ర నిర్వహించాడు.

అయితే ఈ రోజు ప్రొద్దున్నే ప్లాట్‌ఫారమ్ మీద అతడు కండక్టర్ ముందు చాలా దిగులుగా, పెద్దమనిషి తరహాగా నిలబడ్డాడు. అతడి ప్రవర్తనలో మార్పురావడానికి కారణం రాత్రిగడచి తెల్లవారిందనికాదు, అందుకు కారణం మా రైలు ఇప్పుడు దక్షిణం గుండా వెళ్తూండడమే.

ఆ రోజు ఉదయం, ఇంకా క్రిస్మస్ రాలేదు, రైల్వే స్టేషన్ ఎదురుగావున్న చౌకు అంతా బోసిపోయినట్లు దాదాపు నిర్మానుష్యంగా వుంది. అయితే స్టేషన్‌లోని హెర్ట్జ అఫీసు మాత్రం సజీవంగా కళకళలాడుతూంది. డ్యూటీలోని అమ్మాయి మాకు షావర్లెట్ కారు తాళాలు అప్పగించడానికి ముందు మా డ్రైవింగ్ లైసెన్సులూ అవీ తనిఖీ చేసి ఒక పత్రంలో అవీ ఇవీ నింపింది. ఈ కొత్తనగరంలో తిరగడానికి మాకు స్వేచ్ఛ లభించింది. ఆ ఖాళీ వీథులగుండా మేము కార్లు నడుపుకుంటూ బయల్దేరాం.

చట్టనూగాలో క్రిస్మస్ కాస్తముందుగానే త్వరగా వచ్చేసింది. మేము క్రేక్ మోటెల్‌లో భోజనాలు ముగించుకుని నల్లచట్టనూగా అన్వేషణలో బయలుదేరాం. ఆమోటల్‌లో అంతా తెల్లబూర్జువా పౌరులే. వారంతా నింపాదిగా నిండుగా నిస్తేజంగా కూచున్నారు.

షాపుల్లోకానీ వీధుల్లోకానీ ఎక్కడా జనం లేరు, అంతా నిర్మానుష్యంగా వుంది. రంగురంగుల విద్యుద్దీపాలు శీతల సౌందర్యంతో మెరిసిపోతున్నాయి. క్రిస్మస్ రాక సందర్భంగా తెల్ల అమెరికన్లు అలంకరించిన నక్షత్రాలు, ఎర్రపు క్రిస్మస్ వృక్షాలూ మాకు కనిపించాయి. షాపులు మూసివున్నాయి కానీ కిటికీలన్నీ విద్యుద్దీపాలతో వెలిగిపోతున్నాయి. షాపులనిండా సామాన్లు పుష్కలంగా వున్నాయి. ప్రధాన రోడ్డంబట అక్కడక్కడా వందలాది కార్లు అమ్మకం కోసం నిలిపివుంచారు. అవి దిక్కుదివాణం లేనివిగా కనిపించాయి; ఎందుకంటే వాటి అందం చూసి అనందించడానికి పేవ్‌మెంట్లపై జనమే లేరు

కదా. అవి సెకెండ్‌హాండ్ కార్లే అయినప్పటికీ ఆ విద్యుద్దీపాల వెలుగులో చాలా ఆకర్షణీయంగా సొగసులు పోతున్నాయి.

తరవాత మేము మా కార్లలో నగరంలోని మరో వీధికెళ్ళాం. అక్కడ ఇళ్ళన్నీ చెక్కతో నిర్మించినవి; ఇళ్ళ ముందు చిన్న పోర్చీలున్నాయి. ప్రతి చెక్కపాకలోని కిటికీలోనూ ఏసుక్రీస్తు బొమ్మ చుట్టూ వెలిగిపోతున్న ఎర్ర విద్యుద్దీపాలు, తెల్ల విద్యుద్దీపాలు, వాటిముందు చిన్నచిన్న పచ్చని పూలగుచ్ఛాలు. చీకటి వీధుల్లోకి బోసి వెలుగులు చిమ్ముతూ ఆ విద్యుదీపాలు ఎంతో దిగాలుగా మెత్తగ్గా కనిపించాయి. తొలినాటి క్రైస్తవులను వెన్నాడి వేధించిన రహస్య దీపాల్లాగా అవి మాకు కనిపించాయి.

అక్కడ స్పష్టమైన సంకేతాలేమీ లేవుకానీ మేము నల్లచట్టనూగా లోకి ప్రవేశించామనడం స్పష్టం.

మేము కార్లు దిగినడవడానికి బయల్దేరాం. క్రిస్‌మస్ దీపాలు అమాయకంగా వెలిగిపోతున్నాయి. పాదసంచారులు చాలా తక్కువ. తెల్లవారు ఇక్కడకు రాలేదని మేము భావించాం. ముఖ్యంగా రాత్రయితే, చీకటి మూలంగా రెండు వర్ణాలమధ్య వేర్పాటుతనం రాజ్యమేలుతుంది.

నల్లమొహాలవారు అటూ ఇటూ హడావిడిగా తిరుగుతున్నారు. మేము తెల్లవారమే కాక కొత్తవాళ్ళం కావటంతో రెండువర్ణాల వారి మధ్య అడ్డుగోడలు మరింత పెరిగాయి. కొత్తవాళ్ళు తారసపడినప్పుడు కాస్త జాగ్రత్తగా మెసలడం సహజమే. దక్షిణ ప్రాంత అమెరికాను అవగాహన చేసుకోడానికి మీరు చేసే ప్రయత్నాలు ఎన్నటికీ పూర్తిగా విజయవంతం కావు అని అటూ ఇటూ తిరిగే నల్లజనాలు మమ్మల్ని హెచ్చరిస్తున్నట్లు కనిపించింది. ఎందుచేతనంటే, నల్ల అమెరికన్ల ఆత్మ తెల్లవారికి కనిపించకుండా మూసివేయబడింది. ఆ ఆత్మను గ్రహించకుండా దక్షిణం గురించి మాకెలా తెలుస్తుంది.

మూడు వందంయేళ్ళ చరిత్ర మమ్మల్ని నిలిదీసి ప్రశ్నిస్తున్నట్లు కనిపించింది. 1619లో ప్రప్రథమంగా దక్షిణ ప్రాంత అమెరికాలో ఒక నౌకనిండా ఆఫ్రికా బానిసలు వచ్చి దిగారు. వీధుల్లో మాకు కనిపించిన నల్లవారి కళ్ళల్లో మాకు స్పష్టంగా అవిశ్వాసం, అవగాహనా రాహిత్యం, పరిశోధన కనిపించాయి. వారు అన్ని విషయాలనూ నల్లవారిగా కానీ తెల్లవారిగా కానీ అమెరికన్లుగా కానీ ఆఫ్రో-అమెరికన్లుగా కానీ చూశారు. ఆ శాపగ్రస్తమైన విభజన రేఖ తప్ప వారికి మరొకటి కనిపించలేదు. బజారులో పోతూపోతూ కలిసినప్పుడు కానీ బార్‌లో కానీ ఆఫీసులో కానీ సినిమాలో కానీ దాదాపు ప్రతీ నల్ల అమెరికనూ తెల్ల

అమెరికన్‌ను అవిశ్వాసంతోనే చూశాడంటే నేను తప్పుచేసినట్లు కాదు. మామూలుగా అంతర్ గర్భితంగా వుండే యీ వర్ణగత ఉద్రిక్తత అమెరికాలో ఎంత బలీయంగా వున్నదంటే ఎవరైనా విదేశీయుడు కూడా వద్దన్నా అది గ్రహిస్తాడు.

జార్జియా తాలూకు ఎర్రకొండల్లోనూ, డిసెంబరు అడవులగుండా సాగే కాంక్రీట్ రోడ్లలోనూ, పట్టణాల్లోని వీధుల్లో నిర్మించిన క్రిస్మస్ నక్షత్రాల్లోనూ, బల్బులతో మెరిసే వృక్షాల్లోనూ ఏదో కొంత గ్రామీణ వాతావరణం కనిపిస్తుండేది. క్రిస్మస్ వృక్షాలు, నక్షత్రాలు, నల్లవారి పేటలను కనిపించకుండా చేస్తుండేవి.

జార్జియాకు చెందిన రోమ్ పట్టణ జనాభా 30 వేలు. మేము అక్కడ చౌకులో ఒక విగ్రహం చూశాము. ఒక తోడేలు వుంది, ఆ తోడేలు రోములస్, రేమస్ లకు పాలుయిస్తున్నది. ఆ విగ్రహంకింద "రోమానోవా-రోమారేమస్"అనే అక్షరాలున్నాయి. 1929 బెనిటో ముసోలినీ పట్టణానికి ఈ విగ్రహం బహూకరించారు. ఈ పట్టణం మొత్తం ఏడుకొండల మీద వ్యాపించి వుంది. అందుకే దానికాపేరు వచ్చింది. వీటికి ప్రక్కనే మరోకొండపై నల్ల రోమన్లు నివసిస్తున్నారు. వీరు బహిష్కృతుల్లాగా నివసిస్తున్నారు.-

మేము మరుసటిరోజు ఉదయం వాణిజ్య మండలి కార్యాలయానికి వెళ్ళి వాణిజ్య మండలి అధిపతి కాలిన్స్‌ను కలిశాం. రోమ్‌లోని వ్యాపారుల్లో 820 మంది తమ వాణిజ్య మండలానికి చెందినవారేనని ఆయన మాతో అన్నారు. అయితే అందులో ఒక్కరుకూడా నల్లవారు లేరు. ఇందుకు ఆయన ఇచ్చిన సంజాయిషీ సమర్థనీయమైనదిగా లేదు. సొంత వ్యాపారం వున్న నల్లవాళ్ళు లేనే లేరు, అంతే అంటాడాయన.

రోమ్‌కు దక్షిణంగా 94 మైళ్ళ దూరంలో లాగ్రేంజ్ అనే పట్టణం వుంది. ఇంకొంచెం దక్షిణంగా ముందుకెళ్తే సామాజిక బహిష్కరణ (Segregation) మరింత నిర్వివాదంగా కనిపిస్తుంది. మొత్తం జనాభాలో నల్లవారు 26 వేల మంది. వీరి స్కూళ్ళు ప్రత్యేకం, ఆసుపత్రులు ప్రత్యేకం, సేవారంగం ప్రత్యేకం. షాపులు మాత్రమే ఇద్దరికీ సమానత్వ ప్రాతిపదికపై వున్నాయి; ఎందుకంటే డబ్బుకు వాసన లేదుకదా!

మేము బస్‌స్టేషన్ దగ్గర ఎదురుచూస్తున్నాం. ఇంతలో పెద్ద బస్సు ఒకటి వచ్చి ఆగింది. బస్సుకు అటూఇటూ తెల్లరంగు మెరిసిపోతున్నది. ఆ తెల్లరంగుపై ఓ వేటకుక్క బొమ్మ చిత్రించబడివుంది. ముందు తెల్లవాళ్ళుదిగారు, తర్వాత నల్లవాళ్ళు దిగారు. నల్లవాళ్ళసీట్లు వెనక వుంటాయి. ఒక వృద్ధ నల్లమహిళ బస్సు

దిగి బస్టేషన్ ప్రధాన ద్వారంవైపు వెళ్ళబోయింది. ఆవిడ అలా లోపలకు చూసి మళ్ళీ వెనక్కుమళ్ళింది. అది తెల్లవాళ్ళకు కేటాయించిన విభాగం. వెనక్కువచ్చి తన విభాగమేదో చూసింది. అక్కడ "రంగు జాతులవారికి మాత్రమే" అన్న బోర్డువుంది. తెల్లవారికి కేటాయించిన విభాగం, నల్లవారికి కేటాయించిన విభాగం కంటె మూడునాలుగు రెట్లుపెద్దది; ఇందులో సౌకర్యాలు కూడా ఎక్కువే; చాలా శుభ్రంగావుంది, తళతళ మెరిసిపోతూంది, పెద్దద్వారం అదీ బ్రహ్మాండంగా వుంది. నల్లవారి విభాగం ముగ్గురు సైనికులు ఒక ఆఫీసరూ కూచునివున్నారు. వారు సైనిక సర్వీసులోవున్న అమెరికా పౌరులు. అమెరికా ప్రభుత్వం నల్లవారిని సైన్యంలోకి తీసుకుని దేశప్రయోజనాల రక్షణ బాధ్యతను వారికప్పగించింది కానీ లాగ్రేంజ్‌లోని బస్టేషన్‌లో మాత్రం వారిగౌరవాన్ని కాపాడలేకపోయింది. రోమ్‌లో తెల్లవారి, నల్లవారి మధ్య సంబంధాలు మామూలుగా వున్నాయని మాతో అన్నారు. ఎందుకని ? ఎందుకంటే మొత్తం జనాభాలో "రంగు జాతులవారు" 15 శాతం మేరకేవున్నారు కాబట్టి ప్రశాంతంగా అణగి మణగి వుండేవారు. "స్వేచ్ఛా పోరాటయోధులు" పట్టణంలోకి ప్రవేశించినప్పుడు మాత్రమే సామాజిక బహిష్కరణ సమస్యలగురించి తీవ్రంగా పట్టించుకోవలసి వుంటుందని స్థానిక వార్తాపత్రిక సంపాదకుడు క్రో మాతో అన్నారు. (అప్పుడు "స్వేచ్ఛా పోరాటయోధులు" బస్సుల్లో సామాజిక బహిష్కరణకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు) "మామూలు దక్షిణాది" వారికంటె తాను కాస్త వుదార వాదినని క్రో భావించేవాడు.

మేము మాంట్‌గోమేరీకి తిరిగి చేరుకోడానికి ముందు వారం రోజులపాటు జార్జియాలోనూ అలబామాలోనూ కారులో తిరిగాం. మేము ఆఖరుసారిగా ఆగిన పట్టణం టస్కీగీ; అది అలబామాకు చెందింది.

మేము రాత్రిపూట టస్కీగీ వెళ్ళాం. మేము మొదట బ్రాడ్‌స్ట్రీటుగా పిలవబడే ప్రధాన వీధిని కనుక్కోలేకపోయాము. ఆ వీధి రాత్రికూడా విద్యుద్దీపాలతో వెలిగిపోతూంటుంది. కానీ ప్రొద్దున మాత్రం అంతా స్పష్టంగా కనిపించింది. బ్రాడ్‌స్ట్రీటూ, చౌకూ అన్నీచూశాం. చౌకులో కంచుతో చేసిన సైనికుని విగ్రహంవుంది.

అమెరికాలోని అంతర్యుద్ధ చరిత్రలో అస్పష్టతకు తావేలేదు. ఉత్తర ప్రాంతాలవారు దక్షిణ ప్రాంతాలవారిని జయించి నల్లవాళ్ళను బానిసత్వం నుంచి విముక్తి చేశారు. అయినప్పటికీ చరిత్రకు వ్యతిరేకంగా పరాజితుడుకాని కాంస్య సైనికయోధ విగ్రహమూ దాని కాళ్ళక్రింద విముక్తి పొందిన బానిసలిద్దరు

గడ్డికోసుకుంటున్నారు. అది విగ్రహం విశేషం! "నల్లజాతుల వారికి మాత్రమే" అని బోర్డు రాసివున్న ఆహార పదార్థాల దుకాణం ముందు కొంతమంది నల్లవాళ్ళు గోడకానుకుని ఎండలో నిల్చున్నారు. షరీఫ్ (శాంతి నిర్వాహక అధికారి) ఇంటి ముందు మాత్రమే యిలాటి నోటీసులేవీలేవు. ఆనాడు టస్కీగీ పట్టణంలో నల్ల వ్యక్తి షరీఫుగా నియమింపబడే అవకాశమేదీ లేదు.

చౌకు చివరన ఒక చిన్న భవనంలోని క్రింది అంతస్తులో "టస్కీగీ న్యూస్" పత్రిక సంపాదక కార్యాలయం వుంది. రిసెప్షన్ డెస్కు ముందు ఓ లావుపాటి వృద్ధ మహిళ కూచునివుంది. డెస్కు నిండా వార్తాపత్రిక లున్నాయి. దాదాపు పాతికేళ్ళపాటు ఆమె, ఆమె భర్త "టస్కీగీ న్యూస్"కు యజమాన్యం వహించారు. ఆ వార్తాపత్రిక సర్క్యులేషన్ 15 వేలు.

ఆ వృద్ధ మహిళ పేరు శ్రీమతి ఫిషర్. ఆమెలో మామూలు గృహిణి లక్షణాలు, ఏదైనా ఒక సంస్థ వ్యవహారాలు చూసుకునే వ్యక్తి లక్షణాలూ వున్నాయి. ఆమె చాలా నిర్మొహమాటంగా మాట్లాడింది. తన విశ్వాసాలను తన పక్కన వున్నవారు కూడా పంచుకుంటున్నారు అన్న ధీమాగల వ్యక్తి ఎంత నిర్మొహమాటంగా మాట్లాడతారో ఆమె అంత నిర్మొహమాటంగా మాట్లాడింది,

''అవును టస్కీగీలో 1700 మంది వున్నారు. ప్రతి అయిదారుగురు రంగు జాతుల వారికీ ఒక తెల్ల వ్యక్తి వున్నారు. దక్షిణ ప్రాంతవారమైన మేము ఒక జాతిగా నల్ల వారంటే యిష్ట పడము. కానీ కొంత మంది అంటే మాకు యిష్టమేనండోయ్. అలాటి వారు మీకు వీధుల్లోనూ షాపుల్లోనూ కని పించొచ్చు. అయితే అంత మాత్రాన వాళ్ళను మేము ఇళ్ళకు ఆహ్వానిస్తామేమిటి? మాకంటే వాళ్ళ సంఖ్యే ఎక్కువ అయినప్పటికీ పట్టణాన్నీ జిల్లాను మేము నడిపిస్తున్నాం. ఓటర్లుగా నమోదు చేసుకోడానికి వాళ్ళను సుప్రీంకోర్టు అనుమతించింది కానీ, వాళ్ళంతా ఓటు చేసి వుంటే ఏం జరిగి వుండేదో వూహించండి. అబ్బో భయంకరంగా వుండేది పరిస్థితి. అప్పుడు నల్లవారే పట్టణ వ్యవహారాలు నడిపేవారు. వారికేమో చదువు సంధ్యలు లేవు, నిజానికి వాళ్ళకు చదువు రాకుండా మేము జాగ్రత్త పడ్డామనుకోండి. పరిష్కారం కనుగొనడం అంత తేలికేమీ కాదు. ఎలాగైతేనేం మొత్తానికి ఒక పరిష్కారం కనుగొన్నాం. ఎటొచ్చీ మా భవిష్యత్తు దానిపైన్నే ఆధారపడి వుంది. మేము పట్టణాల సరి హద్దులు మార్చిపారేశాం. అంతే నల్లవాళ్ళు ఓట్ల జాబితా నుంచి ఎంచక్కా అదృశ్యమైపోయారు. వాళ్ళకి నిజంగా పిచ్చెక్కిందనుకోండి. వారు వార్తా

21718

పత్రికను, షాపుల్నీ బహిష్కరించారు. భగవంతుడు చల్లగుండా ఇప్పటివరకూ అంతా సవ్యంగానే వుందనుకోండి

ఇక్కడ వైరుధ్యం గురించి చెప్పాలి. 'టస్కీగీ న్యూస్' ప్రక్కనే ఒక సంస్థ వుంది. దాని పేరు "టస్కీగీ ఇన్‌స్టిట్యూట్". అమెరికాలోని నల్లవారికి చెందిన సంస్థల్లో ఇది చాలా ప్రసిద్ధమైనది. ఇది వున్నత విద్యా సంస్థ. ఇది చాలా పెద్ద సంస్థేకాక గౌరవ ప్రవత్తులున్న సంస్థ; చాలా ఏళ్ళ క్రితం స్థాపించబడిన సంస్థ.

ఆ సంస్థలో ముందుమాకు ట్రౌట్ కనిపించాడు. ఆయన పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్. ఆయన మమ్మల్ని డాక్టర్ ఎల్. హెచ్. ఫాస్టర్ వద్దకు తీసుకెళ్ళాడు. ఫాస్టర్ టస్కీగీ ఇన్‌స్టిట్యూట్ అధ్యక్షుడుగా వ్యవహరిస్తున్నారు.

వయసుతోపాటు గౌరవం కూడా సంపాదించుకున్న డాక్టర్ ఫాస్టర్ మమ్మల్ని తన గదిలోకి తీసుకెళ్ళారు. గది చక్కగా అలంకరింపబడి వుంది. గదిలో తివాచీలు, తోలుతో చేసిన కుర్చీలు వున్నాయి. కాలేజీ ప్రెసిడెంట్ ప్రశాంత చిత్తుడు, సత్‌ప్రవర్తకుడు, ఆయన శ్రీమతి ఫిషర్‌ను ప్రస్తావిస్తూ వ్యంగ్యంగా ఆమె "తత్వవేత్త" అన్నారు. ఆయన బాగా చదువుకున్నవాడిగా పరిశీలనాతత్వం కలవాడిగా, లోతయిన అవగాహన గలవాడిగా కనిపించాడు. బహుశా ఆ సమగ్రజ్ఞానంలోనే ఆయన విజ్ఞానం తాలూకు బలమూ, బలహీనతా వున్నాయేమో. ఆయన విజ్ఞానంలో పాతవేర్లు ఎంత బలీయంగా వున్నాయంటే తీవ్రమైన చర్యలనూ శీఘ్రపరివర్తననూ విశ్వసించడానికి ఆయన జ్ఞానం సుముఖంగాలేదు. సందర్భవశాత్తూ ఆయన మెరుగుదల దిశగా సాగుతున్న ఒక ధోరణిని గుర్తించాడు. ఆ ధోరణికి గనక వ్యతిరేకత ఎదురుకాకపోతే అంతా సవ్యంగా సాగిపోతుందని ఆయన మాతో నమ్మకంగా అన్నాడు.

టస్కీగీలోని విడ్డూరాలను చూసి ఆయన సిగ్గుపడ్డాడు. ఆయన సహచరుడైన డాక్టర్ కెన్నెడీ దగ్గరలో వున్న కెఫెలో ఓ కప్పు కాఫీ త్రాగే స్థితిలేదు. కానీ అక్కడ పక్కనేవున్న నల్ల వృద్ధుల ఆసుపత్రికి డాక్టర్ కెన్నెడీయే అధిపతి. ఈయన కూడా నల్లవ్యక్తి. 2000 పడకలుగల ఆ ఆసుపత్రి 'ఫెడరల్ వెటరన్స్ ఏజెన్సీ'కి చెందాలి. దీని వార్షిక బడ్జెట్ 90 లక్షల డాలర్లు. ఆ జిల్లా తాలూకు ఆర్థిక వ్యవహారాల్లో దీనిదే అగ్రస్థానం.

అయితే టస్కీగీలో తనది అవమానకరమైన స్థానమే అని డాక్టర్ కెన్నెడీ తెలుసుకోక తప్పలేదు. డాక్టర్ ఫాస్టర్ స్థానమూ ఇంకా పలువురు నల్ల పి.హెచ్‌డీ ల స్థానమూ తన స్థానమూ ఒకటే ననడం ఆయనకు ఓదార్పు నేమీ

ఇవ్వదు. 2000 మంది విద్యార్థులకు డాక్టర్ ఫాస్టర్ బాధ్యత వహిస్తారు. వారిలో చాలామంది బోధనా డిగ్రీలతో బయటి కెడతారు. అయినా ఆయన మాత్రం వానాకాలపు చదువు చదువుకున్నా షరీఫ్ నీడలోనూ శ్రీమతి ఫిషర్ నీడలోనూ జీవించక తప్పదు. ఇద్దరు విదేశీయులకు "ఒక జాతిగా" నల్లవారిపట్ల తనకు గల విద్వేషాన్ని వెల్లడించడం ఆయనకు ఏవిధమైన ఎబ్బెట్టూ కనిపించలేదు.

మా దక్షిణాది పర్యటన వర్ణనను ఇక ముగించాలి. మేము తిరిగి మాంట్‌గోమేరీ కి చేరుకోవడంతోనే వాస్తవానికి ఆ పర్యటన ముగిసింది. తర్వాత మేము అక్కడించి డెల్టా ఏర్‌లైన్సు విమానంలో న్యూయార్క్ వెళ్ళాం. విమానంలో ఒక్కసీటుతప్ప అన్నిసీట్లలోనూ జనం కూచున్నారు. ఏకైక నల్ల ప్రయాణీకుడు కూచున్న సీటుకుప్రక్కనవున్న సీటుఅది. మేము డిసెంబరు 30న న్యూయార్కుకు బయలు దేరాం. విమానంనిండా నూతన సంవత్సర ప్రయాణీకులే. నల్ల ప్రయాణీకుని ప్రక్కనగల ఖాళీసీటువైపు చూస్తూ నేను నా సీట్లోకూర్చొని ఆలోచించసాగాను. ఆ ఏర్ లైన్స్‌వారు గొప్ప దౌత్యమూ, త్యాగమూ ప్రదర్శించి ఆ సీటును ఖాళీగావుంచారు. అలావుంచడంవల్ల ఆ విమానంలో వర్ణపరమైన ఘర్షణను నివారించ గలిగారు. ఒకసీటు డబ్బులు పోతే పోయాయికాని ఘర్షణ తప్పిందన్నమాట. మాంట్‌గోమేరీ లో నేమో సామాజిక బహిష్కారం పాటిస్తారు. న్యూయార్క్‌లో మాత్రం సామాజిక బహిష్కారం పాటించరు.

విమానం అలబామా మీదుగా ఎగురుతుండగా నేను నాభావాలను పుస్తకంలో రాసుకున్నాను.

నేను తీసుకున్న నోట్స్‌లో మాంట్‌గోమేరీ కి సంబంధించిన నా భావాలు లేనందుకు నాకు యీనాడు విచారంగా వుంది. మార్టిన్ లూథర్ కింగ్ ప్రయాణానికి ప్రారంభ బిందువు అదే. దక్షిణంలోని 13 రాష్ట్రాలూ ఆయనకు కరతలామలకమే. తన సాహసోపేతమైన "స్వేచ్ఛా పోరాటాల" సందర్భంగా ఆయన అటూఇటూ అన్ని రాష్ట్రాలూ తిరిగారు. అక్కడి క్లబ్బుల ప్రభావం యేమిటో, మొహంమీద ఉమ్మేసిన చేదు అనుభవమేమిటో ఆయనకు అన్నీ తెలుసు. తన మతగురువు సూట్‌ను పోలీసు గట్టిగా పట్టుకుని నలిపి పారేశాడు చాలాసార్లు; ఆ అనుభవమూ తనకెరుకే. జైల్లో సిమెంట్‌నేలపై వుంటే ఎముకలు కొరికే చలి పెట్టిన చాపులగురించీ జైలు కిటికీగుండా దక్షిణప్రాంతపు ఆకాశం కనిపించేతీరు తెన్నుల గురించీ అన్నీ ఆయన కెరుకే. ఆయనకు ముగ్గురు బిడ్డలున్నారు. అట్లాంటాలోని తన ఇంటికి ప్రతిరోజూ ప్రమాదం వచ్చి పరామర్శించేది. అట్లాంటాలోని ఎబెనెజెర్ బ్యాప్టిస్ట్ చర్చిలో తానూ తన తండ్రీ మతబోధలు చేసే

వారు. సదరన్ క్రిస్టియన్ లీడర్‌షిప్ కాన్ఫరెన్స్ అనే సంస్థ ప్రధాన కార్యాలయాన్ని తాను ఏర్పాటుచేసింది అక్కడే. దక్షిణంలోని పట్టణాల్లో నగరాల్లో ఆ సంస్థకు అప్పుడే డజన్లసంఖ్యలో బ్రాంచీలు, వందల సంఖ్యలో కార్యకర్తలు తయారయ్యారు. తన యింటిముందు "కూక్లక్స్ క్లాన్" కార్యకర్తలు పలుసార్లు తిరిగాడారు. (కూక్లక్స్‌క్లాన్ అన్నది అమెరికాలోని నల్ల వారికి వ్యతిరేకంగా ఏర్పడిన అభివృద్ధి నిరోధక, దురాక్రమణ శీల సంస్థ-అనువాదకుడు) నిరంతరం తిరుగుతూవుండే కింగ్ తన భార్యాబిడ్డలు యింకా బతికి వున్నారోలేదో తెలుసుకోడానికి ఇంటికి టెలిఫోన్ చేస్తూండేవాడు.

దక్షిణ ప్రాంతంలోని తెల్లవారి మనస్తత్వమేమిటో మేము గ్రహించాం. ఆ శక్తి ఎంత బలీయమైనదో మేము తెలుసుకున్నాం. శక్తి అంటే తమ తండ్రుల నుంచీ తాతల నుంచీ తెల్లవారికి సంక్రమించిన వర్ణ దురహంకార శక్తి. కింగ్‌కు యీసమస్యగురించే కాక ఇతర మనస్తత్వం గురించి కూడా తెలుసు. బానిస తాలూకు బానిస మనస్తత్వాన్నీ, ఆత్మ న్యూనతా మనస్తత్వాన్నీ తొలగిచడం చాలా కష్టమన్న విషయం ఆయనకు తెలుసు. ఆమనస్తత్వం తమ తండ్రుల నుంచి తాతలనుంచీ సంక్రమించు కున్నట్టిది; అది తమలోనే పుట్టింది, తమకు దగ్గరగావున్న లక్షలాది నల్లవారినుంచి సంక్రమించిన తత్వం అది.

సుప్రసిద్ధమైన "స్వేచ్ఛా పోరాటాలు" సాగుతున్న కాలం అది. "విద్యార్థుల అహింసా సమన్వయ కమిటీ"కి చెందిన యువవీరులు సర్వత్రా పాతుకు పోయిన సామాజిక బహిష్కార వ్యవస్థపై దాడులు జరుపుతున్నారు. యువకులు గుంపులు గుంపులుగా బస్సుస్టేషన్లలో రైల్వేస్టేషన్లలో షాపుల్లో కెఫేలలో హోటెళ్ళలో బైఠాయించే వారు. ఈ బైఠాయింపులు, బారులుతీరి నిల్చోడాలు మామూలు జీవనక్రమాన్నీ, వ్యాపారాన్ని నిరోధించేవి. పోలీసులు వారిని పట్టుకుని స్థానిక పోలీస్ స్టేషన్లలో లాకప్‌లో వుంచేవారు. ఒక్కోసారి వాళ్ళని మహా పాశవికంగా బాదేవారు. ఉత్తర ప్రాంతానికి చెందిన తెల్ల విద్యార్థులను ప్రత్యేకించి దారుణంగా కొట్టేవారు. ఎందుచేత నంటే, శ్వేతవర్ణ దురహంకారులు వారిని దేశద్రోహులుగా పరిగణించేవారు. మార్టిన్ లూథర్ కింగ్ తన ''ప్రత్యక్ష ప్రజా కార్యచరణ''తో ఆ విద్యార్థులకు తోడ్పడ్డానికి రంగంలో దిగేవారు.

అల్బేనీలో కూడా యిది జరిగింది. విద్యార్థులను అరెస్టు చేశారు. తర్వాత వందలాది మంది అల్బేనీ నల్ల ప్రజలు వీధుల్లో తమ నిరసన వ్యక్తం చేశారు. తర్వాత మరో 267 మంది అరెస్టయ్యారు.

డిసెంబరు 15 వ తారీకున కింగ్ అట్లాంటా నుంచి అల్బేనీ వెళ్ళారు. ప్రజలు ఆయన కోసం ఎదురు చూస్తున్నారు; న్యాయంకోసం ఎదురు చూస్తున్నట్లు, అద్భుతాలు సృష్టించే వ్యక్తికోసం ఎదురుచూస్తున్నట్లు ఆయన కోసం ఎదురు చూస్తున్నారు. మాంట్ గోమేరీ బహిష్కరణ సాగుతున్న ఆ రోజుల్లో ఆయన ఒకసారి యిలా వ్యాఖ్యానించాడు: (ఆయనకు పేరు ప్రఖ్యాతులు వచ్చింది ప్రజాదరణ లభించింది అప్పుడే) "ఇరవై యేడేళ్ళ వయసులోనే శిఖరాగ్రం అందుకున్న వ్యక్తికి ముందుండేది ముసళ్ళ పండుగే. నేను నా జీవితమంతా అద్భుతాలు చేయాలని ప్రజలు ఆశిస్తారు." స్థానిక బాప్టిస్ట్ చర్చిలో 1500 మంది కంటె పట్టరు. పలువురు జనాలు బయట చినుకులు పడుతున్నప్పటికీ నిల్చున్నారు. వాతావరణం సరిగా లేనందున కింగ్ ప్రయాణిస్తున్న విమానం రావడంలో ఆలస్యమైంది. వర్షం పడుతున్నప్పటికీ జనాలు ఆయనకోసం అయిదు గంటలు అలాగే పడిగాపులు కాశారు. ఆయన పేరులో నిజంగానే గొప్ప ఆకర్షణ వుండేది.

కింగ్ తన సంక్షిప్త ప్రసంగంలో తమ ఉద్యమాన్ని మందగింపు చేయరాదని స్పష్టం చేశారు. క్రమేణా తత్వం అనే సిద్ధాంతానికి కట్టుబడడాన్ని తమను తాము అనుమతించరాదని తెలిపాడు. క్రమేణా తత్వం శూన్యతత్వానికి దారితీస్తుందనీ అది ప్రస్తుత పరిస్థితిని కాపాడ్డమే కాగలదనీ హెచ్చరించారు. నల్లవారు తమ హక్కు లన్నింటినీ ఇప్పుడే కావాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన వారిని డిసెంబరు 16 ఉదయం 10 గంటలకల్లా విడుదల చేయాలని సమావేశానికి హాజరైన వారంతా డిమాండ్ చేయసాగారు.

అయితే అల్బేనీ ప్రధాని పోలీస్ అధికారిపైన కింగ్ ఆకర్షణ ఎంత మాత్రం పనిచేయలేదు. ఆ అధికారి పేరు లారీ ప్రిషెట్.

డిసెంబరు 16 వ తారీకున 600 మంది నల్లవారు సిటీహాల్ దాకా ప్రదర్శనగా వెళ్ళారు. ఈ ప్రదర్శనకు కింగ్‌తోపాటు, అల్బేనికి చెందిన నల్ల డాక్టర్ ఆండర్సన్ నాయకత్వం వహించారు.

పోలీస్ అధికారి లారీ ప్రిషెట్ సిటీహాల్‌కు వెళ్ళే రోడ్డుమీద వెళ్ళకుండా నిరోధించాడు. పోలీసులు మార్గావరోధాలు సృష్టించి అక్కడే నిల్చున్నారు. కాగా ప్రక్కనేగల హోటల్ కప్పుమీద నుంచి జాతీయ భద్రతా దళాలు ఘటనలపై నిఘావేశాయి. లారీ ప్రిషెట్ నేరుగా కింగ్ దగ్గరకు వచ్చి ప్రదర్శనకు మంజూరు చేసిన అధికారిక అనుమతి పత్రం చూపించాల్సిందిగా డిమాండ్ చేశాడు. అయితే అలాటి అనుమతి పత్రం యేదీ మంజూరుకాలేదు. లారీ ప్రిషెట్

మెగాఫోన్ చేత పట్టుకుని ప్రదర్శకులంతా చెల్లా చెదరైపోవాలని ఆదేశించాడు. ప్రదర్శకులు అందుకు నిరాకరించారు. వారిని పోలీసులు చుట్టుముట్టి పక్క సందులోగల జైలుకు తీసుకెళ్ళారు.

వారంతా శాంతియుతంగా ఎలాటి హింసాకాండకు పాల్పడకుండా ప్రదర్శన జరిపారు. లారీ ప్రిషెట్ కూడా ఎలాటి హింసలేకుండానే వారిని అరెస్టుచేయించాడు. స్థానిక జైళ్ళల్లో 700 మందికి పైగా నల్లవారిని కుక్కారు. కింగ్‌నూ ఆండర్సన్‌నూ ఒకే జైలుగదిలో పడేశారు.

హామీపత్రం రాసి విడుదల కాడానికి కింగ్ తిరస్కరించాడు. ప్రదర్శన యిలాగే కొనసాగాలనీ కనీసం వెయ్యిమంది విద్యార్థులయినా అరెస్టు కాబడాలనీ విద్యార్థులు అల్బేనీకి క్రిస్మస్ యాత్ర జరపాలనీ అల్బేనీ వ్యాపార్లను దెబ్బ కొట్టాలనీ కింగ్ కోరుకున్నాడు. క్రిస్‌మస్ పండుగ సందర్భంగా అల్బేనీలో మంచి లాభసాటి వ్యాపారం సాగుతుంది. అయితే అల్బేనీలోని కొంత మంది నల్లవారు భయపడ్డారు. ఇది "అతివాద" చర్యలని వీటికి తెల్లవారు ప్రతీకారం తీసుకుంటారనీ వారు జడుసుకున్నారు. ఒక స్థానిక నల్ల నాయకుడు యిలా అన్నాడు. "కింగ్, ఇతరులూ వెళ్ళిపోతారు, మేము మాత్రం ఇక్కడే జీవించక తప్పదు కదా"

క్రిస్‌మస్‌కు ముందు రెండు నెలల "శాంతి సంధి" చేసుకున్నారు. అల్బెనీఘటనలను పురస్కరించుకుని నల్లవారి విముక్తికై రెండవ ప్రకటన విడుదల చేయాల్సిందిగా అధ్యక్షుడు జాన్‌కెన్నెడీని కింగ్ కోరాడు మొదటి విముక్తి ప్రకటనపై సరిగ్గా నూరేళ్ళ క్రితం అబ్రహాం లింకన్ సంతకం చేశాడు. సామాజిక బహిష్కరణను "ఒక్క కలంపోటు"తో అంతం చేస్తానంటూ కెన్నెడీ చేసిన ఎన్నికల వాగ్దానాన్ని కెన్నెడీకి కింగ్ గుర్తు చేశాడు. ఎన్నికల ముందు ప్రసంగాల్లో చేసిన ఇతర వాగ్దానాల విషయం కూడా ఆయన గుర్తు చేశాడు ఏది ఏమైనా ప్రభుత్వతోడ్పాటు నామమాత్రంగానే వుండింది. అధ్యక్షుడు కెన్నెడీ సోదరుడు ఆ సమయంలో అటార్నీ జనరలూ అయిన రాబర్ట్ కెన్నెడీ మహా అయితే అల్బెనీ మేయర్‌కు కేవలం ఫోన్ చేశాడు. రాష్ట్రాల మధ్య ప్రయాణీకుల రవాణాకు సంబంధించి ఫెడరల్ నిబంధనలను పాటించాల్సిందిగా అయన టెలిఫోన్‌లో కోరాడు. బస్సు స్టేషన్లలోనూ రైల్వే స్టేషన్లలోనూ వివక్షను ఫెడరల్ నిబంధనలు నిషేధిస్తున్నాయి.

అల్బేనీ ఉద్యమం అప్పుడప్పుడూ ఆగిపోతూనే మొత్తానికి సంవత్సరం పాటు కొనసాగింది. 1962 వేసవిలో అది ముగిసింది. ఈ ఉద్యమంలో కింగ్

ఓడిపోయాడు. మాంట్‌గోమెరీ బస్సుల బహిష్కరణకు సంబంధించి అది రెండవ సారి ఓడిపోవడం. అహింసకు నూకలు చెల్లాయని కింగ్ వ్యతిరేకులు ప్రకటించారు. కానీ కింగ్ మాత్రం నిరాశ చెందలేదు.

"అన్ని బలహీనతలూ, బలాలుగల మనుషులే మొత్తానికి సామాజిక ఉద్యమ యంత్రాంగంలో వుండేది. వారు తప్పులుచేసి ఆ తప్పులనుంచి నేర్చుకుంటారు, మరిన్ని తప్పులుచేసి కొత్తగా మళ్ళీ నేర్చుకుంటారు. వారు జయాపజయాలను రెండింటినీ చవిచూడాలి; రెండింటితోనూ జీవించడం నేర్చుకోవాలి. కాలమూ, కార్యాచరణ యీ రెండే బోధకులు". ఆయన ఆ తర్వాత పై విధంగా రాశారు.

కింగ్ అపజయాన్ని చవిచూశాడు; తన తప్పుల నుంచి నేర్చుకోడానికి, విప్లవం గురించి మాట్లాడడానికీ ఆయన సిద్ధంగా వుండినాడు. ఆయన అమెరికా తరహాలో భయంకరమైన దృఢదీక్ష వ్యక్తం చేశాడు. తాను ఎంత దృఢంగా వుంటే సమస్య పరిష్కరింపబడడానికి అంత ఎక్కువ అవకాశం లభిస్తుందని ఆయనకు తెలుసు.

## సత్యం జయిస్తుంది

ఈ చరిత్రలోని బర్మింగ్‌హామ్ అధ్యాయం ఎత్తుకోడానికి ముందు నేను రెండు ప్రస్తావనలను ఉటంకించాలను కుంటున్నాను.

మొదటి ప్రస్తావన "కొలంబియా ఎన్‌సైక్లోపేడియా" నుంచి తీసుకోబడింది.

"బర్మింగ్‌హామ్ పారిశ్రామిక నగరం. (జనాభా 340887) దక్షిణంలో ఇనుము, ఉక్కు ఉత్పత్తి చేసే ప్రధాన నగరం. నగరంలో ఇనుము, ఉక్కు ఫ్యాక్టరీలకు ఇతర లోహకార ఫ్యాక్టరీలకూ ఆ ప్రాంతంనుంచే ఇనుము, బొగ్గు సున్నపురాయి తదితర పదార్థాలు సరఫరాఅవుతాయి. నగరంలో జౌళి ఉత్పత్తులు, రసాయనికాలు, సిమెంట్ కూడా ఉత్పత్తి అవుతాయి. 1871 లో నిర్మింపబడిన నగరం వేగంగా పెరిగింది. ప్రకృతి వనరులు పుష్కలంగా లభిస్తున్నందునా రైలు మార్గం విస్తరింపబడినందువల్లనూ నగరం పారిశ్రామికంగా అభివృద్ధి చెందగలిగింది. దగ్గరలోని రెడ్ మౌంటెన్‌పై వల్కాన్‌గారి పెద్ద ఇనుప విగ్రహం నెలకొల్పబడి వుంది. విగ్రహం ముఖం నగరానికి అటుకేసి తిరిగివుంది. బర్మింగ్ హామ్‌లో హోవర్డ్ కాలేజి (బాప్టిస్ట్, మిశ్రమ సంస్థ 1841) మైల్స్ కాలేజ్ (మెథడిస్ట్ ఎపిస్కోపల్, మిశ్రమ విద్య సంస్థ 1907) అలబామా విశ్వవిద్యాలయానికి దానిసొంత వైద్యకళాశాల, డెంటల్ స్కూలు వున్నాయి. 1918 లో సదరన్ యూనివర్సిటీని

బర్మింగ్‌హామ్ కాలేజిని విలీనం చేయడం ద్వారా బర్మింగ్‌హామ్ - సదరన్ కాలేజి (మెథడిస్ట్ - మిశ్రమ విద్యా సంస్థ) ఏర్పాటైంది. 1953 లో దానికి అనుబంధంగా బర్మింగ్‌హామ్ సంగీత కళాశాల యేర్పాటైంది...."

అయితే బర్మింగ్ హామ్‌లోని మొత్తం 340887 జనాభాలో 135332 మంది అంటే అయిదింట రెండువంతుల మంది నల్లవారేనని యీ సంక్షిప్త ప్రస్తావనలో ఎక్కడాలేదు. 1963 నాటి బర్మింగ్‌హామ్‌ను ఆఫ్రో-అమెరికన్ కళ్ళతో మన మిప్పుడు చూద్దాం.

మన రెండో ప్రస్తావన "మేమెందుకు పరీక్షించలేము" అన్న కింగ్ విరచిత గ్రంథములోనిది.

"నీగ్రో విముక్తి శత సంవత్సరంలోని ఏప్రిల్ 3 వ తారీకున మీరు గనక బర్మింగ్‌హామ్‌ను దర్శించి వుండుంటే మీరు ఆశ్చర్యకరమైన నిర్ధారణకు వచ్చి వుందురు. రిప్‌వాన్ వింకిల్ నిద్రలో దశాబ్దాలపాటు మునిగివున్న నగరం యిది అని మీరు నిర్ధారణకు వచ్చి వుండేవారు. అబ్రహాం లింకన్, థామస్ జెఫర్సన్, హక్కులబిల్లు, రాజ్యాంగం ఉపక్రమణిక, 13 వ 14 వ 15 వ సవరణలు ప్రభుత్వ పాఠశాలల్లో సామాజిక బహిష్కరణను నిషేధిస్తూ 1954లో సుప్రీంకోర్టు యిచ్చిన తీర్పు-వాటి గురించి యీ నగరవాసులకు తెలీనే తెలీదు.

"బర్మింగ్‌హామ్‌లో మీరు నీగ్రోబిడ్డగా పుట్టి పెరిగివుండే స్థితిని వూహించుకోగలిగే ఊహాశక్తే గనక మీకు వుంటే మీరు మీ జీవితాన్ని యిలా చిత్రించుకుని వుండేవారు.

"నీగ్రోపేటల్లో నివసించే తల్లిదండ్రులకు మీరు ఓ నీగ్రోల ఆసుపత్రిలో పుట్టివుండేవారు. మీరు నీగ్రో స్కూలుకే వెళ్ళివుండేవారు.

"మీరు మీ బాల్యాన్ని ప్రధానంగా వీధుల్లో ఆడడం ద్వారానే గడిపి వుందురు. ఎందుచేతనంటే "రంగుజాతుల" వారికి వుద్దేశించిన పార్కులు చాలా చాలా తక్కువ. పార్కుల్లో సామాజిక బహిష్కరణను ఫెడరల్ కోర్టు రద్దు చేస్తే బర్మింగ్ హామ్ మొత్తంగా పార్కులనే మూసేస్తుంది; బేస్‌బాల్ టీమ్‌లో నల్లవారిని చేర్చుకోడానికి బదులుగా ఏకంగా బేస్‌బాల్ టీమ్‌నే రద్దుచేస్తుంది..."

"మీ కుటుంబం గనక చర్చికి వెళ్తే నీగ్రో చర్చికే వెళ్తుంది. తెల్ల ప్రజలు హాజరయ్యే చర్చిని సందర్శించాలనుకుంటే మిమ్మల్నెవరూ ఆహ్వానించరు. ఎందుచేతనంటే తాము క్రైస్తవులమని మీ తోటి శ్వేత పౌరులు పైకి గట్టిగా అన్నప్పటికీ వాస్తవానికి వారు థియేటర్‌లో లాగే దేవుడి గృహంలోకూడా కఠినంగానే సామాజిక బహిష్కరణ అమలు జరుపుతారు.

"ఈ నగరంలో మీకు వుద్యోగం కావాలనుకుంటే ఉక్కు ఇనుము భారీగా ఉత్పత్తి అయ్యే ఒకానొక నగరంలో యీ నగరంలో మీకు వుద్యోగం కావాలనుకుంటే, పోర్టర్‌గా కానీ శ్రామికుడిగా కానీ శారీరక శ్రమకు మాత్రమే మీరు సిద్ధంకావలసి వుంటుంది. అదృష్టముండిమీకు వుద్యోగమే లభిస్తే,మీకు ప్రతిభా పాటవాలు వున్నప్పటికీ తెల్ల వుద్యోగికే ప్రమోషన్ దక్కుతుంది తప్ప మీకు మాత్రం దక్కదు. మీకు వుద్యోగం చిక్కితే ప్రత్యేక స్థలంలో మీరు భోజనం చేయాల్సి వుంటుంది, ప్రత్యేక కొళాయి వుపయోగించుకోవాల్సి వుంటుంది, ప్రత్యేక మరుగుదొడ్డి వుపయోగించుకోవాల్సి వుంటుంది. "రంగు జాతుల" వారికి ఉన్న బోర్డు వుంటుందక్కడ. ఇది నగర నిబంధనలకు అనుగుణమే తప్ప మరొకటి కాదు. 1963 జనవరికి ముందు బర్మింగ్‌హామ్‌లో 80 వేలమంది ఓటర్లుండగా అందులో నీగ్రో ఓటర్లు 10 వేల మంది మాత్రమే. నగర జనాభాలో అయిదింట రెండు వంతుల మేరకు వున్న మీ వర్ణం వారు ఓటర్ల సంఖ్య కొచ్చేసరికి జనాభాలో యెనిమిదింట ఒక వంతు మాత్రమే.

"నీగ్రోలకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడిన పాశవికాన్ని ప్రశ్నించేవారు కానీ సవాలు చేసేవారు కానీ లేని నగరంలో మీరు నివసిస్తుంటారు. సిటీ కమీష నర్లలో ఒకరైన యూజిన్ 'బుల్' కానర్ అనే వ్యక్తి వర్ణవిద్వేషి. నీగ్రోలతో వ్యవహరించడ మెలాగో వారిని వాళ్ళ స్థానంలో వుంచడమెలాగో తనకు తెలుసు నని అతగాడు గర్విస్తుంటాడు.

"ప్రజాభద్రతా వ్యవహారాల కమీషనర్‌గా బుల్‌కానర్ బర్మింగ్‌హామ్ అధికార వ్యవస్థలో చాలా కీలకమైన స్థానంలో చాలాయేళ్ళుగా పాతుకు పోయి వున్నాడు. నీగ్రో హక్కులంటే అతనికి ఎనలేనిమంట. ఫెడరల్ ప్రభుత్వ అధి కారాన్ని అతడు బొత్తిగా ఖాతరు చేయడు.

"బర్మింగ్‌హామ్‌లో మీకు ఎటుచూసినా హింసాయుత, పాశవిక వాతా వరణమే కనిపించేది. స్థానిక వర్ణవిద్వేషులు నీగ్రోలను బెదిరిస్తేకానీ చంపితేకానీ అడిగే నాథుడు లేడు. ఇందుకు స్పష్టమైన తాజాఉదాహరణ-ఒక నీగ్రోవ్యక్తికి బీర్జాలు తొలగించి రోడ్డుపై పడేశారు. బాంబుల నుంచీ, దహనాల నుంచీ ఏ నీగ్రో గృహానికీ రక్షణలేదు. నీగ్రోలు "సంతృప్తికరం"గానే జీవిస్తున్నారని ఒకవైపు బర్మింగ్‌హామ్ గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ 1957 నుంచీ 1963 జనవరి దాకా నగరంలో నీగ్రోచర్చీలపైనా పౌరహక్కు నాయకుల ఇళ్ళపైనా 17 సార్లు బాంబులు పడ్డాయి. వీటిని గురించి పట్టించుకున్న వాళ్లేలేరు.

"బుల్ కానర్‌గారి బర్మింగ్‌హామ్‌లో ఎల్లెడలా కనిపించేది భయమే. పీడితులైన నల్లవారి గుండెల్లోనేకాదు పీడకులైన తెల్లవారి గుండెల్లో కూడా భయమే. నేరమనస్తత్వం వీరి భయంలో భాగం. మార్పు అన్నా కూడా వీరికి జడుపే. ప్రతీపశక్తులు అభయాన్ని మరింత పెంచాయి. సామాజిక వెలి అంటే చాలా మందికి భయం. బుల్ కానర్‌గారి ఎత్తుగడలంటే యిష్టపడని తెల్లజాతికి చెందిన మితవాదులు బర్మింగ్‌హామ్‌లో వున్న మాట నిజం. నీగ్రోలకు లభిస్తున్న దురాదరణపట్ల చాటుమాటుగా విచారం వ్యక్తంచేసే తెల్లవారు బర్మింగ్‌హామ్‌లో వున్నారు. అయితే బహిరంగంగా మాత్రం నోరు మెదపరు. అది భయంనుంచి వుత్పన్నమైన మౌనం, సామాజిక, రాజకీయ, ఆర్థిక, పగ సాధింపులువుంటాయేమో అన్న భయం. బర్మింగ్‌హామ్ అంతిమ విషాదం యేమిటంటే - అది దుర్మార్గుల పాశవికం కాదు, సన్మార్గుల మౌనం అది"

ఆల్బెనీలో లాగా ఇక్కడ లక్ష్యం మనిషికోసం అన్వేషించడం జరగ లేదు. ఆల్బేనీలో సన్నద్ధంగా లేదు; విద్యార్థుల "స్వేచ్ఛా పోరాటం"తో ప్రారంభ మైన దానిని పరిపూర్తి చేసేందుకు కింగ్ ప్రయత్నించాడు కానీ సాఫల్యం చెందలేదు. బర్మింగ్‌హామ్‌లో కింగూ ఆయన అనుచరులూ తమ లక్ష్యాన్ని ఎంచుకున్నారు. అదేం మామూలు లక్ష్యమా! ప్రపంచ వ్యాపితంగా నీడలు పరచుకున్న వర్ణవాదం అది. బర్మింగ్‌హామ్‌లో సాధించే విజయంలో ఉత్సాహం పుంజుకుని దేశ వ్యాపితంగా సామాజిక బహిష్కరణ నడ్డి విరగొట్టాలన్నది వారి చరమ లక్ష్యం. వారి దృష్టిలో "బుల్" కానర్స్ రూపెత్తిన శత్రువు.

అతడి వెనకాల మరోవ్యక్తి వున్నాడు. అతగాడి పేరు జార్జ్ వాలేస్. అతడు మరింత వర్ణవాద వున్మాది. సామాజిక బహిష్కరణను శాశ్వతంగా కొనసాగించడానికి ప్రతిన బూనిన ఉన్మాది అతడు. అలబామాలోని విశ్వవిద్యా లయాల్లో నల్ల వారు చేరకుండా అడ్డుపడిన వ్యక్తి అతడు.

బర్మింగ్‌హామ్ ప్రచారోద్యమంలో లభించే విజయాలు కానీ ఎదురయ్యే పరాజయాలుకానీ భారీస్థాయికి చెందినవే. ప్రతి పక్షం బలీయంగా వుండడమే కాకుండా ప్రమాదాలు కూడా ఎక్కువే. ఆల్బేనీలోని వైఫల్యంకానీ బర్మింగ్ హామ్‌లో పరాజయం కానీ "అహింసా సూత్రాన్ని" చావుదెబ్బకొడుతుంది.

ఎత్తుగడలను సున్నితమైనవిగా రూపొందించారు; ప్రజలకు తర్ఫీదు యిచ్చారు; డబ్బు సేకరించారు. వాస్తవానికి కింగ్ ఒంటరిగా యేమీలేడు. ఎల్లప్పుడూ జనం ఆయన చుట్టూ వుండేవారు. ఆయన జాతీయ స్థాయి నాయకు డుగా ఎదిగినందువల్లనూ, ప్రజలను కార్యాచరణలోకి దింపేశక్తి ఆయనలో

వున్నందువల్లనూ చాలా కచ్చితంగా, మహోద్రేకంగా, బ్రహ్మాండంగా ప్రసంగించే శక్తి సామర్థ్యాలు వున్నందువల్లనూ ఆయన తనచుట్టూ, సోదర పోరాట యోధులనూ, సమర్థవంతమైన నిర్మాణ దక్షతగల వారినీ ఎల్లప్పుడూ వుంచుకో గలిగాడు. సమానుల్లో ఆయనదే ప్రథమస్థానం. ఆయన అనుచరులంతా తమ తమ కార్యకలాపాల్లో మునిగితేలుతూ ఆయన నేతృత్వాన్ని సవాలు చేసినవారే కాదు. తమ ఉద్యమానికి కింగ్ ఆకర్షణాశక్తి చాలా విలువైనదని వారంతా గుర్తించారు. ఆయన శక్తి ఆయన నిస్వార్థపరతనుంచి లక్ష్యంలో సర్వసంపూర్ణంగా నిమగ్నం కాగల శక్తినుంచి ఆవిర్భవించింది; ఇతరులను అడగడంకన్నా తన్నుతానే ఎక్కువ అడిగే అలవాటునుంచి ఉద్భవించిన శక్తి అది.

అలబామా క్రిస్టిమన్ మువ్‌మెంట్‌ఫర్ హ్యూమన్‌రైట్స్ అధినేత ఫ్రెడ్ షటిల్స్‌వర్త్ (మతగురువు) చర్యలవల్ల బర్మింగ్ హామ్ రంగస్థలంపై దర్శన మివ్వడానికి కింగ్‌కు అవకాశం లభించింది. ఆగ్రూపు కూడా కింగ్ సంస్థతో విలీనమైపోయింది.

మార్టిన్ లూథర్‌కింగ్ అల్బేనీ వైఫల్యంనుంచి విలువైన పాఠం నేర్చుకున్నాడు. ఆయన గరిష్ఠ ప్రభావాన్ని సాధించడానికిగాను తన శక్తి సామర్థ్యాలన్నింటినీ ఒకే ఒక లక్ష్యంపై కేంద్రీకరించవలసివుండింది. బర్మింగ్‌హామ్‌లో ఆయన చేపట్టిన లక్ష్యంయేమిటంటే-నగరంలోని నల్లషాపు యజమానుల లక్ష్యం మరీ ముఖ్యంగా సామాజిక బహిష్కారం పాటింపబడుతున్న భోజనం హోటళ్ళ సమస్య చేపట్టాడు.

నల్లవారి డాలర్లు స్వీకరింపబడే స్థలాల్లోనే నల్లవారు అమానుషమైన అవమానలకు గురయ్యేవారు. సామాజిక బహిష్కారం పాటింపబడని భోజనం హోటళ్ళ (లంచ్ కౌంటర్లు) దగ్గరకూడా పరిస్థితి కాస్త సంతృప్తికరంగా వుండేది.

కనుక లంచ్ కౌంటర్ల వద్ద బైఠాయింపు కార్యక్రమాలు ప్రారంభ మయ్యాయి. అదే సమయంలో దుకాణాలను బహిష్కరించడం కూడా ప్రారంభమైంది. బర్మింగ్‌హామ్ జనాభాలో నల్లవారు 40 శాతం మేరకు వున్నారు. కాబట్టి షాపుల బహిష్కారం అంటే షాపుల యజమానులకు విపరీతమైన నష్టం కలగడమే.

చివరకు ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి; దాంతో బహిరంగ ఘర్షణ మొదలైంది.

"సదరన్ క్రిస్టియన్ లీడర్ షిప్ కాన్ఫరెన్స్" కు చెందిన కార్యకర్తలు శిక్షణా కేంద్రాల్లో అహింసా పద్ధతుల గురించీ "ప్రత్యక్ష కార్యాచరణ" గురించీ నేర్చుకున్నారు. ప్రతిఒకరూ "నిబద్ధతా పత్రం" పై సంతకం చేశారు. ఉద్యమానికి కట్టుబడి వుంటామని ప్రతిన బూనారు; మతపరమైనవీ ఉద్యమపరమైనవీ మొత్తం పది ఆదేశాలకు కట్టుబడి వుంటామని ప్రతినచేశారు. అందులో మొట్టమొదటి ఆదేశం "జీసస్ బోధల గురించీ జీవితం గురించీ రోజూ ధ్యానించడం." అయిదవ ఆదేశమేమో "సర్వులూ స్వేచ్ఛగా వుండేలా వ్యక్తిగత కోర్కెలను త్యాగం చేయడం" ఏడవ ఆదేశమేమో "మనోవాక్కాయ కర్మణా" హింసకు దూరంగా వుండడం, పదవ ఆదేశమేమో "ప్రదర్శనలో నాయకుని ఆదేశాలు పాటించడం."

"జైళ్లనింపండి" అనే నినాదానికి బర్మింగ్‌హామ్‌లో కూడా కార్యరూపం యివ్వబడింది. నిరసనదార్లు జైలు కెళ్ళడానికి సిద్ధంగా వుండినారు. వేలాది మంది నల్లవారు సిద్ధంగా వుండినారు. సంఖ్య ఎంత ఎక్కువైతే అంతమంచిది.

1963 వసంతరుతువులోనూ వేసవికాలంలోనూ ఆకురాలు కాలంలోనూ బర్మింగ్‌హామ్‌లో వర్ణ వివక్షకు వ్యతిరేకంగా పోరాటాలు సాగాయి.

మొట్ట మొదటి ఘర్షణ దినమైన ఏప్రిల్ 3 వచ్చింది వెళ్ళింది. దానిని గమనించిన వారే లేరు. ముప్పైమంది వలంటీర్లు బర్మింగ్‌హామ్ షాపుల్లోకి దూసుకువెళ్ళారు. నిషిద్ధప్రాంతమైన లంచ్ కౌంటర్ల దగ్గరకెళ్ళి బెంచీలమీద కూచున్నారు. ఫలితంగా అరెస్టయి జైలుకెళ్ళారు.

ఆ రోజు సాయంత్రం నల్లవారి చర్చివద్ద సమావేశం జరిగింది. 65 సంచార సమావేశాల్లో అది మొదటిది. పగలంతా ప్రదర్శనలు, అరెస్టులుసాగేవి; సాయంకాలాల్లో సంఘీభావ సమావేశాలు, నిరసన సమావేశాలు జరిగేవి. ప్రతి రోజూ ప్రదర్శనలు, సమావేశాలు జరిగేవి.

చర్చిల్లో జరిగే ఆ సమావేశాల్లో నల్ల మొహాలపై కాంతులు మెరిసేవి; మత గురువులు ఉపన్యసించేవారు; శ్రోతలు గట్టిగా అరుస్తూ ఏవో సమాధానా లిచ్చేవారు; తమను తాము ప్రోత్సాహించుకునేవారు, వేదికపై ప్రసంగించేవారిని ప్రోత్సహించేవారు;

స్వేచ్ఛా గీతాలు మహోత్సాహంగా పాడేవారు; స్వేచ్ఛా ఉద్యమానికి ఆత్మవంటివి ఆ గీతాలు. ఆ గీతాలు మహోజ్వల కర్తవ్యం నిర్వహించాయి. మునుపటి బానిసల గీతాలని కొద్దిగా అటూ ఇటూ మార్చి పాడేవారు. "మనం జయిస్తాం...మనం జయిస్తాం" అనే చిరపరిచితమైన గీతం ఎల్లెడలా ప్రతిధ్వనించేది. (అది పాల్ రాబ్సన్ పాడేపాట - అనువాదకుడు)



మతగురువులు ధరించే ఆయన నల్లటి సూట్‌ను పోలీసు పలుసార్లు పట్టుకొని నలిపి పారేశాడు. జైలుగదిలోని సిమెంటునేలపై కలిగే ఎముకలు కొరికే చలి గురించి ఆయనకు తెలుసు.

ప్రారంభ దినాల్లో ప్రదర్శనలు చిన్నవిగా వుండేవి. కానీ క్రమేణా వాటి బలం బాగా పెరిగింది. దుకాణాల బహిష్కరణ విజయవంతమైంది; రోజుకు 20 మంది నల్లవారు మాత్రమే తెల్లవారి దుకాణాల్లో కొనుగోలు చేసినట్లు నమోదయింది.

జైళ్ళు నిండిపోయాయి. పోలీసు దళాలు, పోలీసు కుక్కలు ఏప్రిల్ 7 వ తారీకున ప్రప్రథమంగా రంగంలోకి దిగారు. అయినా మొత్తంమీద "బుల్" కానర్ ఓర్పుగా వ్యవహరించాడనే చెప్పాలి. ఆయనకింది సిబ్బంది కూడా హింసా కాండకు పాల్పడకుండా మెలిగారు.

పోలీసులు పదిరోజుల్లో 450 మందిని అరెస్టు చేశారు. మొత్తంమీద ప్రచారోద్యమం అనుకున్నట్లుగానే సాగుతోంది. ఏదిఏమైనా కింగ్ కోరుకున్న "నిర్మాణాత్మక ఉద్రిక్తత" మాత్రం తలెత్తలేదు

మార్టిన్ లూథర్‌కింగ్ నాయకత్వం వహించాల్సిన ప్రదర్శన జరిగే రోజు రానేవచ్చింది. దానికి నేతృత్వం వహించి అరెస్టు కావలసివుంది. అంతకు ముందురోజు సాయంత్రం ఆయన గేస్టన్ హోటల్‌లో తన మిత్రులతో సహ చరులతో సంప్రదింపులు జరిపాడు. వందలాదిమంది అరెస్టు కావడంతో బెయిల్ ఉద్యమనిధి బాగా తగ్గిపోయింది. ఇది గమనించిన అధికార్లు ఖైదీల విడుదలకు వెంటనే డబ్బులు చెల్లించాలంటూ వత్తిడి చేయసాగారు. కింగ్ తన పేరును వుపయోగించడం ద్వారానూ సానుభూతి పరులకు విజ్ఞప్తి చేయడం ద్వారానూ బెయిల్ నిధిని పూరించగలడు కానీ ఆయన అరెస్టు కాకుండా బయట వుంటేనే అలా చేయగలడు. మరి మరుసటి రోజు తాను అరెస్టయితే పరిస్థితి ఏంకాను? మరి వేలాదిమంది అరెస్టు కాడానికి పరోక్షబాధ్యత వహించిన తాను ప్రకటించిన రోజున ప్రదర్శనకు నాయకత్వం వహించి అరెస్టు కాకపోతే జనం ఆయన్ను గురించి ఏమనుకుంటారు? ఆయన ప్రతిష్ఠ అంటే ఉద్యమం ప్రతిష్ఠే. ఆయన ప్రతిష్ఠ బెయిల్ నిధికంటె తక్కువ ప్రాముఖ్యమైందేమీ కాదు.

ఎంతో బాధతో తటపటాయించాడో, మిత్రులు వద్దన్నప్పటికీ కింగ్ సూత్రానికి కట్టుబడి వుండాలని నిర్ణయించాడు. అవును తను మాట నిలుపుకోక తప్పదు. మోసగాడు అన్నపేరు తెచ్చుకోవటం మహా ప్రమాదకరమని భావించాడు.

ఏప్రిల్ 12 వ తారీకున జియోన్‌హిల్ చర్చినుంచి ప్రపథమంగా బయల్దేరింది ఆయనే. ప్రదర్శకులు 50 మంది కంటె ఎక్కువలేరు. అయితే వీళ్ళ కోసం అయిదు జైలు వాహనాలు, వంద మంది పోలీసులు, "బుల్" కానర్

ఇంత మంది నిరీక్షిస్తున్నారు. ప్రదర్శనలో పాల్గొనడానికీ, జైళ్ళో గడపడానికీ అనుగుణమైన ఉడుపులు ధరించి కింగ్ పోలీసుం శ్రేణి దిశగా నడచాడు. ఆయన జీన్సు, షర్టు ధరించాడు. చెదరిపోవలసిందిగా వుత్తరువులు జారీచేశారు; ఆ వుత్తరువును ప్రదర్శకులు లక్ష్యపెట్టలేదు. కింగ్ జైలు వాహనంలోకి ఎక్కారు.

కింగ్ ఎనిమిది రోజులపాటు కటకటాల్లో గడిపాడు. ఆయన తన చిన్న పిల్లల గురించి ఆలోచించాడు. ఇద్దరు అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలు. ఆయన తన సతీమణి గురించి కూడా ఆలోచించాడు. భర్త గురించిన, పిల్లల గురించిన ఆదుర్దా ఆమెలో మళ్ళీ పెరిగింది.

కింగ్ అసహనంతో మండిపోయాడు. ఆయన తన బిడ్డల గురించి ఆలోచించినప్పుడే తన ఉద్యమం గురించి కూడా ఆలోచించాడు. తొందర పడ్డాడన్న నింద ఆయనపై మోపారు. ఎవరు ఆ నింద మోపింది? సమాన హక్కుల్ని బలపరచారని పేరుగల తెల్ల మత గురువులు, సహచరులూను. సుప్రసిద్ధ మత గురువు బిల్లీగ్రాహమ్ "మీ బండికి కొద్దిగా బ్రేకులు వేయండి" అంటూ మతగురువు కింగ్‌కు బహిరంగంగానే సలహాయిచ్చాడు. తమ చర్చిలలోకి నల్లవారిని అనుమతించడానికి సాహసించిన బర్మింగ్‌హామ్‌కు చెందిన ఎనిమిది మంది మితవాద మతగురువులు ఒక విజ్ఞప్తి పత్రం విడుదలచేశారు. "శాంతి భద్రతల కోసం ఇంగిత జ్ఞానం కోసం విజ్ఞప్తి" అనే పేరుతో విడుదలచేశారు. వారు తమ విజ్ఞప్తి పత్రంలో నల్లవారి ఉద్యమాన్ని "వివేకరహితమయినదిగా సమయోచితమైనది కానిదిగా" ఖండించారు.

ఏప్రిల్ 16న కింగ్ "బర్మింగ్‌హామ్ జైలు నుంచి లేఖ" పేరుతో రాసిన సుదీర్ఘమైన లేఖలో సమాధానమిచ్చారు. "ఇరుకు జైలు గదిలో ఒంటరిగా వున్న వ్యక్తి సుదీర్ఘ లేఖలు రాయడం తప్ప దీర్ఘంగా ఆలోచించడం తప్ప దీర్ఘ కాలంపాటు ప్రార్థనలు చేయడం తప్ప మరేం చేస్తాడు?"

తన ప్రత్యర్థులకు ఈయన చేసిన విజ్ఞప్తి ఏ మాత్రం మెతక వైఖరితో కూడుకున్నదిగాని, ప్రార్థనా పూర్వకమైనది గాని కానేకాదు. కింగ్ చాలా ఘాటుగా విమర్శించారు. తనను మందలించిన వారికి ఆయన యిలా సమాధాన మిచ్చారు:

**"మేము మా హక్కుల కోసం 340 యేళ్ళకు పైగా ఎదురుచూశాం. ఆసియా, ఆఫ్రికా జాతులు రాజకీయ స్వాతంత్ర్య సాధనదిశగా జెట్ విమానవేగంతో పరుగులు తీస్తుండగా మేమేమో లంచ్ కౌంటర్లవద్ద ఓకప్పు కాఫీ నంపాయించడానికి గుర్రబ్బండి వేగంతో మెల్లిగా వెళ్తున్నాం. సామాజిక బహిష్కరణ కత్తులదెబ్బలు రుచిచూడని వారికి 'ఎదురు చూడండని' సలహా యివ్వడం బహుశా తేలికే...**

"కొంతమంది పిచ్చెక్కినవారు మీ తల్లుల్ని మీ తండ్రుల్ని కింద పడేసి ఇష్టం వచ్చినట్లు బాదడం మీరు చూస్తే; మీ సోదరిసోదరుల్ని చంపడం చూస్తే; విద్వేషపూరితులైన పోలీసులు మీ నల్ల సోదరులను, సోదరీమణులను బూతులు తిట్టడం, తన్నడం, చంపడం చూస్తే; సంపద్వంత మైన సమాజం మధ్య రెండుకోట్ల మంది మీ నీగ్రో సోదరులు దారిద్ర్య బందిఖానాలో అల్లాడుతుండడం చూస్తే; టెలివిజన్‌లో వ్యాపార ప్రకటన రూపంలో చూపబడిన పబ్లిక్ ఎమ్యూజిమెంట్ పార్కులోకి నన్నెందుకని రానివ్వరు నాన్నా అని మీ ఆరేళ్ళ చిన్నారి కూతురు అడిగినప్పుడు; సమాధానం చెప్పడానికి మీరు తడబడ్డప్పుడు; రంగుజాతుల పిల్లల్ని అందు లోకి రానివ్వరని వివరిస్తే మీ బిడ్డ కళ్ళనిండా నీరు కారినప్పుడు; ఆ చిన్నారి మనోఆకాశంలో న్యూనతాభావ మేఘాలు కమ్ముకోవడం మీరు చూసినప్పుడు; ఆ బిడ్డ తెల్లవారిపట్ల తెలీకుండానే విద్వేషం పెంచుకుని తన వ్యక్తిత్వాన్ని వక్రీకరించడం ప్రారంభించినపుడు; "నాన్నా ఈ తెల్లవాళ్ళు రంగుజాతులవాళ్ళని ఎందుకని అలా నీచంగా చూస్తా"రంటూ ప్రశ్నించిన మీ అయిదేళ్ళ కుమారుడికి తప్పుల తడక సమాధానం చెప్పాల్సి వచ్చినప్పుడు; మీరు దేశపర్యటనకు బయల్దేరితే ఏహోటెల్‌లోనూ వసతి యివ్వకపోతే అన్ని రాత్రుళ్ళూ వరుసగా మీ కార్లోనే పడుకోవాల్సి వచ్చినప్పుడు; ప్రతిచోటా 'తెల్లవారికి' 'రంగుజాతులవారికి' అనే బోర్డులు మిమ్మల్ని నిరంతరం అవమాన సూదులతో గుచ్చుతున్నప్పుడు; ప్రతి ఒక్కరూ నిన్ను 'నిగ్గర్' అని పిలిచినప్పుడు; నీకెంత వయస్సువున్నా నిన్నందరూ అబ్బాయ్ అబ్బాయ్ అని పిలిచినప్పుడు; మీ భార్యను, మీ అమ్మను 'శ్రీమతి' అని సగౌరవంగా పిలవనప్పుడు; రాత్రింబవళ్ళు నీవు నీగ్రో అన్న విషయం నిన్ను వెంటాడుతుంటే; మరుక్షణంలో ఏం జరుగు తుందో తెలీని దుస్థితి వున్నప్పుడు; గుండెల్లో భయం పడగలు విప్పుతుంటే, బయట్నుంచి తిరస్కార బాణాలు వచ్చి గుచ్చుకొంటుంటే; నిరంతరం వ్యక్తిత్వం కోసం పోరాడాల్సిన పరిస్థితి వుంటే - అప్పుడు మాత్రమే మాకు ఎదురుచూడడం ఎందుకు కష్టమో మీకు తెలుస్తుంది.

మార్టిన్ లూథర్‌కింగ్ తన ఎదురు దాడిలో, వర్ణవిద్వేష చట్టాలను ఉల్లం ఘించడానికి తనకు గల హక్కును స్పష్టంగా బలంగా బలపరచుకున్నాడు. "రెండురకాల చట్టాలున్నాయి, న్యాయమైన చట్టమూ, అన్యాయమైన చట్టమూ... మానవ వ్యక్తిత్వాన్ని కించపరచేదేదైనా అన్యాయమైన చట్టమే."

ఈ అహింసా సూత్రాన్ని అతివాదమంటూ నిందించారు. ఆయన తన సమాధానంలో "సృజనాత్మక అతివాదాన్ని" సమర్థించారు.

విడ్డూరం ఏమిటంటే అహింసా విజయం అన్నది ఎదుటి పక్షం నుంచి వచ్చే హింసతో ముడిపడి వుండేది; ఎదుటి పక్షం అంటే శత్రువులూ వర్ణ దురహంకారులూనూ. ఈ విడ్డూరం పథకం ప్రకారం రూపొందించబడిందే. కింగ్ పన్నిన ఎత్తుగడల్లో ఒక భాగమే. ఈ విడ్డూరం వల్ల మూడవ, నిర్ణాయక శక్తి ఘర్షణా రంగంలోకి ప్రవేశించింది. పత్రికల, టెలివిజన్ల, ప్రజాభిప్రాయంల సంఘీభావమే ఆ తృతీయ నిర్ణాయక శక్తి.

ఎనిమిది రోజులపాటు జైల్లో గడిపాక కింగ్‌ను విడుదల చేశారు. తరువాత ఆయన ప్రదర్శనలలో యువత అధికంగా పాల్గొనాలని పట్టుపట్టాడు.

ఇప్పుడు పదుల సంఖ్యలో కాదు వందల సంఖ్యలో ప్రదర్శకులు స్వేచ్ఛాగీతాలు పాడుకుంటూ జైళ్ళకు వెళ్ళారు.

బర్మింగ్‌హామ్‌లో అసాధారణ ఘటన కనిపించింది. స్కూలు పిల్లల బస్సులు స్కూళ్లకు కాకుండా తిన్నగా జైళ్ళకు వెళ్ళాయి. జైలు వాహనాలు తగినంత సంఖ్యలో లేనందున స్కూలు బస్సులను అందుకు వాడుకోవడమేకాక స్కూలు పిల్లలు కూడా స్వచ్ఛందంగా జైళ్ళకు వెళ్ళారు. ప్రదర్శనల్లో పాల్గొనరాదని హెడ్‌మాష్టర్లు ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ ఖాతరు చేయకుండా పిల్లలు పాఠశాలలు వదలి ప్రదర్శనల్లో పొలోమని పాల్గొన్నారు.

మే 2వ తేదీన పోలీసులకు చేతినిండా పనితగిలింది. ఆ ఒక్క రోజులోనే వెయ్యిమందికి పైగా అరెస్టయ్యారు. వీరిలో ఎక్కువ మంది యువతీయువకులు. వీరు ప్రతిఘటించ పోయినప్పటికీ పోలీసులకు సహకరించలేదు. అందువల్ల పోలీసులు వారిని బలవంతంగా వ్యాన్లలోకి, బస్సుల్లోకి ఎక్కించవలసి వచ్చింది.

కోపోద్రిక్తుడైన "బుల్" కానర్ తన ముసుగును లాగిపారేసి అసలు రూపంలో బయటపడ్డాడు.

మే 3 వ తేదీన ప్రదర్శకులను పాశవికంగా కొట్టి చెల్లాచెదురు చేశారు. మరుసటి రోజు అమెరికన్ పత్రికల్లో చరిత్రాత్మకమైన ఫోటోగ్రాఫ్‌లు కనిపించాయి.

పిచ్చెక్కిన యిద్దరు పోలీసులు ఒక వృద్ధ నల్ల మహిళపై లాఠీలు ఝుళిపించారు. ఆవిడ రోడ్డుపై బైఠాయించి వుండింది. అంతే. విస్తుపోయిన నల్లవాళ్ళు పేవుమెంటుపై గుమికూడారు. యువకులు రోడ్డుపై నిల్చున్నారు వారి చొక్కా జేబులపై పోలీసు బ్యాడ్జీలున్నాయి నడుముకు బిగించుకొన్న బెల్టులపై స్టెయిన్‌లెస్ సీల్ జేబీలున్నాయి . కుడిచేతుల్లోని రబ్బరుతాళ్ళతో జర్మన్ కుక్కలను పట్టు

కున్నారు. అవి అటు ఇటూ పెంపర్లాడుతున్నాయి. వీరిలో ఒక నల్లవ్యక్తి కూడా వున్నాడు. అతడు తలపై గడ్డిపోచల్తో చేసిన టోపీ పెట్టుకున్నాడు. కాళ్ళుచేతులు వెడల్పుగా చాపి కష్టభరితమైన నృత్యం చేస్తున్నట్లు కనిపించాడు. ఎడమకాలి ట్రౌజర్ పైనుంచి కిందిదాకా చిరిగింది. తెరచిన అతనినోట్లో పళ్ళు తెల్లగా కనిపిస్తున్నాయి అలాగే ఎడమకాలి కండలు కనిపిస్తున్నాయి. ఒక కుక్క అతని వెనకకాళ్ళపై ఆని నృత్యంలో భాగస్వాములకోసం నిరీక్షిస్తున్నట్లు కనిపించింది. మరో కుక్క అతని కుడికాలి ట్రౌజర్పై తన ముందరికాళ్ళు మోపివుంది.

గోడ దగ్గర నిల్చున్న ముగ్గురు వ్యక్తులు అగ్నిమాపక యంత్రంతో మనుషులపై వురవడిగా నీళ్ళు చిమ్ముతున్నారు. నల్ల వృద్ధమహిళ గోడవైపుకు మెల్లిగా సర్దుకుపోతున్నది. కుడివైపున్న నల్ల యువకుడు మొహంపై చేతులు కప్పుకున్నాడు. మూడోవ్యక్తి తల పైకెత్తి ప్రార్థిస్తున్నట్లు కనిపించాడు. అతనిపై కూడా పోలీసులు మహావేగంగా నీళ్ళు చిమ్ముతున్నారు.

మనకాలంలో హృదయం నుంచి వెలువడే ఆక్రందన కంటే సినిమా కెమెరాకు ఫోటోగ్రాఫులకే ఎక్కువ ప్రాముఖ్యమిస్తున్నారు. నిజమే మరి గుండె నుంచి వెలువడే ప్రతి ఆక్రందన ఇతరులకు విన్పించదు కదా. విలేఖరులు బర్మింగ్‌హామ్ నల్ల పౌరులకు సహాయపడ్డారు. వారు తీసిన ఫోటోగ్రాఫులు అమెరికన్‌ల గుండెల్లో అలజడిరేపాయి. నల్లవారు తొందరపడుతున్నారని ఆరోపించిన వారికి కింగ్ కంటే ఈ ఫోటోగ్రాఫులే చక్కటి సమాధానమిచ్చాయి.

ఈ విధంగా "సృజనాత్మక ఉద్రిక్తత" సృష్టించబడింది. నల్లవారు వెనక్కు తగ్గలేదు. మరుసటి రోజు వేలాది మంది వీధుల్లోకి వచ్చారు. పోలీసుల "అహింస" ముగిసిందని తమమీద కుక్కలు, లాఠీలు దాడిచేస్తాయని స్పష్టంగా తెలిసే వీధుల్లోకి వచ్చారు. అయితే కింగ్ సముచితంగానే అభివర్ణించినట్లు అది "మన శుభ సమయం". ఈ శుభ సమయంలోనే బర్మింగ్‌హామ్ గంటలు ఎల్లెడలా హెచ్చరిక సందేశాన్ని విన్పించాయి.

బర్మింగ్‌హామ్ పోలీసులకు వారి ప్రధాన అధికారికి కోపంతో పిచ్చెక్కింది. శాంతియుతంగా ప్రదర్శన జరుపుతున్న వారిపై పాశవికంగా పగ సాధింపు చర్యలకు తలపడ్డారు. యువకులపైన పిల్లలపైనా విరుచుకు పడ్డారు. ప్రతిరోజూ ఈ ఘటనల తాలూకు వార్తలు టెలివిజన్ తెరల్లోనూ, అమెరికా పత్రికల్లోనూ, ప్రపంచ పత్రికల్లోనూ కనిపించేవి.

యిలాటి ఘటనలు పాశవిక సూత్రాలు చెల్లుబడి అయ్యే దక్షిణప్రాంతంలో మాత్రమే జరుగుతున్నాయని నాగరికమైన ఉత్తరప్రాంతాల్లో జరగడం లేదని ప్రకటనలు ఇవ్వడం ద్వారా అమెరికన్లు ఆ ఘటనలను సమర్థించుకున్నారు.

అయితే ప్రపంచం మాత్రం అలాటి లౌక్యపు మాటలపట్ల ఆసక్తి వ్యక్తం చేసింది కాదు. బర్మింగ్‌హామ్‌లో దర్శన మిచ్చిన అమెరికా వర్ణవివక్ష స్వరూపం చూసి ప్రపంచం గుండెలు దడదడలాడాయి.

ఉద్యమం పతాక స్థాయికి చేరుకున్న ఆ రోజుల్లో 2500 మందికి పైగా జైళ్ళలోకి నెట్టబడ్డారు. "జైళ్ళు నింపండి"నినాదం సర్వసంపూర్ణంగా అమలు పరచబడింది. బర్మింగ్‌హామ్ జైళ్ళు ఎంతగా నిండిపోయాయంటే పోలీసులు ఇక మూకుమ్మడి అరెస్టులకు స్వస్తి చెప్పారు.

ఆనాడు అధ్యక్షుడు కెనడీ, బర్క్‌మార్షల్‌ను బర్మింగ్‌హామ్‌కు పంపించారు. బర్క్‌మార్షల్ అమెరికా అటార్నీ జనరల్‌కు పౌరహక్కుల వ్యవహారాల్లో ప్రధాన సహాయకుడిగా వ్యవహరించేవారు. బర్మింగ్‌హామ్‌లోని నల్లనాయకులకు తెల్ల వ్యాపారులకు మధ్య చర్చలు నిర్వహించే కర్తవ్యాన్ని బర్క్‌మార్షల్‌కు అప్పగించారు. తెల్ల వ్యాపారులకు బర్మింగ్‌హామ్‌పై తిరుగులేని పెత్తనముండేది.

బర్మింగ్‌హామ్‌లో ఒకవైపు ప్రదర్శనలు జరుగుతున్నప్పటికీ మరోవైపు నల్ల నాయకులకు, తెల్లవారి సీనియర్ సిటిజన్స్ కమిటీకి మధ్య రహస్యంగా చర్చలు జరిగాయి. నల్ల నాయకులు నాలుగు డిమాండ్లను ముందుకు తెచ్చారు.

1. బార్లలోనూ, పౌరప్రాంతాల్లోనూ, షాపుల్లోని కాఫీ హోటళ్ళలోనూ సామాజిక బహిష్కారాన్ని రద్దు చేయాలి.
2. నల్లవారిని ప్రమోట్ చేయడంలో వివక్ష చూపరాదు. షాపుల్లోనూ, పారిశ్రామిక సంస్థల్లోనూ నల్లవారిని నియమించుకోవాలి.
3. ఖైదీలుగావున్న ప్రదర్శకులపై కేసులను ఎత్తివేయాలి.
4. బర్మింగ్‌హామ్ జీవితం తాలూకు ఇతర రంగాల్లో సామాజిక బహిష్కారాన్ని తొలగించేందుకు అవసరమయిన కార్యక్రమాన్ని రూపొందించేందుకు నల్లవారు, తెల్లవారు సభ్యులుగాగల కమిటీని ఏర్పాటుచేయాలి.

ఏదిఏమైనా పోలీసుల దమనకాండ ఆగలేదు. ఉద్యమ నిర్వాహకులు నల్లవారి క్రోధాన్ని అదుపుచేయలేకపోయారు. అహింస పాటించని దళాలు పోరాట స్రవంతిలో పాల్గొన్నాయి. అహింసపై విశ్వాసం పోగొట్టుకున్నవారు కాబట్టి వారు పోలీసులపై యిటుకలు, ఖాళీ సీసాలు విసరసాగారు. పర్యవసానంగా పాశవికత మరింత ఉధృతరూపం దాల్చింది.

సామాజిక వెలి పాటించే దుకాణాలను బహిష్కరించడం నిరంతరాయంగా కొనసాగింది. నల్లవారు షాపులముందు పికెటింగ్ కొనసాగించారు. ఒకటి మాత్రం వాస్తవం. నగరంలో కొనుగోళ్ళు చేయాలన్న భావం ఎవరికీ లేదు. తెల్లపౌరులు కూడా ఈ వర్ణవివక్షా పర్యవసానాలకు పోలీసు లాఠీలకు, కుక్కలకు

దూరంగా వుందామనుకున్నారు. పోలీసుల దమనకాండ పోరాటాన్ని ఉధృతం చేసింది. ఆచరణలో మాత్రం నల్లవారికి ఎక్కువగా సహాయపడింది డాలరే. షాపుల యజమానులకు విపరీతమయిన నష్టాలు సంభవించాయి. ఇందువల్ల "నగరపిత"లైన వ్యాపారులు నల్లవారితో చర్చలను తీవ్రంగా పరిగణించక తప్పలేదు. చివరకు మే 10 వ తేదీన ఉభయ పక్షాలు నాలుగు అంశాల ఒప్పందానికి వచ్చాయి. ఒకటవ అంశం - మూడ్రోజుల్లోగా సామాజిక బహిష్కారాన్ని రద్దుచేయాలి. రెండవ అంశం - రెండ్రోజుల్లోగా పరిస్థితిని మెరుగుపరచాలి. మూడవ అంశం - జైళ్ళలో నిర్బంధింపబడిన వారిని విడుదల చేసేందుకు అధికారులు హామీ యిచ్చారు. నాలుగవ అంశం - నల్లవారి, తెల్లవారి మధ్య సహకారాన్ని సాధించేందుకు రెండు వారాల్లోగా ఒక సంస్థను ఏర్పాటుచేయాలి.

## విజయం ! లేక ఇది విజయమేనా ?

మే 11 వ తేదీ శనివారం రాత్రి మార్టిన్ లూథర్ కింగ్ తమ్ముడయిన ఆల్ఫ్రెడ్ డేనియల్ కింగ్ ఇంటిపై కారులోంచి రెండు బాంబులు విసిరారు. డేనియల్ కింగ్ కూడా బర్మింగ్‌హామ్‌లో మతగురువుగా పనిచేస్తున్నారు. బాంబులవల్ల ఇంటి ముందరి భాగం దెబ్బతింది. అయితే ఆయన భార్యకు, ఐదుగురు బిడ్డలకు గాయాలు తగల్లేదు. తరువాత కొద్ది నిమిషాలకు అదే కారు నుంచి గాస్టన్ మోటెల్‌పై మరో బాంబు విసరబడింది. (నేరస్థులు పట్టుబడనే లేదు. ఆ మోటెల్లోని 30వ గదిలో కింగ్ నివసిస్తున్నాడు కాబట్టి ఆ గదిపైకే బాంబు విసిరారు. అయితే అదృష్టవశాత్తూ కింగ్ సోదరులు అప్పుడు తమ కుటుంబ సభ్యులతో సహా అట్లాంటాలో వున్నారు.

నల్లవారున్న ప్రాంతాల్లో జనం రద్దీగా తిరుగుతున్నప్పుడే, బార్లింకా మూయకముందే ఆ శనివారం రాత్రి బాంబులు విసిరారు. గాస్టన్ మోటెల్‌కు, ఆల్ఫ్రెడ్ డేనియల్ కింగ్ ఇంటికి పంపబడ్డ పోలీసులపై ఇటుకరాళ్ళు విసిరారు.

హింస కోసం ఎదురుచూస్తున్న పోలీసు గస్తీ దళాలు విరుచుకుపడ్డాయి. నల్లవారిపై తుపాకీ మడమలు, ముష్టి ఘాతాలు నాట్యమాడాయి. విచక్షణ పాటించకుండా కొట్టారు. పోలీసు గస్తీదళాలు హోటెల్ దగ్గర జనాన్ని చెదరగొట్టి ఇక వీధుల్లో పడ్డారు కనిపించిన ప్రతి నల్ల వ్యక్తిని చితకబాదారు. ఇందుకు ప్రతిఫలంగా నల్లవారు తెల్లవారి షాపులను తగలబెట్టారు. మంటల్ని ఆర్పడానికి వెళ్ళిన తెల్లవారిపై ఇటుకలు, సీసాలు విసిరారు. మరుసటి రోజు ప్రొద్దుట నాలుగు గంటలకు మాత్రమే "శాంతిభద్రతలు" తిరిగి నెలకొన్నాయి. గాయాలు తగిలిన యాభైమంది స్త్రీ పురుషులను ఆస్పత్రిలో చేర్చారు.

విజయోత్సాహదినం తరువాతి రాత్రి గడచిన తీరు అది.

ఈ దఫా అధ్యక్షుడు కెన్నెడియే ఆ విషమ పరిస్థితిలో జోక్యం చేసుకోక తప్పలేదు. ఆయన మే 12 వ తేదీ సాయంత్రం బర్మింగ్‌హామ్ స్థావరాల్లోని మూడువేల మంది సైనికులను నగరంలోకి పంపించాల్సిందిగా ఉత్తర్వులు జారీ చేశాడు. అవసరమయితే అలబామాలోని నేషనల్ గార్డ్ దళాలను కూడా సమీకరిస్తానని ప్రకటించాడు. రెగ్యులర్ దళాలను విమానాల్లో బర్మింగ్‌హామ్ ప్రాంతానికి తరలించారు.

మే 23 వ తారీఖున అలబామా సుప్రీమ్ కోర్ట్ బర్మింగ్‌హామ్ ప్రధాన పోలీసు అధికారిగా వ్యవహరిస్తున్న "బుల్" కానర్‌ను బర్తరఫ్ చేసింది. ఆ అర్థంలో నల్లవారికి లభించిన విజయం నిర్వివాదమైనది.

అయితే నల్లవారి పోరాటం ఉధృతమయ్యేకొద్దీ అధ్యక్షుడు కెన్నెడీకి అరకొర చర్యల విధానాన్ని అవలంబించడం కష్టం కాసాగింది. దేశంలో "పౌరశాంతి" నెలకొల్పవలసిన అవసరం దృష్ట్యానూ విదేశాల్లో ప్రతిష్ఠను కాపాడుకోవలసిన దృష్ట్యానూ అమెరికన్లకు గల రాజ్యాంగబద్ధమైన హక్కుల దృష్ట్యానూ సామాజిక బహిష్కరణ సమస్యను పరిష్కరించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. అధ్యక్షుడు కెన్నడీ ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలను నెరవేర్చడానికి నిరాకరించడంతో నల్లవారి భ్రమలూ ఉదారవాదులైన తెల్లవారి భ్రమలూ అధికాధికంగా పటాపంచలు కాసాగాయి. ఇంకొంచెం సంయమనం పాటించాల్సిందిగా చేసిన విజ్ఞప్తులకు ప్రతిస్పందనగా అసహిష్ణుత, నిరసన వ్యక్తమయ్యాయి.

జూన్ 13 వ తారీఖున జాతినుద్దేశించి టెలివిజన్లో ప్రసంగించాడు. ఆయన ఇలా అన్నాడు. "మహత్తరమైన మార్పు రాబోతున్నది. మన కర్తవ్యం ఆ విప్లవాన్ని ఆ మార్పును సర్వులకూ శాంతియుతమైనదిగా నిర్మాణాత్మకమైనదిగా చేయడమే."

మార్పా ?

అదే రోజు సాయంత్రం మిసిసిపికి చెందిన నల్లజాతి నాయకుడు మెడ్‌గర్ యివర్స్‌ను ఆయనింటి గడపముందే దారుణంగా చంపారు. జూన్ 19 వ తేదీన అధ్యక్షుడు చాలా ముఖ్యమైన ఒక ముసాయిదా చట్టాన్ని కాంగ్రెస్(పార్లమెంట్)కు పంపించాడు. ఆయన వైట్‌హౌస్‌లో ప్రవేశించిన వెయ్యిరోజుల్లోకెల్లా ఇదే అత్యంత ముఖ్యమైన ముసాయిదా చట్టం. ఈ చట్టం విస్తృతస్థాయిలో సామాజిక బహిష్కరణను రద్దుచేయడానికి నల్లవారి ఉద్యోగాల నియామకాల్లో చూపే వర్ణపరమైన వివక్షను రద్దు చేయడానికి అవకాశం కల్పించింది. ఈ చర్యల అమలుకు తోడ్పడే నిబంధనలు కూడా అందులో వున్నాయి.

జూన్ 22వ తేదీన అధ్యక్షుడు జాన్‌కెన్నడీ కొంతమంది నల్లనాయకులను వైట్‌హౌస్‌కు ఆహ్వానించాడు. వాషింగ్టన్‌లో జరగబోయే ప్రదర్శన గురించి చర్చించారు. జరగబోయే ప్రజాప్రదర్శన, తాను ప్రతిపాదించిన చట్టాన్ని పార్లమెంట్‌లో వ్యతిరేకించేవారికి బలం చేకూరుస్తుందని అధ్యక్షుడు భయపడ్డాడు. "వీధులనుంచి నీగ్రోలను పంపించాల్సిందిగా" ఆ సమావేశానికి హాజరైన నాయకులను ఒప్పించడానికి అధ్యక్షుడు చేసిన ప్రయత్నాలు విఫలమై పోయాయి. మార్టిన్ లూథర్‌కింగ్ తన లక్ష్యం సరైందని నిరూపించుకున్న వ్యక్తిగా, విజేతగా ఆ సమావేశానికి హాజరయ్యాడు. అయితే ఆయనకు బద్ధవిరోధులు, అస్థిర మిత్రులూ వున్నమాట కూడా నిజం.

బర్మింగ్‌హామ్‌లో మోగిన స్వేచ్ఛాఘంట 1963 వేసవిలో దేశమంతటా ఖంగు ఖంగున ప్రతిధ్వనించింది. నాలుగుమాసాల కాలంలో 35 రాష్ట్రాల్లో, 196 నగరాల్లో సమానహక్కుల కోసం 841 ప్రదర్శనలు జరిగాయి.

చరిత్రలోకి ఎక్కిన "వాషింగ్టన్ ప్రదర్శన" ఆగష్టు 28 న జరిగింది. వేలాదిమంది ప్రజలు నల్లవారు, తెల్లవారు విడివిడిగానూ గుంపులు గుంపులు గానూ 200 మీటర్లఎత్తుగల వాషింగ్టన్ స్థూపం దిశగా కదిలారు. ఆగష్టు సూర్యుడింకా క్షితిజరేఖనుండి బయటపడలేదు. చలిగాలులు వీస్తున్నాయి. అయినప్పటికీ వారంతా ఉత్సాహంగానే వున్నారు. అందుకు కారణం గతంలో ఎన్నడూలేని విధంగా పెద్దసంఖ్యలో వారంతా అక్కడే అలా కూడడమే! క్షణ క్షణానికీ వారి సంఖ్య పెరుగుతూండడమే. సరిగ్గా మధ్యాహ్ననికి ప్రదర్శకుల సంఖ్య రెండులక్షల యాభై వేలకు పెరిగింది. వారంతా తమ నాయకుల ఆదేశాల మేరకు ప్రశాంతంగా ఎలాటి తొట్రుపాటు లేకుండా లింకన్‌స్మారకస్థూపం దిశగా జనసముద్రంలా కదిలారు. అక్కడ "మహత్తర విముక్తిదాయకుడు" అయిన లింకన్ విగ్రహం పాలరాయితో చేయబడింది వుంది.

పైగా అప్పటికి లింకన్ సుప్రసిద్ధ విముక్తిప్రకటన విడుదలచేసి సరిగ్గా వంద యేళ్ళయింది. అది నూరవ వార్షికోత్సం తామింకా విముక్తిచెందలేదని, తమపై లాఠీలు కుక్కలు, నీళ్ళపంపులు దాడిచేస్తున్నన్నాళ్ళూ తమకు ఉత్సవం చేసుకోడానికి తగిన సందర్భమేదీ కనిపించలేదని మొత్తందేశానికి 35 వ అధ్యక్షునికి గుర్తుచేయడానికి నల్లపోరాట యోధులు, వారి మిత్రులు ఆ నాడక్కడ అలాకూడారు.

లింకన్ స్మారకస్థూపం ముందు జరిగిన సమావేశానికి ఉద్యమ వృద్ధ నాయకుడు, నల్లవారు ఏర్పాటు చేసుకున్న స్లీపింగ్ కార్ పోర్టర్స్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు అయిన ఫిలిప్ రాండాల్ఫ్ అధ్యక్షత వహించారు.

కింగ్ చివరన ప్రసంగించారు. ఆయన చెప్పింది శ్రద్ధగా, గౌరవంగా విన్నారు. ప్రసంగించడానికి ముందు నిరీక్షిస్తున్న సమయంలో ఆయన అలసి పోయినట్లుగా కనిపించారు. అందుకు కారణం అంతకు ముందు కొన్ని మాసాలుగా ఉద్రిక్తస్థితి వుండడమూ, ముందురోజు రాత్రి నిద్రలేకుండా గడప డమునూ. ఆయన వాషింగ్టన్ హోటల్ రూములో ప్రొద్దుట నాలుగుగంటల వరకూ మేల్కొని తన ప్రసంగం తయారు చేసుకొన్నాడు.

ఆయన స్వప్నంగురించి మాట్లాడారు. అరుదైన విశ్వాసం పెల్లుబుకు తుండగా రెండున్నర లక్షల ప్రజానీకం ముందు తన స్వప్నం గురించి ప్రసం గించారు. అది మామూలు విశ్వాసంకాదు. తన ఒక్కమాటకూడా, ఒక్కభావం కూడా వృధాపోదని ప్రతిమాట ప్రతిభావమూ కోరుకున్న ఐక్యతనూ, సౌభ్రా తృత్వాన్ని సృష్టిస్తుందని స్పష్టంగా తెలిసినప్పుడు పెల్లుబికే విశ్వాసం అది. మార్టిన్ లూథర్ కింగ్‌కు గొప్ప పోరాట యోధుడికి, కవికి వుండే హృదయం వుండింది. ఆ హృదయం సన్నిహితులకేకాక కోట్లాదిమంది ఇతరులకుకూడా తెరచిన గ్రంథంలాటిది. ఆయనకన్న మహత్తర స్వప్నం ఇదీ.

"నా స్వప్నం ఇది. మునుపటి బానిసల కుమారులు మునుపటి బానిస యజమానుల కుమారులు ఏదో ఒకరోజు జార్జియా ఎర్రకొండలపై సౌభ్రాతృత్వం మేజాదగ్గర కలిసి కూర్చుంటారు. ఈనాడు దమనకాండ వడగాడ్పులతో అల్లలా డుతున్న మిసిసిపి రాష్ట్రం ఏదో ఒకరోజు స్వేచ్ఛాన్యాయాల ఒయాసిస్సుగా మారుతుందన్నది నా స్వప్నం.

"చర్మం రంగుతోకాక వ్యక్తిత్వ శీలాన్ని బట్టి మనుషుల మంచి చెడ్డలు నిర్ణయింపబడే దేశంలో నా నలుగురు బిడ్డలూ నివసించేరోజు వస్తుందన్నది నా స్వప్నం.

"ఏదో ఒకరోజు ప్రతిలోయ ఎత్తుచేయబడుతుంది. ప్రతిగుట్టకొండ చదును చేయబడుతుంది, హెచ్చుతగ్గుల స్థలాలన్నీ చదునుచేయబడతాయి, వంకరటింకర స్థలాన్నీ తిన్నగా తీర్చిదిద్దబడతాయి. ఇదీ నా కల. నేను ఈ విశ్వాసంతోనే దక్షిణం వెళ్తున్నాను. మనం ఈ విశ్వాసంతోనే నిరాశానిస్పృహల పర్వతం నుంచి ఆశావహమైన రాయిని తీయగలం. మనం ఈవిశ్వాసంతోనే ఏదో ఒక నాటికి స్వేచ్ఛా జీవులం కాగలమని గ్రహిస్తూ కలిసి పనిచేయగలం కలిసి ప్రార్థించగలం, కలిసి పోరాడగలం...

"...మనం స్వేచ్ఛా ఘంటను మోగడానికి అనుమతించిననాడు ప్రతి పట్టణంలోనూ, పల్లెలోనూ, రాష్ట్రంలోనూ అది మోగడానికి అనుమతించిననాడు దేవుని బిడ్డలందరూ నల్లవారు, తెల్లవారు, యూదులు, యూదేతరులు, ప్రొటె

స్టాంట్లు, కాథలిక్కులు అందరూ చేతులు కలిపి "చివరకు స్వేచ్ఛ, చివరకు స్వేచ్ఛ, సర్వశక్తివంతుడు ప్రభువు, చివర మనమంతా స్వేచ్ఛాజీవులం అనే నీగ్రోపాటను పాడగలిగే రోజు రాకను వేగవంతం చేయగలం."

ఆయన స్వప్నం నిజంగా మహోత్కృష్టమైనది, ఆయన నింపాదింగా ఆచితూచి తన ప్రసంగాన్ని ప్రారంభించి ఆవేశంతో, ఆవేదనతో ఊగిపోయాడు. ఆఫ్రికన్ వ్యక్తిత్వం ఉట్టిపడేలా చాలా వేగంగా మాట్లాడారు. తన స్వప్నాన్ని వేగిర పరుస్తున్న వ్యక్తిలా ఆ స్వప్నసౌందర్యాన్ని కని నిశ్చేష్టుడయిన వ్యక్తిలా త్వరత్వరగా మాట్లాడారు. గుంపులో నుండి నల్లజనాలు ఆనందంలో పరవశిస్తూ "స్వప్నాన్ని పొడిగించండి, స్వప్నాన్ని పొడిగించండి" అంటూ కేకలు వేశారు

అది ఆయన మహత్తర ప్రసంగం, అది ఆయన మహత్తర దినం. ఆయన కాల్చి చంపబడిన సందర్భంగా రచయితలూ, పత్రికా రచయితలూ చరిత్రలో మహత్తర స్వప్నం గల వ్యక్తిగా అభివర్ణించారు. "నాకో స్వప్నం వుంది" అనే అక్షరాలు ఆయన మృత్తివార్తల్లోనూ, ఫోటోల ఆల్బమ్‌లలోనూ ఇంకా ఇతర రికార్డులలోనూ శీర్షికాస్థానాన్ని చోటుచేసుకున్నాయి. సుప్రసిద్ధమైన ఆయన ప్రసంగంలోని ఈ క్రింది ఆఖరుపదాలను అట్లాంటాలోని ఆయన సమాధిపై రచించారు. "చివరకు స్వేచ్ఛ, చివరకు స్వేచ్ఛ, సర్వశక్తివంతుడు ప్రభువు, చివరకు నేను స్వేచ్ఛాజీవిని". సరే ఈ విషయం గురించి తర్వాత ప్రస్తావిద్దాం.

మహత్తరమైన ఆ రోజు తర్వాత, ప్రదర్శకులు వైట్‌హౌస్‌కు వెళ్ళాక అమెరికా అధ్యక్షుని సమక్షంలో ఈయనను ఉద్దేశించి "జాతికి నైతిక నాయకుడు అని ఫిలిప్‌రాండాల్ఫ్ ప్రశంసించిన తర్వాత మార్టిన్ లూథర్ కింగ్ తిరిగి దక్షిణం వెళ్ళిపోయాడు". హెచ్చు తగ్గుల స్థలాలన్నీ చదును చేయబడతాయి, వంకర టింకర స్థలాలన్నీ తిన్నగా తీర్చిదిద్దబడతాయి, వర్ణ దురహంకార రాత్రి గడచి సౌభ్రాతృత్వపు ఉషస్సు ఉదయిస్తుంది" అనే విశ్వాసంతో ఆయన దక్షిణం వెళ్ళిపోయాడు. వాషింగ్టన్ ప్రదర్శన ముగిసాక సరిగ్గా 18 రోజులకు అంటే 1963 సెప్టెంబరు 15వ తారీకున బర్మింగ్‌హామ్‌కు చెందిన వర్ణదురహంకారులు ఒక నల్లవారి పాఠశాలపై బాంబులు విసిరి నలుగురు చిన్నారి బాలికలను పొట్టన బెట్టుకున్నారు. వాస్తవానికి మొదటి నుంచీ బర్మింగ్‌హామ్‌లో రక్తం పారని రోజు లేదు కానీ ఇలాటి దారుణనేరం మాత్రం చరిత్రలో ఎన్నడూ జరగలేదు. ఇది చాలదన్నట్లు అదేరోజు ఒక తెల్లపోలీసు ఓ నల్లబాలుని చంపాడు. కొంత మంది తెల్ల రౌడీలు సైకిల్‌పై ప్రశాంతంగా వెళ్తున్న ఓ నల్ల యువకుని పట్టి దారుణంగా చంపారు. మొత్తం ఆరుగురు అమాయకులను......

సెప్టెంబరు 18 వ తేదీన బర్మింగ్‌హామ్‌లో గంభీర వాతావరణంలో అంత్యక్రియలు జరిగాయి. మున్సిపల్ సంస్థకు చెందిన ఒక్క అధికార ప్రతినిధి కూడా హాజరుకాలేదు; అధికారుల నుంచి సంతాప సందేశాల్లేవు. కొంతమంది ధైర్యంగల తెల్లమత గురువులు తప్ప శ్వేత పౌరులెవ్వరూ అంత్యక్రియలకు హాజరుకాలేదు. కింగ్ ఇలా వ్యాఖ్యానించాడు. "ఈ రోజు ఖననం చేయబడింది పిల్లల భౌతికకాయాలు కాదు, వారితో పాటు గౌరవం, మర్యాద కూడా పాతిపెట్ట బడ్డాయి.

1963 నవంబరు 22 వ తారీకున తుపాకీ కాల్పులు వినిపించాయి. ఈ దఫా ఆ తుపాకీ గుళ్ళు అధ్యక్షుడు జాన్ కెన్నెడీని ఖతం చేశాయి.

ఈ హత్య ఎలాటి విద్వేష భావాలను, హింసాత్మక భావాలను, ప్రతీకార భావాలను సృష్టించింది? డల్లాస్ నగర రహస్యాల గురించి నేను రాయడం లేదు. ఆ సంవత్సరం జరిగిన వర్ణ కలహాల మూలంగా దేశ వ్యాపితంగా హింసాత్మక అసహిష్ణతా వాతావరణం ప్రజ్వరిల్లింది. అధ్యక్షుడు కెన్నెడీ పౌర హక్కుల సంరక్షణకు అరకొర చర్యలు తీసుకొన్నప్పటికీ ఆయనకు నీగ్రోల సానుభూతి పరుడు అన్న పేరు వచ్చి ఆయన ప్రాణాలకు ముప్పు తెచ్చింది. వసంత రుతువు లోనూ, వేసవిలోనూ, ఆకురాలు కాలంలోనూ (1963) వర్ణపరమైన ఉద్రిక్తతలు కొనసాగడంతో ఆయన పలుకుబడి బాగా పడిపోయింది. కెన్నెడీ ప్రభుత్వ విధానాలను 69 శాతం అమెరికన్లు మాత్రమే ఆమోదించినట్టు నవంబరులో జరిపిన నమూనా పోలింగ్‌లో వెల్లడయ్యింది.

బర్మింగ్‌హామ్ ఘటనలపై తాను రచించిన గ్రంథంలో కింగ్ ఇలా నొక్కి చెప్పాడు. "అధ్యక్షుడు కెన్నెడీని చంపింది ఎవరు అన్న ప్రశ్నకంటే ఆయన్ను చంపడానికి దారితీసిన పరిస్థితులేమిటి అన్న ప్రశ్నే ఎక్కువ ముఖ్య మైనది. నైతికంగా దుష్కర వాతావరణమే మన అధ్యక్షుని హత్య చేసింది...

"...అధ్యక్షుడు కెన్నెడీ తన మరణం ద్వారా మనందరకూ ముఖ్యమైన విషయం చెబుతున్నాడు. వర్ణ వివక్షతోనూ విద్వేషంతోనూ తమ ప్రజలను భ్రష్టు పట్టించిన ప్రతి రాజకీయ నాయకునికీ ఆయన ఏదో కొంత చెబుతున్నాడు. వర్ణ వివక్ష రుగ్మతలను పాటిస్తూ ఇనుప కిటికీల వెనుక సురక్షితంగా వున్న ప్రతి మత గురువుకూ ఆయన ఏదో కొంత చెబుతున్నాడు..."

"...మన జాతి నరాల్లోకి ఎక్కిన ఈ విద్వేషపు రోగ క్రిములను నిరోధించకపోతే అది చివరకు మన నైతిక, ఆత్మిక పతనానికి దారి తీస్తుంది."

కింగ్ సతీమణి కోరెట్టా తన జ్ఞాపకాలలో డల్లాస్ దాడి గురించి అధ్యక్షుడు గాయపడ్డాడన్న తొలి వార్తల గురించి వివరించారు. తాను తన భర్త మరిన్ని

వార్తల కోసం టి. వి. సెట్ దగ్గర కూర్చుని జాన్ కెన్నెడీ ప్రాణరక్షణ కోసం ప్రార్థించామని ఆమె చెప్పారు. అధ్యక్షుడు చనిపోయినట్లు ప్రకటించగానే మార్టిన్ కింగ్ కాసేపు స్తంభీభూతులయిపోయారు. కాసేపున్నాక తేరుకుని ఆయన యిలా అన్నాడు : ''నాకు జరగబోయేది కూడా ఇదే. నేను రోజూ చెప్తున్నాను కదా మనది రోగగ్రస్త సమాజం."

తన జ్ఞాపకాలలో కొరెట్టా ఇంకా ఇలా రాశారు: "నేనేమీ మాట్లాడలేకపోయాను. నా భర్తను ఓదార్చేమాటలు నా దగ్గరలేవు 'మీకిది జరగదు లెండి' అని నేను చెప్పలేకపోయాను. ఆయన భావం సరైనదేనని నేను అనుకున్నాను. అది మహా ఆవేదనాభరితమైన నిశ్శబ్దం. నేను మరింత దగ్గరగా జరిగి నా చేతిలోకి ఆయన చేయిని తీసుకున్నాను."

జాన్ కెన్నెడీ, మార్టిన్ లూథర్ కింగ్‌ల మార్గాలు పలుసార్లు భౌతికంగానూ. రాజకీయంగానూ పరస్పరం విభేదించాయి. అధ్యక్షుని జీవితపు ఆఖరు సంవత్సరంలో వారిద్దరిమధ్యా అసౌకర్యపు సహకారరూపం ఆవిర్భవించినమాట నిజమే అయినా వారిద్దరూ తరచుగా మిత్రులుగా వుండడం కంటే ప్రత్యర్థులు గానే వుండినారు. ఆ ఆఖరు సంవత్సరం అధ్యక్షుడికి ప్రమాదకరమైనదిగా వుండింది. నల్లవారు శృతిమించి డిమాండు చేస్తున్నారని త్వరత్వరగా డిమాండ్ చేస్తున్నారని కెన్నెడీ భావించాడు. కాగా కెన్నెడీ చాల తక్కువ చేస్తున్నాడని, నిదానంగానూ, అనిశ్చయాత్మకంగానూ వ్యవహరిస్తున్నాడనీ కింగ్ భావించాడు

ఇద్దరూ చంపబడ్డారు. కాకపోతే వారి జీవితకాలాల్లో వారు ఎదుర్కొనబోయే హింసాత్మక మృత్యువు గురించి నిర్ణయించడం అసంబద్ధంగా వుండేది. వీరిలో ఒక్కరే వీరుడు; ఆయనకు తన ముందున్నదేమిటో తెల్సు. ఒక ఆదర్శం కోసం సమర్పణంగా సేవచేసే బాధ్యతను తనే స్వయంగా స్వీకరించాడు.

బర్మింగ్‌హామ్ ఘటనల పరాకాష్ఠ దశలో కెన్నెడీ పార్లమెంటుకు పంపిన పౌరహక్కుల చట్టాన్ని వెంటనే ఆమోదించడమే హత్యకాబడిన అధ్యక్షుడికి ఉత్తమోత్తమమైన స్మారకచిహ్నం కాగలదని అధ్యక్షుడు జాన్సన్ ప్రకటించాడు. జాన్ కెన్నెడీ అంత్యక్రియలు ముగిశాక అమెరికా పార్లమెంట్‌లో చేసిన ప్రపథమ ప్రసంగంలో ఆయన ఆ విధంగా అన్నారు.

నవంబరు విషాదదినాలు గడిచాయి. డిశెంబరు కూడా ముగిసింది. 1963 పౌరహక్కుల చట్టం పేరును 1964 పౌరహక్కుల చట్టంగా మార్చారు. అయినా దానికి అప్పటికి శాసనరూపం లభించనేలేదు. వైట్‌హౌస్ విజ్ఞప్తి చేసినప్పటికీ పార్లమెంట్ తాత్సారంచేసింది. వసంతం వచ్చింది. సెనేట్‌లోని దక్షిణప్రాంతపు వర్ణదురహంకారులు అవరోధ చర్యల ద్వారా ఆ చట్టం ఆమోదింప బడకుండా అడ్డుపడ్డారు.

ఏది ఏమైనా అవరోధకులు వెనకతట్టు రంగంలోనే తమపోరాటం సాగించారు. వారు చట్టంలోని కొన్ని నిబంధనలను బలహీనపరచి నిర్వీర్యం చేయగలిగారు. అయితే అధ్యక్షుడు జాన్సన్, హ్యుబర్ట్‌హంఫ్రీ నేతృత్వంలో ఉత్తరప్రాంతపు డెమోక్రట్లు గట్టిగా కృషిచేసి ఆ చట్టాన్ని సెనేట్ ఆమోదించేలా చేశారు. సెనేట్‌లో అవసరమయిన మూడింట రెండువంతుల మెజార్టీ లభించింది. ప్రతినిధుల సభ కూడా ఆ చట్టాన్ని ఆమోదించింది.

1964 జులై రెండవ తారీకున ప్రతినిధుల సభలో ఓటింగ్ జరిగిన ఐదు గంటలకు అధ్యక్షుడు జాన్సన్ వైట్‌హౌస్‌లో చట్టంపై సంతకం చేశాడు. దాంతో చట్టానికి అమలురూపం లభించింది. సంతకం చేసిన చర్యను టెలివిజన్‌లో చూపించారు.

అధ్యక్షుడు జాన్సన్ ఆ చట్టం ప్రయోజనాన్ని వివరిస్తూ యిలా అన్నాడు. "భగవంతుడి ముందు సమానులుగా వున్న అందరూ ఇకమీదట పోలింగ్ కేంద్రాల్లోనూ, తరగతి గదుల్లోనూ, ఫ్యాక్టరీలలోనూ, హోటళ్ళలోనూ, రెస్టారెంట్లలోనూ, సినిమాథియేటర్లలోనూ ప్రజలకు సేవలందించే ప్రతిస్థలంలోనూ సమానులుగా వుంటారు. ఆయన 49 నిబంధనలున్న ఆ చట్టం పూర్తిపాఠంపై మొత్తం 75 పెన్నులతో సంతకంచేశాడు. సిద్ధంగా వుంచిన పెన్నులు చాలక పోవడంతో సహాయకుడు మరిన్ని పెన్నులు పట్టుకొచ్చాడు. జాన్సన్ మహా దర్పంగా ఉపయోగించిన పెన్నులను ఆ ఉత్సవానికి హాజరైన సెనెటర్లవద్దకు, ప్రజాప్రతినిధుల వద్దకూ విసిరాడు. వారు ఎంతో కృతజ్ఞతా పూర్వకంగా వాటిని స్మారకచిహ్నాల్లా పట్టుకున్నారు.

ఆ ఉత్సవానికి నల్లనాయకులను కూడా ఆహ్వానించారు. డాక్టర్ కింగ్ అధ్యక్షుడి పక్కనే నిల్చున్నాడు. అధ్యక్షుడు జాన్సన్ కింగ్‌కు కూడా ఒకపెన్ను అమూల్యమైన ఆస్తుల్లో ఒకటిగా వుండిపోతుంది. వాస్తవానికి నాకో కట్టపెన్నులు రావలసింది".

జాన్సన్‌కు హంఫ్రీకి ప్రశంసలు లభించాయి. కింగ్‌కు సమానత్వంకోసం పోరాడిన ఇతరులకూ ముందు ప్రమాదభరితమైన నూతన పోరాటం నిల్చుంది. చట్టానికి ఆచరణ రూపమిచ్చే పోరాటం అది. సామాజిక బహిష్కరణ రద్దయినప్పటికీ వర్ణదురహంకారులు, వర్ణదురహంకారమూ అదృశ్యమైపోలేదు తాము ఆ చట్టాన్ని గుర్తించబోమని కోర్టులకువెళ్ళి తీర్పుల ద్వారా లభించే నిర్వచనాల మూలంగా ఆ చట్టాన్ని పక్కకు నెట్టేస్తామని దక్షిణప్రాంతానికి చెందిన జార్జ్ వాలెస్, మిసిసిపి గవర్నర్ పాల్‌జాన్సన్ వారి తాబేదార్లు ఒకవైపు ప్రకటిస్తూనే వున్నారు. ఆ సవాలును కూడా స్వీకరించవలసి వుండింది.

ముందున్నది ముళ్ళతో నిండిన కొత్తబాటే అయినప్పటికీ కింగ్‌కు ప్రశంసలు కూడా లభించాయి. వర్ణదురహంకారంపై రాజ్యాంగబద్ధంగా బల మైన దెబ్బకొట్టిన ఒకానొక ప్రారంభవ్యక్తిగా ఆయనను నిజాయితీ గల అమెరికా అభినందించింది.

1964 ఆకురాలు కాలం కింగ్‌కు చిరస్మరణీయమైనది. అక్టోబరు 14 న ఆయన అట్లాంటాలోని సెంట్ జోసెఫ్ ఆస్పత్రిలో చేరారు. పరీక్ష చేయించుకో డానికి, అలసట నుంచి తేరుకోడానికి ఆయన అందులో చేరారు. చేరిన మరుసటి రోజే ఆయన వార్డులో టెలిఫోన్ మోగింది.

ఆనందంతో ఎగసిపడుతున్న కొరెట్టా గొంతు యిలా వినిపించింది. "మార్టిన్! మార్టిన్! మీకు నోబెల్ బహుమతి ప్రకటించారు." ఆ ఆనందప్రద మైన వార్త ఆయన బొత్తిగా ఊహించింది కాదు కాబట్టి వెంటనే నమ్మలేక పోయాడు.

డిసెంబరు మాసంలో ఒకరోజు సాయంత్రం ఓస్లోలో మార్టిన్ కింగ్ అమెరికాలోని నల్ల ప్రజల నాయకుడిగా ఆ బహుమతి స్వీకరించారు. తను మామూలుగా ధరించే నల్ల కోటు వేసుకుని సగౌరవంగా నోబెల్ ప్రైజ్ స్వీక రించారు.

ఆయన ఓస్లోలో తన దేశపు నల్లవారి, నిమ్న వర్గపు ప్రజల సమాన హక్కుల కోసం, న్యాయంకోసం పోరాడే ప్రతినిధిగా మాత్రమేకాక అంతకంటే కాస్త ఎక్కువ స్థాయిలోనే వ్యవహరించారు. యావత్ ప్రపంచ భవితవ్యం పట్ల ఆదుర్దా గల వ్యక్తిగా "ప్రతి దేశమూ సైనిక వాదం అనే మెట్ల మీదుగా దిగి అణు విధ్వంసం అనే నరకంలోకి దిగిపోక తప్పదన్న అమానుష భావాన్ని" తిరస్కరించిన వ్యక్తిగా ఆయన ప్రసంగించారు. ప్రపంచంలో కోట్లాది ప్రజలు అనుభవిస్తున్న లేమి గురించి మాట్లాడారు. "దారిద్ర్యంపై సర్వ సంపూర్ణ యుద్ధం" ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. దారిద్ర్య లక్షణాలపైనే కాక దారిద్ర్యం మూల కారణాలపై యుద్ధం ప్రకటించాలన్నారు.

కింగ్ నోబెల్ బహుమతితో అమెరికాకు తిరిగి వచ్చారు. న్యూయార్క్‌లో ఆయనకోసం సంఖ్యానేక సన్మానాలు, విందులు ఎదురు చూస్తున్నాయి. అద్భుత మేమిటంటే తన సొంత పట్టణం అయిన అట్లాంటా విమానాశ్రయంలో దక్షిణ ప్రాంతానికి చెందిన తెల్లప్రజలే ఆయనను ఆటోగ్రాఫ్ అడిగారు. వాషింగ్టన్‌లో ప్రియమైన అతిథిగా గౌరవించబడ్డారు.

ఏది ఏమైనా కింగ్ తన సొంత ప్రజ్ఞాపాటవాల గురించి ఆలోచించకుండా ముందున్న సమస్యల తోరణాన్ని దృష్టిలో వుంచుకుని తనలోని అహంకారాన్ని

దూరంగా నెట్టగలిగాడు. ఆయన భయపడే వ్యక్తికాదు న్యూయార్క్ సన్మాన సభలో ఇలా అన్నాడు. "నేను ప్రతిరోజూ మృత్యు ప్రమాదంలోనే నివసిస్తున్నాను. అయితే ప్రజలు అంతా సవ్యంగా వున్నట్లు మంచి విషయాలు చెప్పడం భలే మంచి వైరుధ్యం. నేనేమో కొండమీదే వుండిపోవాలనుకుంటున్నాను. కాని లోయ, నిరాశా నిస్పృహల లోయ నన్ను పిలుస్తున్నది. మళ్ళీ లోయ దగ్గరకు వెళ్ళ తప్పదు."

ఆయన 1965 జనవరిలో అలబామాకు చెందిన సెల్మాలో ఒక సుదీర్ఘ ప్రచారోద్యమం ప్రారంభించాడు. ఎలాటి ఆస్తుల సర్టిఫికెట్లు, విధేయతా సర్టిఫికెట్లు, రాజ్యాంగాన్ని 'అర్థం చేసుకోగలిగే' చదువు లేని నల్లవారిని కూడా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని కోరుతూ ఉద్యమం ప్రారంభించాడు. అలబామా జనాభాలో నల్లవారు నలభై శాతానికి పైగా వున్నప్పటికీ ఎన్నికైన సంస్థల్లో వారికి రాజకీయ ప్రాముఖ్యం లేదు. కేవలం కొన్నివేల మంది నల్లవారి పేర్లు మాత్రమే ఓటర్ల జాబితాలో వుండేవి. నల్లవారికి ఓటుహక్కు కల్పించే సుప్రసిద్ధ 1964 చట్టం వున్నప్పటికీ షరీఫ్‌క్లార్క్, జార్జ్‌వాలెస్ ప్రభృతులు దీన్ని ఖాతరు చేయలేదు.

జిమ్‌క్లార్క్ మహాక్రూరుడు, మొండివాడు. అహింస గురించి ఓస్లోలో ఉద్ఘాటింపబడన దానికి సెల్మా పట్టణం ప్రతిస్పందించనే లేదు.

మార్టిన్ లూథర్ కింగ్ మళ్ళీ స్వేచ్ఛాఘంట మోగించాడు. ఓటర్ల నమోదు ఆఫీసువున్న ప్రతి కోర్టు వద్దకు ప్రదర్శన నిర్వహించాడు. జిమ్‌క్లార్కూ అతని సిబ్బంది ప్రదర్శకులను తరిమికొట్టేవారు లేదా అరెస్టు చేసేవారు. కొద్దిమంది నల్లవారు ఎలాగో తంటాలుపడి కోర్టులోపలకు వెళ్ళగలిగితే అక్కడవున్న ఓటర్లను నమోదుచేసే గుమాస్తాలు వీళ్ళకు చదువు వచ్చా? రాదా? అని పరీక్షలు పెట్టేవారు. అవి భాషా శాస్త్రజ్ఞులను సైతం అనుత్తీర్ణులను చేసే పరీక్షలు.

"మనం జయించాలి. అంటూ నల్లవారు గీతాలాపన చేశారు. తన రొమ్ము మీద బ్యాడ్జీ పెట్టుకున్న జిమ్‌క్లార్క్ మాత్రం మొండిగా "మీరు జయించలేరు" అన్నాడు.

ఏడువారాల్లో రెండువేల మందికి పైగా జైళ్ళకు పంపబడ్డారు.

జిమ్మీలీ జాక్సన్ అనే కట్టెలుకొట్టుకునే ఓ నల్లవ్యక్తిని పోలీసులు దారుణంగా చంపినవుడు సెల్మానుంచి మాంట్‌గోమెరీకి ప్రదర్శన నిర్వహించాల్సిందిగా కింగ్ పిలుపు ఇచ్చాడు మార్చి 7వ తారీఖున పోలీసులు ప్రదర్శనను భగ్నం చేశారు. సెల్మా శివార్లలోనే ప్రదర్శకులను పాశవికంగా బాదారు.



వర్ణ దురహంకార వ్యతిరేక ప్రదర్శన సందర్భంగా బర్మింగ్ హామ్‌లో 2 వేల మందికి పైగా ప్రజలు అరెస్టయ్యారు.

అయితే వర్ణదురహంకారుల హింస వాస్తవంలో కింగ్‌పై తోడ్పడింది. ప్రజాదృష్టిని మళ్ళించడానికి మళ్ళీ చావులని, రక్తాన్ని, విరిగిన పక్కటెముకలను మూల్యంగా చెల్లించారు. అలబామలో జరిగిన రక్తపాత సంఘర్షణ అమెరికా అంతటా ప్రతిధ్వనించింది; దేశవ్యాపితంగా సానుభూతి, తోడ్పాటు వెల్లువెత్తాయి.

సెల్మానుంచి మాంట్‌గోమెరీకి మళ్ళీ ప్రదర్శన నిర్వహించాలని కింగ్ రెండోసారి పిలుపునిచ్చాడు. ఫెడరల్ ప్రభుత్వాధికారులు రక్తపాతం జరుగుతుందని భయపడి ప్రదర్శనను నిర్వహించారు. వివిధ ప్రాంతాలనుంచి ప్రదర్శనలో పాల్గొనడానికి వచ్చిన తెల్ల అమెరికన్లకు అంతులేని విద్వేషం ఎదురైంది. సెల్మాలోని నల్లవారి రెస్టారెంటు ముందు జేమ్స్ రీబ్ అనే బోస్టన్‌కు చెందిన తెల్ల మత గురువును శ్వేతవర్ణ దురహంకారులు విచక్షణా రహితంగా కొట్టి చంపారు. ఆయన భోంచేయడానికి రెస్టారెంట్‌లోకి వెళ్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. డెట్రాయిట్‌కు చెందిన వయోలా లూయిజో అనే ఐదుగురు బిడ్డల తల్లిని ఆమె కారుదగ్గరే కొట్టిచంపారు. సెల్మాలో జరిగిన సంఘటనలు జాతీయ సంక్షోభ స్థాయిని అందుకున్నాయి. అంతకు సంవత్సరం ముందు బర్మింగ్‌హామ్ ఘటనలలాగే ఈ ఘటనం వత్తిడికి తట్టుకోలేక అమెరికా సంయుక్త రాష్ట్రాల అధ్యక్షుడు నోరు తెరచి మాట్లాడక తప్పలేదు.

చివరకు మూడవ ప్రయత్నంలో ప్రదర్శన విజయవంతమైంది. అధ్యక్షుడు పంపిన ఫెడరల్ సైనికదళాల రక్షణలో ప్రదర్శకులు మాంట్‌గోమెరీ చేరుకున్నారు.

మార్టిన్ లూథర్ కింగ్ మాంట్‌గోమేరీలోని రాష్ట్ర లెజిస్లేటర్ల భవనం ముందు ప్రసంగించాడు. ఈ భవనం డెక్‌స్టర్ చర్చికి కాస్త దూరంలో వుంది. పదేళ్ళకు పూర్వం బస్సుల బహిష్కరణ జరిగిన సందర్భంగా కింగ్ తన నూతన జీవితాన్ని ప్రారంభించింది ఈ చర్చి దగ్గరే. అనంతరం ఆయన జీవితంలో ఒక సంపూర్ణ విప్లవం గడచింది. ఇప్పుడు మళ్ళీ ఈ వసంతరుతువులో మాంట్‌గోమెరీకి వచ్చి ప్రజల నుద్దేశించి ప్రసంగించాడు. ఈ గొడవలు ఎప్పుడు ముగుస్తాయంటూ ప్రశ్నించిన వారికి ఆయన ఇలా సమాధానమిచ్చాడు :

**"ఇదెన్నాళ్ళు కొనసాగుతుందంటూ మీరివ్వాళ అడుగుతారని నాకు తెలుసు. ఈ ఉద్యమం ఎంత కష్టభరితమైనప్పటికీ ప్రస్తుత పరిస్థితి ఎంత నిరుత్సాహజనకంగా వున్నప్పటికీ ఇది దీర్ఘ కాలంపాటు కొనసాగదని చెప్పాలనుకుంటున్నాను. ఎందుచేతనంటే కింద పడిన సత్యం మళ్ళీ పైకి లేవక తప్పదు. ఇదెంత కాలం కొనసాగుతుంది? ఎక్కువ కాలం కొన**

**సాగదు; ఎందుచేతనంటే ఏ అబద్ధమూ శాశ్వతంగా జీవించలేదు. ఎంత కాలం? దీర్ఘ కాలం కాదు. ఎందుకంటే మీరు విత్తుకున్నది మీకు పండక తప్పదు."**

సెల్మా ప్రచారోద్యమానికి రెండు ఫలితాలు లభించాయి. (1) ముగ్గురు వ్యక్తులు చంపబడ్డారు, డజన్ల సంఖ్యలో గాయపడ్డారు. 3,800 మంది అరెస్ట య్యారు. (2) కాగా ఎన్నికల జాబితాల్లోకి 50 మంది నల్లవారి పేర్లు మాత్రమే ఎక్కాయి. ఈ ఉద్యమానికి మూడవ ఫలితం కూడా లేకపోలేదు. అమెరికా పార్లమెంటు మరో చట్టం ఆమోదించేలా నల్లవారు చేయగలిగారు. అది 1965 ఓటింగ్ హక్కుల చట్టం. ఈ చట్టం ఓటర్ల జాబితాలను తయారుచేసే రిజిస్ట్రార్లను నియమించే అధికారం దక్షిణంలోని వర్ణదురహంకారులకు కాక ఫెడరల్ అధికారులకే దఖలు పరిచింది. అధ్యక్షుడు జాన్సన్ పార్లమెంట్ భవనంలో 1965 ఆగష్టు 6వ తారీకున ఈ చట్టంపై సంతకం చేశారు. సంతకం చేసిన ఉత్సవానికి హాజరైనవారిలో మార్టిన్ లూథర్‌కింగ్ కూడా వున్నారు.

## జనమే నాయకులను సృష్టించారు

ఆత్మత్యాగ పోరాటాల ద్వారా సాధించిన ఆ చట్టాలు వారికి ప్రయోజనా లను చేకూర్చాయి. ఆ పోరాటాలు నల్ల అమెరికన్ల వ్యక్తిత్వాన్ని సుదృఢం చేశాయి. వారికి దృఢత్వం, గౌరవం నేర్పాయి. అయితే తనకు ఈ చట్టబద్ధ మైన పౌర హక్కులు లాంఛనప్రాయమైన సమానత్వాన్ని మాత్రమే ప్రసాదించా యని, ఆచరణాత్మక సమానత్వం తనకింకా దక్కలేదని నల్ల అమెరికన్ పౌరుడు స్పష్టంగా గ్రహించాడు.

ఇటు దక్షిణ ప్రాంతంలో మార్టిన్ కింగ్, తదితరులు నల్లజనాలను జాగృతం చేస్తుండగా ప్రదర్శనల హోరుతో వర్ణవివక్షవ్యవస్థను అదరగొడు తుండగా ఈ వ్యవస్థ గట్టిగాతోస్తే పడిపోయే ఇటుకగోడ లాటిదని గ్రహిస్తుండగా అటు వుత్తరంలో నల్లవారు క్రోధావేశాలతో ఊగిపోతున్నారు.

ఉత్తరప్రాంతంలో పౌరహక్కుల నినాదపరిమితులు స్పష్టంగా వుండినాయి. అక్కడి నల్లవారు చాలాకాలంగా పౌరహక్కులు అనుభవిస్తున్నారు; ఫెడరల్ ప్రభుత్వం కంటేముందే రాష్ట్రప్రభుత్వాలే అందుకు అవసరమయిన చట్టాలను రూపొందించాయి; వర్ణగత జాతులను విభజించే సంకేతాలు అదృశ్యమైపోయాయి. అయినప్పటికీ విడివిడిగా నల్లవారిపేటలు, ఆచరణలో సామాజిక బహిష్కరణ అమలులో వున్నాయి.

ఇప్పుడు పోరాట కేంద్రం దక్షిణం నుంచి వుత్తరానికి తరలింది. దశాబ్దాల తరబడిగా నల్లఅమెరికన్లు పెద్దసంఖ్యలో ఉత్తర ప్రాంతానికి వలసవెళ్ళిన ఫలితం ఇది.

1968లో నెవార్క్ జనాభాలో నల్లవారు సగానికి పైగా వుండినారు; వాషింగ్టన్ జనాభాలో మూడింట రెండువంతులు వుండినారు. కాగా 1985 నాటికి చికాగో, డిట్రాయిట్, ఫిలడెల్ఫియా, బాల్టిమోర్, గారీ, క్లీవ్‌లాండ్, ఓక్లాండ్, రిచ్‌మాండ్, సెయింట్ లూయిస్ వగైరా పెద్ద నగరాలలో నల్లవారు అత్యధిక సంఖ్యాకులుగా వుంటారని అధికారులు అంచనా వేశారు.

1967లో అధికారులు తయారుచేసిన గణాంక వివరాల ప్రకారం, తెల్ల అమెరికన్లలో కంటే నల్లఅమెరికన్లలో నిరుద్యోగం రెండురెట్లు ఎక్కువ వుండింది. కాగా ఈ సంఖ్యలు సమగ్రమైనవికావు. నిరుద్యోగంతో పాటు పాక్షిక ఉద్యోగాన్నికూడా కలిపి లెక్కిస్తే మొత్తం నల్లజనాభాలో నిరుద్యోగుల శాతం 33-34 మేరకు వుండింది.

ఉత్తర ప్రాంతంలో ఈ విధంగా నల్లజనాభా పెరుగుదలతో పాటు వారి నిరుద్యోగం కూడా వేగంగా పెరిగింది. దుస్థితికి దరిద్రానికి అత్యంత సాధారణ సూచిక నిరుద్యోగమే కదా. మనుషుల సంఖ్య పెరగడంతో పాటు నిరాశా నిస్పృహలు కూడా పెరిగాయి. పర్యవసానంగా విస్ఫోటక ప్రమాదం తలెత్తింది.

1960ల ప్రారంభంలోనూ, మధ్యలోనూ గల పరిస్థితిని కూడా ఈ సందర్భంగా వివరించాలి: అమెరికాలో కనీవినీ ఎరుగని విధంగా దీర్ఘకాలం పాటు ఆర్థిక సౌభాగ్యం వర్ధిల్లింది. అయితే ఈ సౌభాగ్యం నల్ల అమెరికన్లలో అత్యధిక సంఖ్యాకులకు అద్దంలో వస్తువులా చేతికి అందకుండా వుండిపోయింది. శాస్త్రము, సాంకేతిక పరిజ్ఞానమూ పెరిగినప్పటికీ నల్ల జనాభాలో మాత్రం "సాంకేతిక నిరుద్యోగం" పెరిగింది. స్వయంచాలన యంత్ర పద్ధతి పెరిగే కొద్దీ నైపుణ్యం లేని కార్మికుల అవసరం తగ్గిపోయింద.

చివరన అతి ముఖ్యమైన మానసిక అంశంగురించి చెప్పాలి; అది నల్ల జనాల ఆశాభంగం. దక్షిణప్రాంతంలోని పత్తితోటల్లో నడుంవంచుకుని పనిచేసే నల్లవారు, వర్ణదురహంకారుల క్రూరత్వానికి గురయ్యే నల్లవారు, అహరహమూ భయంగుప్పెట్లో జీవించే నల్లవారు ఉత్తర ప్రాంతంలో తమకు స్వేచ్ఛ, చక్కటి జీవితం లభిస్తాయని తరుచుగా కలలుగనేవారు.

అయితే నల్లరచయిత క్లాడీబ్రౌన్ అన్నట్లు, ఆ అసంతృప్తి నల్లజనాలు తాము పెనంమీదనుంచి పొయ్యిలో పడ్డట్లు గమనించారు. ఉత్తర ప్రాంతంలో నల్లజనాల మురికిపేటలు వుంటాయని వలసరావడానికి ముందు వారు ఊహించనే లేదు.

SUN...

క్లాడీబ్రౌన్ ఇలా వ్యంగంగా రాశారు. "హార్లెమ్ చేరిన మా తల్లిదండ్రుల నూతనతరం నిగ్గర్లను సృష్టించారు. అయితే ఈ కొత్త నిగ్గర్ని ఎవరూ అర్థం చేసుకోలేదు. అతన్ని అర్థం చేసుకోడానికి ఎవరూ సిద్ధంగా లేరు".

దారిద్ర్యం అన్నది సామాజిక దురవస్థేతప్ప నేరం కాదు. చిత్తశుద్ధిగల ప్రజలు తిరస్కృతులను, అవమానితులను సానుభూతితో సంఘీభావంతో చూస్తారుతప్ప మరోవిధంగా చూడలేరు. అయితే పేదలకు దేవతల తాలూకు పరిశుద్ధ నైతిక రెక్కలను తగిలించే యంత్రపద్ధతిని ఇప్పటివరకూ ఎవరూ కనిపెట్టారుకాదు. ఎలుకలు, జనంతో కిటకిటలాడే అపార్టుమెంట్లు దిన కూలీలు వున్నచోట్ల నిరాశా నిస్పృహలు, భగ్నహృదయాలు వుండితీరతాయి. వ్యక్తిత్వ అభివృద్ధి పంథాలో దరిద్రం సృష్టించిన ఇతర అవరోధాలకు పర్వపరమైన అడ్డుగోడ తోడైనప్పుడు ముఖ్యంగా యువతీ యువకులకు తమను తాము నిరూపించుకోడానికి నేరం లాటి పద్ధతులు మాత్రమే కనిపిస్తాయి.

న్యూయార్క్ నగరంలోని సగటునేరాలకంటె హార్లెమ్ (న్యూయార్క్‌లో నల్లజనాలు నివసించే పెద్దపేట-అనువాదకుడు) లోని యువతీ యువకుల్లో నేరాలరేటు రెట్టింపు వుండింది; మాదకద్రవ్యాలకు బానిసలుగా మారినవారి సంఖ్య ఎనిమిదినుంచి పదిరెట్లదాకా ఎక్కువ వుండింది; సుఖరోగాలతో బాధపడే వారి శాతం ఆరురెట్లు ఎక్కువ వుండింది; క్షయవ్యాధిగ్రస్తుల శాతం ఒకటిన్నర రెట్లు ఎక్కువ వుండింది; బాల్య మరణాలసంఖ్య రెట్టింపు వుండింది.

నల్లకుటుంబాల పరిస్థితి ఆందోళన కలిగించేదిగా వుండింది. ఉత్తర ప్రాంతంలో విచ్ఛిన్న కుటుంబాల శాతం, విడాకుల శాతం, అక్రమ సంతానం చాలా ఎక్కువగా వుండింది. హార్లెమ్‌లో ప్రతి ఐదుగురు పిల్లలలోనూ ఇద్దరు పిల్లలు తండ్రులు లేనివారే.

ఈ విధంగా అమెరికా నాగరికతకు కేంద్ర బిందువైన ప్రధాన నగరాల్లోని నీగ్రోపేటల్లో ప్రజ్వలనాత్మకమైన, సామాజికంగా విస్ఫోటమైన మానవ పదార్థం పెరుగుతూవుండింది. నిరంతరం నిప్పులరవ్వలు కనిపిస్తూనే వుండేవి.

1965 ఆగస్టు 11 వ తారీకు సాయంత్రం 7 గంటలకు వాట్స్ అనే పట్టణంలో మార్కెటీ ఫ్రీయే అనే ఓ నల్ల అమెరికన్ కారును తెల్ల పోలీసు ఆపాడు. లాస్ ఏంజలెస్‌కు దక్షిణంగా దగ్గరగావున్న వాట్స్‌లో వేలాది మంది నల్ల అమెరికన్లు అద్దెయిళ్ళలో నివసిస్తున్నారు మార్కెటీఫ్రీయే నిర్లక్ష్యంగా డ్రైవ్ చేస్తున్నాడన్నది పోలీసు ఆరోపణ. ఆయన ప్రతిఘటించడంతో పోలీసు రెచ్చిపోయాడు. ఇంతలో జనమంతా గుమికూడారు. జనంలోని ఓవ్యక్తి, ఒక తెల్లపోలీసు ఒక నల్ల గర్భిణీస్త్రీని తోసాడన్నాడు. ఈ తెల్లపోలీసు జనాన్ని

తప్పించుకొని స్త్రీయేను తన వెంట పట్టుకెళ్ళాడు. ఈ ఘటన మూలంగానూ, కాలిఫోర్నియాలో మండుతున్న ఎండల మూలంగానూ జనం చెల్లాచెదురు కాలేదు. పైపెచ్చు జనం సంఖ్య మరింత పెరిగింది. పుకార్లవల్ల కూడా జనం సంఖ్య పెరిగింది. కార్లలో వెళుతున్న తెల్లవారిపై రాళ్ళు విసిరారు. శాంతి భద్రతలను నెలకొల్పడానికి వచ్చిన పోలీసులపై ఎదురుదాడులు ప్రారంభించారు. తిరుగుబాటు దావానలంలా త్వరగానూ భయంకరంగానూ అంటుకుంది. తెల్లపోలీసులు, తెల్లషాపుయజమానులువారు ప్రదర్శించేవివక్ష ఆదావానలానికి గాలిగాతోడ్పడ్డాయి. తిరుగుబాటు ఒక జిల్లానుంచి మరోజిల్లాకు అంటుకుంది. మొదట ఇళ్ళకు నిప్పు పెట్టారు; దుకాణాలను దోచుకున్నారు. యుకకులు వీధుల్లో వీరంగం వేశారు: అదనంగా పంపబడిన పోలీసుదళాలు అగ్నికి ఆజ్యంలా తోడ్పడ్డాయి.

ఈ మంటలు నాలుగురోజులపాటు అవిచ్ఛిన్నంగా మండిపోయాయి. "శాంతి భద్రతాదళాల" బుల్లెట్లు 34 మంది నల్లఅమెరికన్ల ప్రాణాలు బలిగొన్నాయి. మొత్తం 150 జిల్లాల్లో 46 చదరపు కిలోమీటర్ల ప్రాంతంలో ఆ కార్చిచ్చులు వ్యాపించాయి. ఆగష్టు 14 వ తేదీ సాయంత్రానికి గాని ఈ తిరుగుబాటు అణచివేయబడలేదు. 14,000 మంది భద్రతాదళాలు 1500 మంది పోలీసులు ఏకమై ఆ తిరుగుబాటు మంటల్ని ఆర్పారు. అధికార్ల అంచనా ప్రకారం దాదాపు 10 వేల మంది నల్లవారు ఘటనల్లో పాల్గొన్నారు. 1032 మంది గాయపడ్డారు. 3952 మంది నల్లవారు అరెస్టయ్యారు. 40 మిలియన్ డాలర్లమేరకు ఆస్తినష్టం జరిగింది. 600 భవనాలు దెబ్బతిన్నాయి. 200 భవనాలు తగలెట్టి నేలమట్టంచేశారు.

కాలిఫోర్నియా గవర్నర్ ఎడ్మండ్ బ్రౌన్ ఈ తిరుగుబాటు ఘటనలపై దర్యాప్తు జరపడానికి ఒక కమీషన్ ఏర్పాటు చేశారు. సి. ఐ. ఏ. మాజీ అధిపతి జాన్ మెకోన్‌ను కమీషన్ అధ్యక్షుడిగా నియమించారు. ఇదంతా "పథకం ప్రకారం ద్రోహులు చేసిందని" నిందలు వేసే వుద్దేశంతో తమకు అనుగుణంగా సాక్ష్యంచెప్పే ముఠాలను చేరదీశారు. అయితే జాన్ మెకోన్ కుట్ర జరిగినట్లు నిరూపించలేకపోయాడు. తిరుగుబాటు అయత్నకృతంగా జరిగిందిగా తేలిపోయింది.

కమిషన్ ఇలా హెచ్చరించింది: "ప్రస్తుతం సాగుతున్న ఉల్లంఘన పరిస్థితిని ఇలాగే కొనసాగనిస్తే కొంతకాలంలో మన సమాజం ఇక తిరుగులేని విధంగా చీలిపోతుంది."

ఆగష్టు తిరుగుబాటు ఘటనలు కింగ్‌కున్న అహింసా పోరాట భావనపై మానసికంగా పెద్ద దెబ్బతీసింది. యాదృచ్ఛికంగానే అయినా అధ్యక్షుడు జాన్సన్

ఓటింగు హక్కులపై సంతకం చేసిన ఐదురోజుల తర్వాత ఈ ప్రజ్వలనాత్మక ఘటనలు జరిగాయి.

1966 నుంచి వర్ణపరమైన ఘటనల్లో నూతన ఉద్రిక్తత బలంగా చోటు చేసుకున్న మాట నిజమే అయినప్పటికీ వాట్స్‌లో జరిగిన ఘటనలను మించిన ఘటనలు ఎక్కడా జరగలేదు.

తర్వాత 1967 లో కూడా రికార్డుకెక్కిన ఘటనలే జరిగాయి. అంతర్యుద్ధం తర్వాత దేశంలో ఇంతటి తీవ్రమైన అంతర్గత రాజకీయ సంక్షోభం జరగలేదని అందరూ భావించారు. నాష్‌విల్లీ, టెన్నిసీ, జాక్సన్, మిసిసిపి, టెక్సాస్, హూస్టన్‌లలో వసంత ఋతువులో వర్ణపరమైన గొడవలు జరిగాయి. అనంతరం వేసవిలో మరింత దీర్ఘకాలం పాటు, మరింత తీవ్రమైన ఘటనలు జరిగాయి. ఈ వర్ణపరమైన ప్రజ్వలనలు యావత్‌దేశాన్ని మందు పాతరగా మార్చివేశాయి; నువ్వెక్కడ నిల్చున్నా బలంగా పేలి నిన్ను గాలిలోకి ఎగురగొట్టేవి.

1967 జులైలో అమెరికా సంయుక్త రాష్ట్రాలను నూతన అంతర్యుద్ధం అనే భూతం ఆవహించింది. నల్ల వ్యతిరేక ఉన్మాదంతో ఊగిపోతున్న పార్లమెంటు ఆ అగ్నిపై ఆజ్యం పోసింది. జులై 19 వ తేదీన ప్రజాప్రతినిధుల సభ (హౌస్ ఆఫ్ రెప్రజెంటేటివ్స్) అశాంతిని "రెచ్చకొట్టుతున్న వారిపై" చర్యలు తీసుకోడానికి ఉద్దేశించిన చట్టానికి అనుకూలంగా ఓటు చేసింది. దాడులను గొడవలను రెచ్చగొట్టే లేక నిర్వహించే ఉద్దేశంతో ఒక రాష్ట్రంనుంచి మరొక రాష్ట్రానికి వెళ్ళడాన్నికూడా ఆ చట్టం నేరంగా పరిణమించింది. (ఒక రాష్ట్రంనుంచి మరొక రాష్ట్రానికి ఆ ఉద్దేశంతో పంపిన తపాలా బట్వాడాలుకూడా నేరంగా పరిగణింపబడతాయి). జులై 20 వ తేదీన ప్రజాప్రతినిధుల సభ ఎలుకల నిర్మూలనకు ఉద్దేశించిన 40 మిలియన్ డాలర్ల కేటాయింపు బిల్లును తోసివేసింది. ఎలుకలు సాధారణంగా వుండేది నీగ్రో పేటల్లోనే కాబట్టి కక్షతో వారా బిల్లును తిరస్కరించారు.

వర్ణజాతుల మధ్య మున్నెప్పుడూ లేని ఉద్రిక్త సంబంధాలు కొనసాగుతున్న పూర్వరంగంలో పార్లమెంట్ చర్య సంకేత స్వభావాన్ని సంతరించుకుంది. లెజిస్లేటర్లనుంచి అవగాహనను ఆశించడం వృధా అని నల్లవారికి గుర్తు చేసినట్లయింది.

అధ్యక్షుడు జాన్సన్ ఉద్రిక్త పరిస్థితిని ఉపశమింప చేసేందుకు హడావుడిగా ప్రయత్నిస్తూ పార్లమెంట్ సభ్యులను తీవ్రంగా ఖండించారు; వారి చర్య "అమెరికా బిడ్డలపై పడిన క్రూరమైన దెబ్బ" అని వ్యాఖ్యానించారు.

ఒక ప్రక్క వియత్నాంలో అమెరికా యుద్ధం కొనసాగిస్తున్నది; మరో ప్రక్క అంతర్గతంగా రాజకీయ పరిస్థితి ప్రకోపించింది. ఇలాటి నేపథ్యంలో వర్ణపరమైన గొడవలు జరిగాయి. వియత్నాంతో పోలిక అనివార్యమే మరి. ఎందుకంటే వియత్నామీయులతో లాగే తమ సొంత "రంగుజాతుల" వారితో కూడా వాషింగ్టనూ, ప్రభుత్వ అధికారులు అందరూ తుపాకి భాషలోనే మాట్లాడారు. సాయుధ దళాలను వుపయోగించడానికి సన్నద్ధతా, సాయుధ దళాలను చాలా వేగంగా "సహజసిద్ధంగా" వాడుకోవటమూ-ఇవి స్పష్టంగా కొట్టొచ్చినట్లు కనిపించాయి. అమెరికన్ రాజకీయ నాయకుల బుర్రల్లోకి సైనికవాదం ఎంత లోతుగా చొచ్చుకొని పోయిందో ఇవి స్పష్టంగా నిరూపిస్తున్నాయి.

నీగ్రో పేటల్లోని విషమ పరిస్థితిని వివరిస్తూ చెల్లింపుల సమతూకం సంక్షోభానికి వియత్నాం కారణమన్నారు. వియత్నాంలో అమెరికా సాగించే యుద్ధానికి సంవత్సరానికి 24,000 మిలియన్ డాలర్లు ఖర్చవుతున్నది. కాగా స్వదేశంలో "దారిద్ర్యంపై యుద్ధాని"కి యేటా 1900 మిలియన్ డాలర్లు మాత్రమే ఖర్చు పెడుతున్నారు. అధ్యక్షుడు జాన్సన్ "మహత్తర సమాజం" అంటూ చేసిన వాగ్దానాలను చాలా అరుదుగా మాత్రమే ప్రస్తావించసాగారు. మరోవంక ఆయన్ను విమర్శించే వారేమో తరుచుగా "రోగగ్రస్త సమాజం" అనే ప్రస్తావనలు చేశారు. ఒకేసారి అటు ఉత్తర వియత్నామీయులపైనా ఇటు అమెరికా సంయుక్త రాష్ట్రాల్లోని దారిద్ర్యం పైనా రెండు యుద్ధాలు కొనసాగించడం మానసికంగా కూడా అసాధ్యమేనని సెనేటర్ ఫుల్ బ్రైట్ సరిగానే వ్యాఖ్యానించారు. ఎందుకంటే వనరులతో పాటు శ్రద్ధ కూడా వియత్నాంపై యుద్ధానికే పూర్తిగా కేటాయింపబడ్డాయని ఆయన అన్నారు. సత్యం తాలూకు మరో పార్శ్వాన్ని కూడా ఆ గొడవలు వెల్లడించాయి. అడవుల్లో సాగే నీచమైన యుద్ధం, ఇతర ప్రజానీకాన్ని నిర్దాక్షిణ్యంగా నిర్మూలించే నీచమైన యుద్ధం వాస్తవానికి "మరో అమెరికా" అనబడే నల్లవారితో వ్యవహరించే విషయంలో కఠోరమైన పద్ధతులను అవలంబించేందుకు అమెరికా నాయకులను జనాభాలోని ఎక్కువ భాగాన్ని మానసికంగా సన్నద్ధం చేసింది.

"ఆందోళనాకారుల" కోసం ఎంతగా పరిశోధించినప్పటికీ దాడిదార్లకు వ్యతిరేకంగా ఎంతగా దుష్ప్రచారం చేసినప్పటికీ మొత్తానికి అన్ని దర్యాప్తులూ ఒకే ఒక విషయాన్ని ధృవీకరించాయి. దాడులు అయత్నకృతంగా ప్రజ్వలించాయన్న విషయాన్ని దాడిదారులకు ఎలాటి కార్యక్రమం కాని రాజకీయ, ఆర్థిక లక్ష్యాలు కాని లేవన్న విషయాన్ని నిర్ద్వంద్వంగా ధృవీకరించాయి. డజన్ల సంఖ్యలోని నగరాలలో ఏక సమయంలో వర్ణపరమైన గొడవలు తలెత్తినప్పటికీ

ఆ నగరాలు భౌతికంగా పరస్పరం దూరంగా వున్నవి; ఐక్య నాయకత్వం కాని గుర్తింపు పొందిన నాయకులు కాని లేరు. ఫ్రెడ్ హారిస్ అనే ఓ సెనెటర్ ఆ తర్వాత అన్నట్లు జనాలే నాయకులను సృష్టించారు తప్ప నాయకులు జనాలను సృష్టించ లేదు.

దుకాణాలపైన సామూహిక దాడులు జరగడం, దోపిడీలు జరగడం, గృహ దహనాలు జరగడం- ఇవన్నీ కూడా ఆ నిరసనోద్యమానికి గల అయత్నకృత స్వభావాన్ని పాశవిక విధ్వంసకర స్వభావాన్ని స్పష్టంగా నిరూపిస్తున్నాయి. అది ప్రతీకారమే తప్ప కేవలం శాసనోల్లంఘనం కాదు; ఆస్తి యజమానుల జాతిపట్ల ప్రతీకారం అది.

అధికారులు ప్రారంభించిన శాంతిపరచే ప్రచారమూ, శిక్షించే చర్యలూ అన్నీ కఠోరమైన బలప్రయోగంతోనే సాగాయి.

వైఖరుల్లో కొద్దిగా తేడావున్నప్పటికీ మొత్తానికి అమెరికాలోని బూర్జువా శక్తులన్నీ తిరుగుబాటు దార్లపట్ల ఏకమయ్యాయి. దక్షిణప్రాంతంలోని వర్ణదురహంకారులైన సెనెటర్ల దగ్గర్నుంచి ఎఫ్.బి.ఐ. అధినేత ఎడ్గర్‌హువర్ దగ్గర్నుంచి ఉత్తర ప్రాంతంలోని ఉదారవాదులదాకా అందరూ ఏకమయ్యారు. ఉదారవాదుల నీగ్రోపేటల తాలూకు సామాజిక వ్రణాలపట్ల తమ సందేహాలను ఒక వైపు వుంచుకుంటూనే నిర్దాక్షిణ్యంగా అణిచివేయండి అనే ఆనాటి నినాదానికి అత్రంగా కట్టుబడ్డారు. పత్రికలు సమగ్ర, సంక్లిష్ట చిత్రంలోని ఒకే ఒక అంశాన్ని బయటకులాగి దాన్ని భూతద్దంలో చూపాయి. ఆ అంశం - ఆస్తులపై దాడులు, గృహదహనాలు, దోపిడీలు, సైన్యమూ, పోలీసులు తీసుకున్న అన్ని చర్యలకూ "శాంతి భద్రతల" ముసుగుకప్పారు.

టెలివిజన్ తెరలపై మంటలని, పొగలని చూసి భయకంపితులయిన రాజకీయవాదులు, రాజకీయాలతో సంబంధం లేనివారు వర్ణదురహంకారులవైపు మొగ్గుచూపారు.

వైట్‌హౌస్ శాంతిభద్రతల క్షీణంపై జాతీయ సలహాకమిషన్ ఏర్పాటు చేసింది. ఇలినాయిస్ గవర్నర్ ఓటోకెర్నర్‌ను కమిషన్ అధ్యక్షులుగా నియమించారు. అసలు జరిగిందేమిటి? ఎందుకు జరిగింది ? భవిష్యత్తులో అలా జరక్కుండా తీసుకోవాల్సిన చర్యలేమిటి ? అన్న అంశాలపై సమగ్రవివరణ ఇవ్వాల్సిందిగా అమెరికా అధ్యక్షుడు కమిషన్ అధ్యక్షుని కోరాడు.

అధ్యక్షుడు జాన్సన్ పదకొండుమందిని కమిషన్ సభ్యులుగా నియమించాడు. అందులో రాయ్‌విల్కిన్స్, ఎడ్వర్డ్‌బ్రూక్ అనే ఇరువురు నల్లవారు కూడా వున్నారు. ఎడ్వర్డ్‌బ్రూక్ సెనెటర్‌కూడా. ఆ తరువాత పత్రికలు వివరించి

నట్లుగా కమిషన్ రంగుప్రాతిపదికపై చీలిపోలేదు కాని ఉదారవాదులుగానూ, పిడివాదులుగానూ చీలిపోయింది. ఆరుగురు ఉదారవాదులు, ఐదుగురు పిడివాదులు.

ఉదారవాదుల సంఖ్య ఎక్కువగా వున్నందువల్లనూ వాస్తవాలు వారికి అనుకూలంగా వున్నందువల్లనూ వారు పిడివాదులై విజయం సాధించారు. ఏడు మాసాలపాటు దర్యాప్తు జరిపిన అనంతరం కమిషన్ తన సుదీర్ఘ నివేదికను అధ్యక్షునికి పత్రికలకు అందచేసింది. ఆ నివేదిక రాజకీయబాంబులాగా పని చేసింది; అసాధారణ పరిస్థితులలో బూర్జువా అమెరికా తీవ్రమైన ఆత్మవిమర్శ చేసుకోగలదన్న విషయాన్ని ఆ నివేదిక నిరూపించింది.

1967 వేసవి దినాలలో తమ తీవ్రమైన నిరసనను వ్యక్తంచేసిన వేలాది మంది నల్ల జనాలకు కెర్నర్ కమిషన్ నివేదిక "పునరావాసం" కల్పించింది; వారు నిరసన తెలపడానికి తగిన కారణాలున్నాయని నిరూపించింది. వర్ణ వాదానికి తావిచ్చిన అమెరికన్ సామాజిక వ్యవస్థను ఆ నివేదిక తీవ్రంగా ఖండించింది; దానిపై నేరారోపణ చేసింది.

నివేదికలో ఇలా వుంది: "మా మౌలిక నిర్ధారణ ఇదీ. మనజాతి రెండు సమాజాల దిశగా పయనిస్తున్నది; ఒకటి నల్ల సమాజం, మరొకటి తెల్ల సమాజం, అవి రెండూ విడివిడిగా వున్నవీ సమానత్వం లేనివీ. గత వేసవిలోని గొడవలకు పుట్టిన ప్రతిస్పందన ఉద్యమాన్ని వేగవంతం చేసింది, చీలికను మరింత లోతుకు చొచ్చుకొని పోయింది. వివక్ష, సామాజిక బహిష్కారం ఇవి చాలా కాలంగా అమెరికన్ జీవితంలో సర్వత్రా వ్యాపించాయి. అవి ఇప్పుడు ప్రతి అమెరికన్ భవిష్యత్తుకు ముప్పు సూచిస్తున్నాయి."

నల్ల నాయకులు వేసవి దినాల గొడవలకు వివిధ రూపాల్లో ప్రతిస్పందించారు. మార్టిన్ లూథర్‌కింగ్, ఫిలిప్ రాండాల్ఫ్, రాయ్ విల్కిన్స్, విట్నీ యంగ్ విడుదలచేసిన సంయుక్త ప్రకటనలో "వీధుల్లో హింసాకాండ"కు వ్యతిరేకంగా వ్యవహరించాల్సిందిగా నల్ల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నల్లవారు దాడులకు భారీ మూల్యం చెల్లించారని వారు తమ ప్రకటనలో అన్నారు; నల్లవారు చంపబడ్డారు, క్షతగాత్రులయ్యారు, జైళ్ళకెళ్ళారు, ప్రక్కనున్న దుకాణాలు దగ్ధమయ్యాయి కాబట్టి లేదా దోచుకోబడ్డాయి కాబట్టి నల్లవారు పస్తులుపడ్డారు; సరఫరాలు స్తంభించిపోయాయి కాబట్టి తమపిల్లలు పాలులేక తల్లడిల్లుతుంటే కళ్ళారా చూస్తూ నిల్చుండిపోయారు; రవాణా ఆగిపోవడంచేత లేదా పని స్థలాలు ధ్వంసమైనందువల్ల నల్లవారికి చెల్లింపులు ఆగిపోయాయి. నల్లవారు నిరుద్యోగాన్ని, గృహవసతి లోపాన్ని, స్కూళ్ళ లోపాన్ని, అవమానాలను, తిరస్కారాలను, దాడులను సహించరాదని ఆ నలుగురు నల్ల నాయకులు తమ సంయుక్త ప్రకటనలో విజ్ఞప్తి చేస్తూనే మొత్తానికి దాడులను ఖండించారు.

కాగా తీవ్రవాదులు విభిన్న పంథా చేపట్టారు. "హింసాకాండను" ఖండించినందుకు వర్ణసమానతా కాంగ్రెస్ అధ్యక్షుడయిన ఫ్లాయిడ్ మెక్‌కిసిక్ ఆ నలుగురు నాయకులను అనగా కింగ్, రాండాల్ఫ్, విల్కిన్స్, యంగ్ లను నిందించాడు.

మెక్‌కిసిక్ ఇలా ప్రకటించాడు "ఈ వేసవి తాలూకు ప్రజ్వలనాత్మక ఘటనలను నల్ల విప్లవానికి ప్రారంభంగా చరిత్ర నమోదుచేస్తుంది. 'దాడులు' అనే పదంలో గల నేరపూర్వక అర్థం తొలగిపోతుంది. దమనకాండకు దోపిడీకి వ్యతిరేకంగా తలెత్తిన తిరుగుబాట్లుగా గుర్తించటం జరుగుతుంది".

అమెరికా నాశనమై పోవాలని ఒకానొక నల్లసంస్థ నాయకుడైన స్టోక్లీ కెర్మిచేల్ అన్నాడు. ఘటనలు జరుగుతున్న సమయంలో ఆయన క్యూబాలో వున్నాడు. అమెరికా నాశనమయ్యేరోజు చూసేదాకా బతకడమే తన స్వప్నం అని ఆయన అన్నాడు.

నల్ల నాయకులు దాదాపు ఏకగ్రీవంగా కెర్నర్ కమీషన్ నివేదికను ఆమోదించారు. కానీ మార్టిన్ లూథర్‌కింగ్‌మాత్రం ఒక చిన్న సందేహం లేవనెత్తాడు. నల్లవారికి 20 లక్షల ఉద్యోగాలను సృష్టించాలని కమిషన్ చేసిన సిఫార్సును ప్రస్తావిస్తూ లోగడ కూడా ఇలాటి సిఫార్సులు సవివరంగా చేయబడ్డాయని అయితే అవి పూర్తిగా విస్మరింపబడ్డాయని ఆయన తన సందేహాన్ని వ్యక్తం చేశారు.

## నీగ్రో పేటల్లో, వియత్నాం అడవుల్లో

నీగ్రోదాడులు పెరుగుతూనే వచ్చాయి, అవి అవసరంకూడాను లక్షలాది మంది నల్ల అమెరికన్లు చైతన్యయుతంగా కాని సద్యోజనితంగా కాని సాగిస్తున్న చారిత్రక పోరాటానికి తాను బయటవున్న వ్యక్తిగా కింగ్ భావించలేదు.

కింగ్ ఎంత గొప్పవాడైనా జీవితంకంటే గొప్పవాడు కాదుగదా. తాను చేపట్టిన ఉద్యమంకంటేకూడా ఆయన గొప్పవాడు కాదు. 1955, 56 లలో మాంట్ గోమెరీలో 1963లో బర్మింగ్‌హామ్‌లోనూ, 1965 లో సెల్మాలోనూ మార్టిన్ లూథర్‌కింగ్ కొన్నిసార్లు ఘటనలకు మార్గదర్శకత్వం వహించాడు లేదా కనీసం వాటిమధ్య నిలిచాడు. అయితే కొన్నిసార్లు ఘటనలు ఆయన్ను నిస్సహాయునిగా శక్తిహీనునిగా వెనక్కునెట్టాయి; ఇందుకు ఉదాహరణ 1967 వేసవినాటి దాడులఘటనలు.

ఈ ఘటనల మూలంగా నేను ఆయనను సరైన చారిత్రక నేపథ్యంలో చూడగలిగాను ఆ ఘటనల మూలంగా నేను ఆయనను పలువురు నాయకులలో

ఒకడిగా చూశాడు. అదే సమయంలో ఆయన పరిష్కరించడానికి ప్రయత్నించిన బృహత్తర సమస్యలనూ చూడగలిగాను.

మార్టిన్ లూథర్ కింగ్ తన వ్యక్తిగత జీవితంలో నిరాడంబరుడు వినమ్ర శీలి. అయితే ఆయన పౌరరంగంలో తన ప్రాముఖ్యతను ఎన్నడూ తక్కువ అంచనా వేయలేదు. పైపెచ్చు తన ప్రజాజీవిత ప్రాముఖ్యం గురించి తన లక్ష్యం గురించీ ఆయనకు స్పష్టంగా తెలుసు. కింగ్ యిలా నిర్మొహమాటంగా ప్రకటించాడు: "చరిత్ర నన్ను ఈ స్థానానికి తోసింది. ఈ పోరాటంలో నేను చేయగలిగింది చేయడానికి నా నైతిక బాధ్యతను స్వీకరించకపోతే అది నైతిక బాహ్యమైన అంశమేకాక, కృతఘ్నతా సంకేతంకూడా కాగలదు." ఏదిఏమైనా ఉమ్మడి లక్ష్యంపట్ల ఆయన సంబంధం ఉపాధ్యాయుని పట్ల విద్యార్థి సంబంధం లాటిది; సంఘటనలతో పాటు ఆ సంబంధం మరింత పరిణతి చెందుతుంది; నిత్యం సంక్లిష్టమవుతున్న లక్ష్యాలతో ఆ సంబంధం మమేకం అవుతుంది.

మనమిప్పుడు మార్టిన్ లూథర్ కింగ్‌ను వదలి వచ్చినచోటికి మళ్ళీవెళ్దాం. అంటే కాపిటల్ హిల్‌లోని అధ్యక్షుని గదికి వెళ్దాం. ఆగదిలో అధ్యక్షుడు లింకన్ వాడిన టేబుల్‌ను ఎంతో ప్రేమగా ఇప్పటికీ భద్రపరిచారు. 1965 ఆగష్టు 6 వ తేదీన అధ్యక్షుడు జాన్సన్ అనేక పెన్నులతో ఓటింగ్ హక్కుల చట్టంపై సంతకం చేశాడు. సరిగ్గా 104 యేళ్ళక్రితం ఆనాటి అధ్యక్షుడు లింకన్ కూడా అదే గదిలో ఒక శాసనంపై సంతకం చేశాడు. సైన్యంలోకి నల్ల బానిసలను బలవంతంగా చేర్చుకునే పద్ధతికి ఆ శాసనం స్వస్తి చెప్పింది ఆనాడు లింకన్ యిలా ప్రకటించారు "నేడు స్వేచ్ఛకు విజయం లభించిన రోజు. యుద్ధ రంగంలో లభించిన మహత్తర విజయంలాటిదే ఇదీను. భయంకరమైన, ప్రాచీన బంధాల తాలూకు ఆఖరు, ప్రధాన శృంఖలాలను బద్దలుకొట్టిన రోజిది."

అధ్యక్షుడు జాన్సన్ ఈ ఉత్సవానికి ఒక వారం ముందు దక్షిణ వియత్నాంలో అమెరికా సైనిక దళాల సంఖ్యను 75,000 నుంచి 125,000 కు పెంచుతూ ఉత్తర్వు జారీచేశాడు. అదే సంవత్సరం ఫిబ్రవరిలో వియత్నాం ప్రజాతంత్ర రిపబ్లిక్‌పై బాంబుల దాడి జరిపింది లగాయతూ ఇంతపెద్దసంఖ్యలో సైన్యాన్ని పెంచడం ఇదే మొదలు; వియత్నాం అడవుల్లో యుద్ధాన్ని విస్తరించడం ఇది రెండవసారి.

మార్టిన్ లూథర్ కింగ్‌కు మళ్ళీ అధ్యక్షుడు సంతకం చేసిన పెన్ను లభించింది. అయితే అధ్యక్షుని ప్రసంగ పటాటోపం చూసి అతడు ఏమాత్రం మురిసిపోలేదు. అంతకు ముందురోజు వైట్‌హౌస్‌కు వెళ్ళినపుడు ఆయన లిండన్ జాన్సన్‌తో ఒకమాట అన్నాడు. ఉత్తరప్రాంతంలో సామాజిక బహిష్కారం

పెరుగుతున్నదేతప్ప తరగడంలేదని ఆయన అన్నాడు. ఆయన చికాగో, క్లీవ్ లాండ్, ఫిలడెల్ఫియాలలో పర్యటించి అప్పుడే తిరిగివచ్చాడు. ఆ పర్యటన సందర్భంగా ఆయన ఓ దృఢమైన నమ్మకానికి వచ్చాడు. సామాజిక బహిష్కార సమస్యలు దక్షిణంలోకంటే ఉత్తరంలో తక్కువ తీవ్రంగా ఏమీలేవన్న విశ్వాసం ఆయనకు కుదిరింది. "స్వేచ్ఛా జన్మస్థానం" అయిన ఫిలడెల్ఫియాలో 1776 జులై 4 న స్వేచ్ఛాప్రకటన చేయబడిన ఫిలడెల్ఫియాలో మార్టిన్ లూథర్‌కింగ్ గిరార్డ్‌కాలేజ్ అనే ఓ బోర్డింగు స్కూలుముందు నిరసన ప్రదర్శన జరిపారు. పేద అనాథలకు ఉద్దేశింపబడిన ఆ బోర్డింగుస్కూల్లో గత 117 సంవత్సరాలుగా ఒక్క నల్లకుర్రాణ్ణి కూడా చేర్చుకోలేదు.

మార్టిన్ లూథర్‌కింగ్ జులై ఆఖరులో చికాగో తాలూకు పశ్చిమ ప్రాంతపు నల్ల జిల్లాల్లో ప్రప్రథమంగా తన బలాన్ని పరీక్షించుకున్నాడు. ఇక్కడ దక్షిణంలోలాగా పరిస్థితి లేదు. అంటే చర్చి నల్లవారిని ఐక్యంచేసే కేంద్రంగా లేదు. నల్లవారికి మతంతో బంధాలు లేవు. చర్చిలోకి ఇకమీదటనైనా అనుమతి లభిస్తుందన్న ఆశ లేదు. అందుచేత కింగ్ చర్చిలోని వేదికనుంచి కాక రోడ్ల కూడలిలో నిల్పోబెట్టిన ట్రక్కుల మీద నుంచి పూజా ప్రసంగం చేశాడు. ఆయన ప్రసంగం వినడానికి వేలాది మంది వచ్చారు. ఆయన పేరు అందరికీ తెలుసు. ఆయనంటే ఎంతో అభిమానం కూడా.

"మనమీ నగరాన్ని మారుద్దాం" కింగ్ హామీ ఇచ్చాడు. జులై 26 న 15 వేల మందితో ప్రదర్శన నిర్వహించాడు. నల్లవారు అంత పెద్ద ప్రదర్శనను చికాగో చరిత్రలో ఏనాడూ నిర్వహించలేదు.

అయితే దాదాపు 10 లక్షల మంది నల్లవారు నివసించే ఈ నగరంలో దాని ప్రత్యేక ఇబ్బందులు దానికున్నాయి. మిసిసిపి రాష్ట్రంలోకంటే ఈ నగరంలోనే నల్లవారు ఎక్కువ సంఖ్యలో నివసిస్తున్నారు. కొంతమంది స్థానిక నల్లనాయకులు కింగ్ దగ్గరకు వచ్చి తాము ఆయనకు సహాయపడలేని స్థితిలో వున్నామంటూ క్షమాపణలు చెప్పుకున్నారు. మరికొంత మంది క్షమాపణలు చెప్పుకోకపోవడం అటుంచి ఆయన దగ్గరకు రాకుండానే వింత ప్రకటనలు చేయసాగారు. తమకు తమ సొంత 'కార్యాచరణ' సంఘం వున్నదని అట్లాంటా మత గురువుకు చికాగోలో పని ఏమీ లేదని ఆయనకు 'వాస్తవిక' దృక్పథం లోపించిందని, చికాగోలోని నల్లవారు తమ వ్యవహారాలు చూసుకోగలరని వారు ప్రకటనలు చేశారు. చికాగో మేయర్ రిచర్డ్ డాలీ మహా ఘటికుడు, లంచగొండీనూ. ఆయన ఇలా ప్రకటనలు చేసే వారిని మరింత ముందుకు తోసి




నల్లవారి గృహవసతిని మెరుగుపరచడం, చికాగోలో మురికిపేటల అపార్ట్ మెంట్లపై వసూలు చేసే విపరీతమైన ధరలనుఎండ గట్టడమూ —ఇదే కింగ్ ప్రధమ లక్ష్యం.



గుంపులోని వేలాది మందిని వుద్దేశించి మార్టిన్ లూథర్ కింగ్ ఇలా అన్నాడు: "సోదరులారా నడుంకట్టండి, స్వేచ్ఛకోసం పురోగమిద్దాం!"

క్షమాపణలు చెప్పుకున్న నల్లవారిని మరింత వెనక్కు తోసాడు. ఆయన చికాగో మేయర్ పదవికి మూడుసార్లు ఎన్నికయ్యాడు. నగరంలోని డెమొక్రటిక్ పార్టీకి తిరుగులేని నాయకుడు. ఆయన సామ, దాన, భేద, దండోపాయాలు ప్రయోగించడం ద్వారా స్థానిక నల్ల జనాభాలో తనకు విశ్వాసపాత్రులుగా వుండేవారిని సృష్టించుకున్నాడు. ఆయన పలుకుబడికి, ఓట్లకు వారు హామీ కల్పించారు. చికాగో మేయర్ మహా లౌక్యుడు. ఆయన నల్లవారిపట్ల మాటల్లో సానుభూతి వ్యక్తం చేశాడు. విజ్ఞప్తి పత్రాలు స్వీకరించాడు. వారి ఫిర్యాదుల్ని సానుకూలంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చాడు. ఉత్తర ప్రాంతానికి చెందిన ఈ తరహా రాజకీయవాది- బ్యూరాక్రట్ స్వభావాన్ని కింగ్ ఈ కింది విధంగా వర్ణించాడు. "వారిలో చాలా మంది వేదికల మీద కూర్చున్నారు, దక్షిణ ప్రాంత నీగ్రోల వీరత్వాన్ని తెగపొగిడారు కాని స్థానిక పరిస్థితులకు సంబంధించిన సమస్యలు పైకి వచ్చినప్పుడు మాత్రం భాష మాత్రమే మర్యాదపూర్వకంగా వుండింది. ఆచరణలో దృఢంగా, నిర్ద్వంద్వంగా తిరస్కరించారు.

కింగ్ జులైలో ఇలా అసలు వాస్తవాన్ని గ్రహించాక తాను లోగడ ఏర్పాటుచేసిన "సదరన్ క్రిష్టియన్ లీడర్‌షిప్ కాన్ఫరెన్స్" కార్యకలాపాలను ఉత్తర ప్రాంతంలోని నీగ్రోపేటలకు కూడా విస్తరింపజేయాలని నిర్ణయం తీసుకున్నారు. 1965 ఆగష్టులో వాట్స్‌లో జరిగిన తిరుగుబాటు కింగ్ నిర్ణయాన్ని మరింత బలోపేతంచేసింది. ఘటనలు మరింత వేగంగా సాగుతూవుండినాయి.

చికాగోను పరీక్షా కేంద్రంగా యెంచుకున్నారు.

1965 ఆకురాలు కాలంలో కింగ్‌గారి అనుచరులు జేమ్స్ బెవెల్ నాయకత్వాన తమ కార్యకలాపాలను విస్తరింప చేయడానికి సన్నాహాలు ప్రారంభించారు. వీరంతా చికాగోలోని లాండేల్ అనే మురికిపేటలో నివసిస్తున్న వారు. ఆ మురికిపేటలో లక్షా నలభై వేల మంది నివసిస్తున్నారు. వారంతా దుర్భర దారిద్ర్యంతో అల్లాడుతున్నవారే. 1965 అక్టోబరులో కింగ్ సతీసమేతంగా అక్కడికి వెళ్ళి హామ్లిన్ వీధిలో ఎలాటి సౌకర్యాలు లేని ఒక అపార్ట్‌మెంట్ వాటాలో నివసించసాగారు. వారు మూడవ అంతస్థులో వుండేవారు. గదిలో నుంచి బయటకి వచ్చి ఎప్పుడు పడిపోతుందో అనిపించే బాల్కనీలో నుంచుంటే 16 వ వీధి మూల కనిపించేది. ఆ మూల మాదకద్రవ్యాలు సేకరించే వారికి ఖూందిపోట్లకు, కన్నం దొంగలకు కేంద్రంగా వుండేది.

1966 సంవత్సరమంతటానూ, 1967 ప్రారంభంలోనూ చికాగో ప్రచారోద్యమం నిర్విరామంగా కాకపోయినా మొత్తానికి సజావుగానే కొనసాగింది.

1966 జులై పదిన సిటీహాల్ ముందు 45,000 మందితో ప్రజాప్రదర్శన జరిగిన సందర్భంగా నగర అధికార్లను ఉద్దేశించి కింగ్ అనేక డిమాండ్లు ప్రకటించాడు. ఆ డిమాండ్లు ఇవి: సంపూర్ణ హీనం, ప్రభుత్వస్కూళ్ళ బడ్జెట్‌ను రెండు రెట్లు పెంచడం, నీగ్రోపేటల్లో ప్రభుత్వ రవాణా సౌకర్యాలు పెంచడం, చికాగోలోని వివిధ జిల్లాల జనాభా నిష్పత్తికి అనుగుణంగా మునిసిపల్ ప్రయోజనాలను పంపిణీ చేయడం, నగర శివార్లలో తక్కువ అద్దెలకిచ్చే 10 వేల అపార్టుమెంట్లను కొత్తగా నిర్మించడం, ఇలా నిర్మించడం ద్వారా మురికిపేటల నుంచి జనాలను ఖాళీచేయించడం.

ఆగష్టులో పరిస్థితి బాగా తీవ్రం కావడంతో నగర అధికార్లు, వ్యాపార వర్గాలు, నల్లవారు రాజీ కుదుర్చుకుని తొమ్మిది అంశాల కార్యక్రమముపై సంతకాలు చేశారు. గృహాల విషయంలో వివక్షను నిర్మూలించాలని కోరుతూ కింగ్ ఓ అతి ముఖ్యమైన కార్యక్రమం ప్రకటించాడు. అయితే ఆయన ఆశావహ భావంతో పలువురు ఏకీభవించలేదు. మొత్తానికి చికాగో ప్రచారోద్యమం విజయవంతం కాలేదు. కింగ్ సహచరులు ఏర్పాటుచేసిన మురికిపేటల నిర్మూలన యూనియన్ కార్యకలాపాలను మురికిపేటల వాసులు ప్రతిఘటించారు. "మురికిపేటల ప్రభువులు", మురికిపేటల ఆస్తుల యజమానులు అదృశ్యమైపోలేదు, నాశనమూ కాలేదు. మేయర్‌డాలీ నగర రాజకీయ రంగంలో తిరుగులేని నేతగా నిలబడి మళ్ళీ ఎన్నికల్లో గెల్చాడు. డాలీకి వ్యతిరేకంగా నల్ల ఓటర్లను సమీకరించడానికి చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి.

కింగ్ మామూలుగా వారానికి మూడురోజులపాటు చికాగోలో గడిపాడు. ఆయన ఎబెనెజర్ చర్చిలోని తన మతగురువులను విస్మరించడం జరగలేదు. ఎప్పట్లాగా విస్తృతంగా పర్యటించాడు. కొత్త సమస్యలు ఆయన ప్రసంగాల సారాన్ని మార్చాయి; ఆయన దక్షిణప్రాంతంలోని పౌరహక్కుల గురించికంటే ఉత్తరప్రాంతంలో నల్లవారు గురవుతున్న దోపిడీవ్యవస్థ గురించే ఎక్కువ ప్రసంగించసాగారు. ఆయన వియత్నాం గురించి తరుచుగా ప్రసంగించసాగారు. ఆనాడు వియత్నాంలో బిలియన్ల డాలర్లు తగలేస్తున్నారు.

ఆయన నిరాశావాదమంటే ఏమిటో ఎరుగడు కానీ లోలోపల కాస్త కలవరపడ్డాడు. ఒకవైపున పెద్దనగరాలు సంక్లిష్టమైన రాజకీయ ఆర్థిక ఎత్తుగడలు కొనసాగుతుండగా ఆయన దక్షిణప్రాంత చర్చిల సమావేశాల్లో ఇలా పిలుపు ఇచ్చాడు: "సోదరులారా కదలండి, స్వేచ్ఛకోసం ముందుకు పురోగమిద్దాం." అయితే ఆయన అవలంబించిన ఈ ఎత్తుగడలు ఫలప్రదంకాలేదు. అయితే ఆయన చికాగో ప్రచారోద్యమానికి స్వస్తిచెప్పి ముందుకు కదలేందుకు

మిసిసిపికి వెళ్ళి తోటి పాతకార్యకర్తలతో కలసి అక్కడి మండుతున్న ఎండల్లో ప్రదర్శనలు చేసేసరికి ఆయన ఓ విషయం గ్రహించాడు. తమ మార్గాల మధ్య అంతరాన్ని, ఒకరి నుంచి మరొకరు ఎంత దూరం వెళ్ళారన్న విషయాన్ని ఆయన గ్రహించాడు. ఆయన జరిపిన ఆ పర్యటనకు ఏకైక కారణం జేమ్స్ మెరిడిత్‌పై హత్యాయత్నం జరిగివుండడమే. జేమ్స్ మెరిడిత్ ఒకప్పుడు న్యూయార్క్‌లోని కొలంబియా విశ్వవిద్యాలయంలో చదివాడు. ఆ తరువాత నైజీరియాలో కూడా చదివాడు. తర్వాత తన సొంతప్రాంతం మిసిసిపికి వెళ్ళి 1964, 1965 పౌరహక్కుల చట్టాలు అమల్లోకి వచ్చాక జరిగిన పురోగతి ఏమిటో తెలుసుకోవాలనుకున్నాడు.

ఆయన సొంత కార్యాచరణే మేలనుకుని అన్ని రకాల సంఘాలను, సంస్థలను దూరంగా వుంచాడు. మిసిసిపిలో హైవే-51 వెంట 350 కిలోమీటర్ల దూరం ఒంటరిగా నడవాలనుకున్నాడు. అంటే ఉత్తరం నుంచి దక్షిణదిశగా రాష్ట్రరాజధాని జాక్సన్‌దాకా ఒంటరి పయనం మొదలెట్టాడు. అయితే దారి మధ్యలో జేమ్స్ ఆబ్రీ నార్వెల్ అనే ఓ నిరుద్యోగి ఆయన పై కాల్పులు జరిపాడు.

ఈ దాడి వార్త తెల్సీతెలియగానే కింగ్ గాయపడిన ఆ వ్యక్తిని పరామర్శించేందుకు హుటాహుటిన విమానంలో మెంఫిస్ వెళ్ళాడు. ఐదు నల్లవారి సంస్థల నాయకులైన స్టోక్లీ కర్మికేల్, ఫ్లాయిడ్ మెక్‌కిసిక్, రాయ్‌విల్కిన్స్, విట్నీయంగ్‌లు కూడా విమానాల్లో మెంఫిస్ వెళ్ళారు. నార్వెల్ అనే ఆ నిరుద్యోగి పిట్టల్నికొట్టే తుపాకీతో జేమ్స్‌మెరిడిత్‌ను అలా ఆపగలిగాడంటె ఆ ఐదుగురు నాయకులకు నమ్మబుద్ధి కాలేదు. జాక్సన్ నగరం దాకా ప్రజాప్రదర్శన జరపాలన్న భావం కలిగింది.

ఐదుగురు నల్లనాయకులు తమ ఐక్యతను ప్రదర్శించడానికి మెంఫిస్ వెళ్ళారు కాని అతి త్వరలోనే లోతైన చీలిక కనిపించింది. ఆ ఐదుగురు నాయకులు ప్రదర్శన లక్ష్యాన్ని నిర్వచిస్తూ కార్యక్రమం రచించడం ప్రారంభించగానే విభేదాలు పొడసూపాయి. (ప్రదర్శనకు అంగీకరించాక మెరిడిత్‌ను న్యూయార్క్ ఆసుపత్రికి తీసుకెళ్ళారు. మెంఫిస్ ఆస్పత్రి నుంచి స్పృహ కోల్పోయిన స్థితిలోనే ఆయన్ను న్యూయార్క్ ఆస్పత్రికి తరలించారు.)

జరగబోయే ప్రదర్శన దక్షిణ ప్రాంతపు వర్ణ దురహంకారులకే కాక ఫెడరల్ ప్రభుత్వానికి కూడా ఒక సవాలుగా వుండగలదని, వారిపై ఒక నేరారోపణగా వుండగలదని కర్మికేల్ భావించాడు. ఆయన ఇలా ఆగ్రహంగా అరిచాడు: "మనకు చెబుతూ వస్తున్న అబద్ధాల గురించి ఫెడరల్ ప్రభుత్వానికి చెప్పక తప్పదు."

రాయ్‌విల్కిన్స్ మాత్రం అధ్యక్షుని సమర్థించాడు. కాగా కింగ్ ఉభయ పక్షాలను సమైక్యపరిచే రాజీ కోసం ప్రయత్నించాడు.

ప్రదర్శనకు సంబంధించిన కార్యక్రమాన్ని విడుదల చేశారు. రాయ్ విల్కిన్స్ దానిపై సంతకం చేయకపోవడమే కాక ప్రదర్శనలో పాల్గొనడానికి సైతం నిరాకరించాడు. జాక్సన్ దాకా సాగే ఈ ప్రదర్శన "అమెరికన్ సమాజానికి, అమెరికా ప్రభుత్వానికి మిసిసిపి రాష్ట్రానికి వ్యతిరేకంగా నిరసనగా వుండడమే కాక వాటిపై ప్రజలు మోపిన నేరారోపణగా కూడా వుండగలదని" ప్రదర్శన కార్యక్రమం స్పష్టంచేసింది. 1964, 1965 చట్టాల్లోని పౌర హక్కులను కల్పించడంలో అమెరికన్ సమాజమూ, అమెరికా సంయుక్తరాష్ట్రాల ప్రభుత్వమూ మిసిసిపి రాష్ట్ర ప్రభుత్వమూ అన్నీ విఫలమయ్యాయి. నల్ల ఓటర్లను నమోదుచేసే కార్యక్రమాన్ని త్వరీకరించడానికి, నల్ల పేదలకు కోట్లాది డాలర్ల సహాయంగా అందచేసే "స్వేచ్ఛా బడ్జెట్" భావాన్ని ఆమోదించడానికి దక్షిణ ప్రాంతంలోని 600 మండలాలకు ఫెడరల్ రెఫరీలను పంపాల్సిందిగా ప్రదర్శన కార్యక్రమం అధ్యక్షునికి విజ్ఞప్తి చేసింది.

జాక్సన్ ప్రదర్శన మూడు వారాలపాటు సాగింది. ప్రదర్శనలో కొద్ది మంది తెల్లవాళ్ళు కూడా పాల్గొన్నారు. నల్ల యువకుల ప్రతీకారవాంఛ, అసహనమూ అంతకంతకూ పెరగసాగాయి. ప్రదర్శన సాగినన్నాళ్ళూ ముఖ్యంగా సాయంత్రాల్లో ప్రదర్శన విశ్రాంతి కోసం ఆగినపుడు కింగ్ చర్చలు జరిపేవాడు. ఒక్కోసారి కెర్మికేల్‌తోనూ, మెక్‌కిసిక్‌తోనూ తీవ్రమైన వాదోపవాదాలకు దిగేవాడు. 24 యేండ్ల వయస్సు గల ఉద్రేక పూరితుడైన కెర్మికేల్‌తో పోలిస్తే 37 యేండ్ల కింగ్‌కు తల్లిదండ్రుల కుండే ఓర్పు, ప్రశాంతత వుండేవి. మెరిడిత్ లాగే కెర్మికేల్ కూడా ఎప్పుడూ తుపాకుల గురించే ఆలోచించేవాడు; తెల్ల అమెరికా ఆత్మను సంస్కరించే ఆశా భావాన్ని ఆయన కోల్పోయాడు. ఐదేళ్ళ పోరాట కాలంలో ఆయన 27 సార్లు అరెస్టయ్యాడు. ఆయన అహింసా పద్ధతులను నిరాకరించి ప్రతీకారం కోసం పగబట్టాడు. నల్ల యువకుల్లోని తీవ్రవాదుల భావాలను ఆయన బిగ్గరగా వ్యక్తీకరించాడు.

ప్రదర్శకులు గ్రీన్‌వుడ్ పట్టణం గుండా వెళ్తున్నప్పుడు ఆయన ప్రప్రథమంగా "నల్లవారికి అధికారం" అనే నినాదాన్ని ప్రతిపాదించాడు. ఆయన రెండేళ్ళ క్రితం ఇదే పట్టణంలో వర్ణదురహంకారుల చేతుల్లో అవమానాల పాలయ్యాడు; ప్రాణాలకు తెగించి "స్వేచ్ఛాపాతకాల" ఉద్యమానికి నాయకత్వం వహించాడు.





సమ్మెచేస్తున్న గ్యార్బేజ్ కార్మికులను జాతీయ భద్రతా దళాలు చేతుల్లో రైఫిళ్లతో దారిపొడుగునా చుట్టుముట్టేవున్నారు. సమ్మెదార్ల మెడలో వేలాడుతున్న ప్లేకార్డులపై “నేను మనిషిని” అన్న అక్షరాలు వున్నాయి. (మెంఫిస్ నగరంలో)



కింగ్ నిర్వహించిన ప్రచారోద్యమాలు అధ్యక్షుడు కెన్నెడీ, జాన్సన్‌ల విధానాన్ని ప్రభావితం చేశాయి. 1964లో పౌర హక్కుల చట్టం ఆమోదించబడింది. 1968 ఏప్రిల్ 11న పౌర హక్కుల చట్టంపై సంతకాలు చేశారు.





ప్రదర్శనలో పాల్గొన్నవారిని నిముషంలో ఈ బోనులోకి ఎక్కిస్తారు. వీరి కోసమే యీ బోను తయారు చేశారు.




లక్షలాది మంది ప్రజలు ఆయన్ను అనుసరించారు, విశ్వసించారు నైతిక శక్తి మాత్రమే ఇవ్వగల అధికారం ఆయనకు హస్తగతమై వుండింది. ప్రజలను ఆకర్షించే అయస్కాంతం ఆయన.



ఆమెరికా చరిత్రలో గత 350 ఏళ్లుగా ఏ ఇతర నల్ల వ్యక్తికీ జరగని రీతిలో ఈయనకు అంత్యక్రియలు జరిగాయి. ఆయన భౌతిక కాయానికి జరిగిన అంతిమ యాత్రలో లక్షా యాభై వేల మందికి పైగా ప్రజలు పాల్గొన్నారు. అట్లాంటా వీధులనుంచి మోర్‌హౌస్ కాలేజీదాకా నాలుగు మైళ్ల పొడవునా జన యాత్ర సాగింది.





తనకు ప్రీతి పాత్రులైన తనను ప్రేమించిన, తనంటే శ్రద్ధవ్యక్తం చేసిన, తనను చూసి గర్వించే ప్రజల మధ్య ఆయన వున్నాడు. సరిగ్గా ఆ క్షణంలో ఓ బుల్లెట్ వచ్చి ఆయన్ను నేల కూల్చింది. తొమ్మిది గ్రాముల బరువుగల ఆ మారణాంతక శక్తి కింగ్ జీవితానికి చరమగీతం పాడింది.

పట్టణం పార్కులో జరిగిన సభలో కెర్మికేల్ ఇలా ప్రసంగించాడు : "మేము నల్లవారు ప్రయత్నాం వెళ్ళకుండా ఇక్కడే గ్రీన్‌వుడ్ లోనే వుండి పోరాడాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం. వాళ్ళు మనలో ఒకరిని గనక జైల్లోపడేస్తే అతన్ని విడుదల చేయడానికి బెయిలు కోసం అభ్యర్థించం. మనమంతా జైలుకు వెళ్ళి అతన్ని విడుదల చేయాలి." ఆయన ప్రసంగానికి హర్షధ్వానాలు లభించాయి.

అప్పుడు ఆయన అనుచరుల్లో ఒక వ్యక్తి వేదిక మీదికెక్కి నల్లజనాలను ఉద్దేశించి "మనం కోరుతున్న దేమిటి?" అని గట్టిగా అరిచాడు? "నల్లవారి అధికారం!" అంటూ జనం ముక్త కంఠంతో సమాధాన మిచ్చారు. కెర్మికేల్ అనుచరులు "మనకేం కావాలి?" "నల్లఅధికారం!" అన్న నినాదాన్ని విస్తృతంగా వ్యాపింపచేశారు. ఆరోజు సాయంత్రం కలవరపడ్డ కింగ్ ఐదుగంటల పాటు కూచుని కెర్మికేల్, మెక్‌కిసిక్‌లచేత ఆ నినాదానికి స్వస్తి చెప్పించడానికి ప్రయత్నించాడు. ఆ నినాదం తెల్ల అమెరికన్లను రెచ్చ గొడ్తుందని, అందువల్ల తమ ఉద్యమానికి హాని కలుగుతుందని కింగ్ భయపడ్డాడు. కాని కెర్మికేల్, మెక్‌కిసిక్‌లు మాత్రం మొండిగా రాజీ ప్రతిపాదనలను తిరస్కరించారు. ప్రదర్శన సందర్భంగా ఆ నూతన నినాదాన్ని ఉద్దేశ పూర్వకంగానే ప్రతిపాదించానని కెర్మికేల్ స్పష్టం చేశాడు. ఆ నినాదాన్ని వెంటనే వినిపింపచేయాలని ఆయన అనుకున్నాడు.

యువకులు తన అహింసా విజ్ఞప్తికంటే కెర్మికేల్ నినాదానికే ఎక్కువ ఉత్సాహంతో ప్రతిస్పందిస్తున్నట్లు కింగ్ గ్రహించాడు. జాక్సన్ ప్రదర్శన ముగిశాక వాగ్యుద్ధం ప్రారంభమైంది. నల్లనాయకులు బహిరంగంగానే ఒకరి నొకరు నిందించుకోసాగారు. "నల్లవారి అధికారం" అంటే నల్లవారి వర్ణదురహంకారమే కాగలదని అది "నల్లవారి మృత్యువుకు" దారితీయిస్తుందని రాయ్ విల్కిన్స్ అన్నాడు. ఉపాధ్యక్షుడు హంఫ్రీ ఆయన వాదాన్ని బలపరిచాడు. కాగా మెక్‌కిసిక్ మాత్రం విల్కిన్స్‌ను ఖండించాడు. విల్కిన్స్‌కు నల్లవారి మనోభావమేమిటో తెలీదన్నాడు.

కింగ్ ఐక్యతను సాధించే విఫలయత్నంలో ఉభయపక్షాలనూ విమర్శించాడు. సరిగా వివరణ ఇవ్వకుండానే తొందరపాటుగా ఆ నినాదం ప్రతిపాదించినందుకు తీవ్రవాదులను ఆ నినాదానికి దారితీసిన కారణాలను అవగాహన చేసుకోవడంలో విఫలమైనందుకు మితవాదులను కింగ్ విమర్శించాడు.

"ది న్యూయార్క్ టైమ్స్" పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కింగ్ ఇలా అన్నాడు, "ఈనాడు గౌరవభావంతోనూ ఆత్మాభిమాన భావంతోనూ నీగ్రోకు

పూర్తి అవసరవుంది. నల్లవారికి అధికారం అనేది వారి ఆత్మాభిమానాన్ని పెంచే ప్రయత్నం అనుకుంటాను. అధికారం ఆవశ్యకత గురించి సందేహమే లేదు. అయితే "నల్లవారికి అధికారం" అనే పదం నల్లవారొక్కరే అధికారం సాధిస్తారని ఇతరులెవ్వరితో వారికి అవసరంలేదనే భావాన్ని కలిగిస్తున్నది. మొత్తం జనాభాలో పదిలేక పదకొండు శాతానికి మేము మించి లేమన్న విషయాన్ని నిరంతర గుర్తుంచుకోవాలి,"

కింగ్ నల్లజాతీయవాదాన్ని తిరస్కరించాడు. నల్లవర్ణదురహంకార వాదాన్ని మరింత గట్టిగా తిరస్కరించాడు. అటు క్రైస్తవ మతగురువుగానూ ఇటు రాజకీయ వాస్తవికవాదిగానూ ఆయన వాటిని తిరస్కరించాడు. ఆయన తన జీవితంలో ఎల్లప్పుడూ నల్లవారి, తెల్లవారి సౌభ్రాతృత్వం గురించే కలలు గన్నాడు. 1963 ఆగష్టు 28 న వాషింగ్టన్‌లో జరిగిన బ్రహ్మాండమైన ప్రజా ప్రదర్శన ముందు చేసిన ప్రసంగంలో ఆయన తన స్వప్నాన్ని స్పష్టంగా ప్రకటించాడు. ఆయన కార్యకలాపాలలో సౌభ్రాతృత్వ విజ్ఞప్తి ప్రధాన స్థానంలో వుండింది. వర్ణదురహంకారులు కొత్తనేరాలద్వారానో, కొత్తదాడులద్వారానో, నల్లవారిని గోడకు ఆనుకునే దాకా తరమడంద్వారానో, నల్లవారి సహనం నశించినప్పుడు వారిని ప్రశాంత పరచడానికి ఆయన ఉద్వేగభరితంగా సౌభ్రాతృత్వం కోసం విజ్ఞప్తి చేసేవాడు. ఆయన అహింసా వ్యూహానికి మూలాధారం సౌభ్రాతృత్వ అవకాశంపై విశ్వాసమే.

కింగ్ మతగురువేకాక నాయకుడుకూడానూ. మతగురువుగా ప్రేమ, సౌభ్రాతృత్వాలను ప్రబోధించడంలోగల ప్రయోజకత్వాన్ని విశ్వసించాడు; నాయకుడిగా ప్రజలపట్ల, రాజకీయ వాస్తవికత పట్ల తనకుగల బాధ్యత గురించి ఆయనకు కొన్ని సొంత అభిప్రాయాలుండేవి. నాయకుని దృష్టినుంచి చూస్తే, సౌభ్రాతృత్వ భావం అన్నది ఆచరణాత్మక ఆవశ్యకత; దాన్ని పరిస్థితుల్లో నిర్ణయిస్తాయి. కింగ్ ఇలా హెచ్చరించాడు : "నీగ్రోలను నిరంతరం పీడిస్తున్నందుకు మనదేశం చెల్లించాల్సిన మూల్యం స్వవినాశమే. మనం సోదరులుగా జీవించడం నేర్చుకోవాలి, లేకపోతే మనమంతా మూర్ఖులుగా నాశనమైపోతాము." తమ "శ్వేత సోదరులపై" నల్లవారు విశ్వాసాన్ని కోల్పోరాదని ఆయన బోధించాడు. ఈ విషయంలో ఆయన రెండు స్తంభాల మధ్య వంతెన పాత్రను స్వీకరించాడు. అయితే ఆ రెండు స్తంభాల మధ్య దూరం మరింత పెరిగింది; రెండువైపుల నుంచీ ప్రవహించే అవిశ్వాస, ద్వేష ప్రవాహాల రాపిడికి గట్టులు ఒరుసుకుపోయాయి.

అమెరికాను శాంతియుతంగా పునర్నిర్మించడంపై విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయిన నల్లయువకుల సంఖ్య పెరిగింది. కింగ్ ఇలాటి యువకులను చికాగోలోనూ, ఉత్తరప్రాంత నీగ్రో పేటల్లోనూ కలిశాడు 1967 డిట్రాయిట్‌లో ఆయనా, విల్కిన్స్, యంగ్, రాండాల్ఫ్‌లు హింసకు దూరంగా వుండాల్సిందిగా నల్లవారికి విజ్ఞప్తిచేశారు. అయితే మార్టిన్ లూథర్‌కింగ్ న్యూయార్క్ టైమ్స్ పత్రికకు రాసిన లేఖలో ఒక విషయం వివరించాడు; తాము నలుగురూ విడుదల చేసిన ప్రకటనలో తన అభిప్రాయాన్ని పూర్తిగా వ్యక్తీకరించలేక పోయానని తెలుపుతూ హింసను ప్రేరేపించినవారిని, అమెరికా వ్యవస్థనూ, పార్లమెంటునూ, అమెరికా ప్రభుత్వాన్ని విమర్శించాడు. కొంతమంది నల్లవారి చేతులకు రక్తం అయిన మాట నిజమేనని అందుకువారు సమాజంకోరిన విధంగా మూల్యం చెల్లించక తప్పదని ఆయన అందులో రాశాడు కాని ఆయన ఇలా హెచ్చరించాడు: "మరైతే ఎలుకల నిర్మూలనకు ఉద్దేశించిన బిల్లును అపహాస్యం చేసిన పార్లమెంటు చేతుల్లోని రక్తం మాటేమిటి? దారిద్ర్య నిర్మూలన పూర్తిగా అవసరమైన కార్యక్రమాలను ప్రభుత్వంతో కుమ్మక్కై సగానికి సగం కుదించడం కాదా అది? సంస్కరణలను దారుణంగా ప్రతిఘటించిన శ్వేత సమాజాన్నేమనాలి?"

ఆయన సమస్యకు పరిష్కారంకోసం ప్రయత్నించిన పద్ధతి ఇదీ: నల్ల జనాలకు దూరంగావున్న నల్ల బూర్జువా వర్గపు మితవాదానికి, నీగ్రోపేటల్లో గెరిల్లాయుద్ధం కోసం ఆందోళచేసే నల్లజాతీయవాదుల అతివాదానికి మధ్యనగల పరిష్కారమార్గాన్ని ఎంచుకోకుండా "సమరశీల అహింసా" సూత్రాన్ని ఆయన ఎంపిక చేసుకున్నాడు. ఈ సూత్రం ప్రజాశాసనోల్లంఘన ఉద్యమానికి తీవ్రమైన రూపం ఇచ్చింది. బ్రిటిష్ వలసవాదులకు వ్యతిరేకంగా మహాత్మాగాంధీ ఉపయోగించిన ఈ పద్ధతిగురించి కింగ్ 1967 ఆగష్టులో మాట్లాడసాగారు.

ఆయన ఇలా స్పష్టంచేశాడు. "పౌరశాసనోల్లంఘనం అన్నది క్రోధాన్ని నిర్మాణాత్మక, సృజనాత్మకశక్తిగా వినియోగించుకోగలదు." పౌర శాసనోల్లంఘనం ద్వారా అమెరికన్ మహానగరాలను స్తంభీభూతం చేసే సాహసోపేతమైన భావం ఈ విధంగా ఆవిర్భవించింది. దాడుల కంటె ఈ పద్ధతికి కనీసం రెండు ప్రయోజనాలున్నాయని ఆయన నమ్మాడు. మొదటిది - ఇది ఎక్కువ ఫలప్రదమైనది, ఎందుచేతనంటే ఇలాటి ప్రచారోద్యమాలు దీర్ఘకాలం పాటు కొనసాగగలగడమే కాక సమాజానికి నష్టం కూడా కలిగిస్తాయి; అంటే ఉద్దేశపూర్వకంగా విధ్వంసం కాకపోయినా మొత్తానికి నష్టం కలిగిస్తాయి. రెండవది- ప్రభుత్వం బలప్రయోగం ద్వారా ఇలాటి ప్రచారోద్యమాలను అణచివేయడం కష్టం.

వాషింగ్టన్‌లో నల్ల, తెల్ల "పేద ప్రజల" ప్రదర్శన నిర్వహించాలన్న భావం నుంచి పౌర శాసనోల్లంఘనం అనే భావం నిర్దిష్ట రూపం తీసుకుంది. మిసిసిపి, అలబామాకు చెందిన పాలికాపులు, కాలిఫోర్నియాకు చెందిన వ్యవసాయ క్షేత్ర కార్మికులు, అపాలచియన్స్‌కు చెందిన నిరుద్యోగ శ్వేత గని కార్మికులు ఇంకా అమెరికాకు చెందిన సమస్త తిరస్కృతులు, బహిష్కృతులతో జరప తల పెట్టిన ప్రదర్శన అది

ఫెడరల్ అధికార్లపై పేద ప్రజాసైన్యం ప్రత్యక్ష ఘర్షణకు దిగడం అది; కింగ్ యొక్క రాజకీయ అభివృద్ధికి పరాకాష్ట బిందువు అది. అది కంటక ప్రాయంగా తయారైన పంథా.

ఈ ప్రదర్శన గురించి వివరించడానికి ముందు, ఈ బాప్టిస్టు మతగురువు పరిణామాన్ని ప్రతిబింబించే మరో ప్రజా ఉద్యమం గురించి పరిశీలిద్దాం; ఇది వియత్నాం యుద్ధానికి వ్యతిరేకంగా సాగిన పోరాటం.

1965 ప్రారంభం నుంచి వియత్నాంలోని యుద్ధం మూలంగా అమెరికా రాజకీయ, నైతిక, ఆర్థిక వాతావరణం ఉడుకెక్కిపోయింది. కాలం గడిచేకొద్దీ ఈ వేడి వాతావరణం మరింత పెరిగింది. వియత్నాం యుద్ధం పెద్ద సంఖ్యలో నల్లవారికి ఒక పాఠం నేర్పింది. ఆ పాఠం ఇదీ - వియత్నాం అడవుల్లో పని చేసే అమెరికా సామ్రాజ్యవాదుల క్రూర యంత్రాంగమూ అమెరికాలోని నీగ్రో పేటల్లో పనిచేసే యంత్రాంగమూ రెండూ ఒకటే. తమపై సవతితల్లి ప్రేమ చూపే దేశాన్ని యుద్ధం వస్తే కాపాడ్డానికి ప్రయత్నించడం పనికిమాలినపని అని తాను ప్రశ్నించిన నల్లదాడిదార్లలో సగంమందికిపైగా భావిస్తున్నట్లు కెర్నర్ కమీషన్ కనుగొంది.

వియత్నాం యుద్ధం ఆర్థిక వనరులను మళ్ళించడమే కాక, అమెరికా సామాజిక శక్తినీ, శ్రద్ధనూ కూడ అది పక్కకు మళ్ళించింది. దేశంలోని ఒకానొక అత్యంత ముఖ్యమైన సమస్య అయిన నల్లవారి సమస్య మానసికంగా తక్కువ ముఖ్యమైనదిగా కనిపించింది. యుద్ధానికి వ్యతిరేకంగా నిరసన శక్తులు పెరిగిన మాట నిజమే అయినప్పటికీ సమాన హక్కుల ఉద్యమంలో తెల్ల అమెరికన్ల క్రియాశీలత తగ్గిపోయింది; ఉదాహరణకు 1963-64 లో కంటే తగ్గిపోయింది. కాగా మితవాద నల్ల నాయకులేమో నల్లవారిని యుద్ధ వ్యతిరేక నిరసన పరిధికి దూరంగా వుంచారు. రాయ్ విల్కిన్స్ తన ఎత్తుగడను సమర్థిస్తూ ఇలా అన్నాడు."మనకు అలబామాలో బోలెడు వియత్నాంలున్నాయి."

డాక్టర్ కింగ్ అవలంబించిన యుద్ధ వ్యతిరేక వైఖరికి మతగురువుగా ఆయన శాంతితత్వమూ, అహింసావాదమూ, అణుయుగంలో అంతర్జాతీయ

సంబంధాలలో చేసుకోవాల్సిన నిజమైన ఎంపిక హింస, అహింస మధ్యకాదని అహింస, జీవసరాహిత్యం మధ్యనే నిజమైన ఎంపిక వున్నదని నమ్మాడు.

కింగ్ 1967 ఏప్రిల్ 4 న న్యూయార్క్ సిటీలోని ఒక చర్చిలో కార్య క్రమాన్ని వివరించే ప్రసంగం చేశాడు. ఆ ప్రసంగానికి విస్తృతమైన ప్రతి స్పదంన లభించింది.

మత గురువుల యుద్ధ వ్యతిరేక సంస్థ హడ్సన్ నదితీరంపైగల ఈ ఆకాశహర్మ్యపు చర్చిలో ఆ సమావేశాన్ని ఏర్పాటు చేసింది.

కింగ్ మొదట కింది అంతస్తులో కనిపించారు. అక్కడే అతిథులకు సమా వేశాలకు అవసరమయిన గదులున్నాయి. నేను ఆయన్ను దగ్గర్నుంచి చూడ్డం అదే మొదలు. ఆయన నల్లనికోటు. ప్యాంటు వేసుకున్నారు. ఆయన మొహంలో గాంభీర్యం కనిపించింది. ఆయన లక్షలాది ప్రజలకు నాయకుడు. లక్షలాది మందికి అయనంటే విశ్వాసం వుండింది.

డాక్టర్ కింగ్‌కు విశిష్టమైన శక్తి వుండింది. అవినీతి అంటే ఏమిటో ఎరుగని వారికి, గొప్ప నైతిక స్థయిర్యం వున్నవారికి మాత్రమే అలాటి శక్తి వుంటుంది. ఆయన వేదిక మీద కన్పించగానే ప్రేక్షకుల మొహాలలో గొప్ప ఉత్సాహం కనిపించింది.

ఆయన ప్రసంగంలో ప్రతినలో కనిపించే గాంభీర్యం వుండింది; ఆయన ప్రసంగం అరమరికలు లేకుండా నిర్మొహమాటంగా వుండింది.

"మౌనం పాటించడం ద్రోహంగా పరిగణింపబడే సమయం ఒకోక్క సారి వస్తుంది. వియత్నాంకు సంబంధించి మనకు ఆ సమయం వచ్చింది...

"గత రెండేళ్ళుగా నా మౌనముద్రల ద్రోహం నుంచి బయటపడి హృదయావేదనతో ప్రసంగించడానికి ప్రయత్నించగా పలువురు నేను ఎన్నుకొన్న మార్గంలోని విజ్ఞత గురించి ప్రశ్నించారు. కింగ్ మీరు యుద్ధం గురించి ఎందుకు మాట్లాడుతున్నారు ? మీరెందుకని అసమ్మతి గొంతుకలతో మీగొంతు కలుపుతున్నారు ? శాంతి, పౌరహక్కులు ఒకదానితో మరొకటి కలవవని వారంటారు. మీరు మీ ప్రజల ఉద్యమానికి హానికలిగించడం లేదా అని ప్రశ్నిస్తున్నారు. తరుచుగా వారి ఆదుర్దాకు మూలకారణమేమిటో నాకు తెలిసినప్పటికి వారి మాటలు విన్నప్పుడు నాకు మహాబాధ కలుగు తుంది. ఎందుచేతనంటే అలా ప్రశ్నిస్తున్నవారికి నిజంగా నా గురించి తెలీదన్నమాట. వారు నివసిస్తున్న ప్రపంచమేమిటో వారికి తెలీదని వారి ప్రశ్నలు సూచిస్తున్నాయి".

యుద్ధ వ్యతిరేక పోరాటమూ, సమానత్వంకోసం పోరాటమూ ఎలా అవిభాజ్యంగా ముడిబడి వున్నాయో ఆయన వివరించారు.

"కొన్నేళ్ల క్రితం ఆ పోరాటంలో ఓ ఆశాకిరణం కనిపించింది. దారిద్ర్య నిర్మూలన కార్యక్రమాల ద్వారా పేదలకు ఓ నిజమైన ఆశావహమైన వాగ్దానం కనిపించింది; నల్ల పేదలకు, తెల్లపేదలకు ఇద్దరకూ. ప్రయోగాలు, ఆశలు, నూతన ప్రారంభాలు ఎన్నోకనిపించాయి. ఆ తరువాత వియత్నాంలో సైన్య సమీకరణ వచ్చింది. దారిద్ర్య నిర్మూలన కార్యక్రమం నిలువునా బద్దలైపోయింది. దాని ప్రాణం తీసినట్లయింది. యుద్ధోన్మాదం పెరిగినట్లు కనిపించింది. వియత్నాంలో దుస్సాహసాలు మానవశక్తిని నైపుణ్యాలను వాడుకుంటున్నన్నాళ్లూ అమెరికా తన పేద ప్రజల పునరావాసానికి అవసరమైన నిధులను అన్నిటికి ఖర్చు పెట్టలేదన్న విషయం నేను గ్రహిచాను".

అయన మానవతావాదిగా నిజమైన దేశభక్తుడుగా నల్ల అమెరికన్‌గా అన్యాయమైన యుద్ధం తాలూకు క్రూరత్వాన్ని బట్టబయలు చేశాడు. స్వేచ్ఛా, న్యాయం ముసుగులో అన్యాయ సమాజం సాగిస్తున్న అన్యాయమైన యుద్ధం అది.

"ఇక్కడ మన సమాజంచేత నడ్డివిరగొట్టబడిన నల్లయువకులను తీసుకుని 8,000 మైళ్లదూరానికి పంపిస్తున్నాం. నైరుతీ జార్జియాలోనూ తూర్పు హార్లెమ్‌లోనూ వారికి కనిపించని స్వేచ్ఛలకు ఎక్కడో ఆగ్నేయాసియాలో హామీ కల్పించడానికి వారిని అక్కడకి తరుముతున్నాం. మనకు టి. వి. తెరలమీద ఓ చిత్రమైన క్రూరదృశ్యం కనిపిస్తున్నది. ఇక్కడ స్కూళ్లలో నల్లవారిని తెల్లవారిని పక్కపక్కన కూర్చోపెట్టలేని జాతికోసం నీగ్రో యువకులు, శ్వేతయువకులు కలసి చంపుతున్నా, చనిపోతున్నా క్రూర దృశ్యం అదీ. వారిరువురూ ఒక పేదగ్రామంలోని పాకలను దగ్ధం చేసిన పాశవిక సంఘీభావాన్ని మనం టి. వి. తెరపై చూశాం. అయితే ఆ నీగ్రో యువకులు ఇక్కడ చికాగోలోని ఒకే బ్లాకులో కలిసి నివసించలేరన్న విషయం మనకు తెలుసు."

ఆయన సామాజిక సమానత్వం కోసం, వర్ణపరమైన సమానత్వం కోసం పోరాడే యోధునిగా, గొప్ప విమర్శకుడిగా వియత్నాంలో అమెరికా యుద్ధాన్ని వేళ్ళుపాతుకున్న జబ్బు లక్షణంగా పరిగణించాడు. ఆయనిలా హెచ్చరించాడు: "సామాజిక సముద్ధరణ కార్యక్రమాలకోసం కంటే సైనిక రక్షణకోసం ఏటా ఎక్కువ డబ్బు వ్యయంచేయడం కొనసాగిస్తున్న జాతికి ఆత్మిక మృత్యువు దగ్గర పడుతున్నది.

ఆయన ప్రసంగం విని పెద్దపెట్టున హర్షధ్వానాలు చేశారు. అమెరికా లోని యుద్ధవ్యతిరేక ఉద్యమానికి అమూల్యమైన ఆస్తి వంటివాడు మార్టిన్ లూథర్ కింగ్; ప్రజలను ఆకర్షించే అయస్కాంతం వంటివాడు.

పౌర నిర్భీకత మహా అరుదైన గుణం, అది భౌతిక నిర్భీకతకంటే ఉత్కృష్టమైనది. తాను యుద్ధాన్ని బాహాటంగా వ్యతిరేకిస్తే ప్రత్యర్థులు తనపై విమర్శనాబాణాలు సధింస్తారని కింగ్‌కు స్పష్టంగా తెలుసు. అమెరికా అధికార యంత్రాంగం దృష్టిలోనూ, వైట్‌హౌస్ దృష్టిలోనూ ఆయన అవాంఛనీయ వ్యక్తిగా తయారయ్యాడు. ఆయన్ను అభిమానిస్తున్న పలువురు బూర్జువా ఉదార వాదులు యుద్ధ వ్యతిరేక తీవ్రవాదం పట్ల తమ వ్యతిరేకత వ్యక్తం చేశారు; తన సంస్థకు లభిస్తున్న విరాళాలు పూర్తిగా తగ్గిపోయాయి; పాదార్థిక సహాయం కోరుతూ ఆయన రాసిన లేఖలను తెరవకుండానే తిప్పిపంపారు. చివరకు ఆయనపై హత్యాయత్నం చేసే ప్రమాదాలు పెరిగాయి. వార్తా పత్రికలను వెన్నాడి వేధించే వాతావరణం పెరిగింది. మరైతే ఇదంతా ఆయనకు తెలుసా. తెలుసు. వెనక్కు జారుకునే అలవాటు కింగ్‌కు లేదు.

## నిస్వార్థ పోరాటయోధుని ఆత్మ త్యాగం

అట్లాంటా మతగురువుకు ప్రపంచాన్ని ఎలా అవగాహన చేసుకోవాలో, జీవితం నుంచి ఎలా గుణపాఠాలు నేర్చుకోవాలో తెలుసు. 1968 ఏప్రిల్‌లో ఒక హంతకుని బుల్లెట్ మార్టిన్ లూథర్ కింగ్ సామాజిక రాజకీయ అభిప్రాయాల, ఆచరణల పరిణామానికి అంతం పలికే నాటికి, 1955 డిశంబర్ నుంచి ఆయన ఎంతోదూరం ముందుకు సాగాడు.

పోరాటం ప్రాథమిక లక్ష్యాలకు, అంతిమ లక్ష్యాలకు మధ్యగల తేడా ఏమిటి? ప్రాథమిక దశ ప్రత్యర్థులకు అంతిమదశ ప్రత్యర్థులకు మధ్యగల తేడా ఏమిటి? మాంట్ గోమెరీ నల్ల పౌరులకు బస్సుల్లో గౌరవప్రదమైన స్థానం లభించింది. అమెరికా పేద ప్రజానీకానికి తెల్లవారికి, నల్లవారికి ఇద్దరికీ ప్రపంచములో గౌరవప్రదమైన స్థానం లభించిందిం. ''రంగు జాతుల వారికి మాత్రమే'' అనే అవమానకరమైన నోటీసులకు వ్యతిరేకంగా పోరాటం, అమెరికా అవలంబి స్తున్న జాతీయ, విదేశాంగ విధానానికి సూత్రబద్ధమైన వ్యతిరేకత అవసరమని ఆయన గుర్తించాడు. వర్ణదురహంకార సామ్రాజ్యవాద వ్యవస్థను మార్చడమే తమ లక్ష్యంలో కింగ్ గుర్తించాడు.

కింగ్, ఆయన అనుచరులు పార్లమెంటుచేత ఆమోదింపచేయ తలపెట్టిన చివరి చట్టం ఏమిటంటే ఆర్థిక హక్కులకు సంబంధించిన చట్టం. ఆ చట్టం

అమెరికాలోని పేదప్రజలకు పనికి బతకడానికి సరిపడే వేతనాలకు హామీ కల్పించి వుండేది.

మార్టిన్ లూథర్‌కింగ్ చివరి ప్రచారోద్యమం బర్మింగ్‌హామ్ దుకాణాల బహిష్కారానికి కాని నల్ల ఓటర్లను నమోదు చేయడానికి తిరస్కరించిన సెల్మా వర్ణదురహంకారుల పై ఒత్తిడి తేవడానికిగాని ఉద్దేశింపబడింది కాదు; ఆయన చివరి ప్రచారోద్యమం ఉద్దేశం ఏమిటంటే వాషింగ్టన్ ప్రభుత్వ యంత్రాంగాన్ని మొత్తంగా కొన్ని వారాలపాటు సాధ్యమైతే కొన్ని మాసాలపాటు స్తంభీభూతం చేసి ప్రభుత్వవ్యయం తాలూకు ప్రాధాన్యతలలో మార్పు తెచ్చేందుకు ఒత్తిడి తీసుకురావడం.

'సదరన్ క్రిష్టియన్ లీడర్‌షిప్ కాన్ఫరెన్స్' ప్రధాన కార్యాలయం 1967 ఆఖరాలు కాలంనుంచి పేదప్రజల ప్రదర్శన సన్నాహాల కార్యకలాపాల్లో మునిగింది. నిరసన సేనలో అగ్రగామి దళమైన 3,000 మంది కార్యకర్తలు వివిధ రాష్ట్రాలనుంచి దేశ రాజధానికి వచ్చి పలుచోట్ల పాకలను శిబిరాలను నిర్మించాల్సి వుండింది. అంటే వాషింగ్టన్‌లోని నయా వర్ణదురహంకార డిపార్టు మెంట్‌లు, ఆఫీసులు వాటిని గమనించక తప్పని పరిస్థితిని సృష్టించాలను కున్నారు. ప్రధాన రోడ్లపై రవాణాను నిరోధించాలనుకున్నారు. చికిత్సకోసం డబ్బులేని రోగగ్రస్తులు ఆస్పత్రుల ముందు బారులుతీరి నిల్చోవాలనుకున్నారు. ప్రభుత్వ సంస్థలముందు బైఠాయింపులు జరపాలనుకున్నారు.

నిరంకుశాధికార యంత్రాంగం నిర్వహించే ఆత్మరాహిత్య పనివిధానాన్ని పికెటింగ్‌లచేత రాయబారాలచేత ధ్వంసం చేయాలనుకున్నారు; అమెరికాలోని పేదప్రజలకు "ఉద్యోగాలకు వేతనాలకు హక్కులేదా?" అన్న నినాదానికి ఫెడరల్ అధికారులు ప్రతిస్పందించి తీరేలా చేయాలనుకున్నారు.

కింగ్ పేదప్రజల ప్రదర్శనను అహింసకు చివరి పరీక్షగా పరిగణిం చారు: పేరుకుపోతున్న క్రోధావేశాన్ని, విద్వేషాన్ని నిర్మాణాత్మక నిరసనగా మార్చే ప్రయత్నంగా భావించాడు. ఈ ప్రయత్నంలో విఫలమయితే నీగ్రోపేటల్లో దాడులకు దారితీస్తుంది.

అమెరికా పెట్టుబడిదారీ విధానానికి తన రాజకీయ దుర్గంలో ముప్పు ఏర్పడింది. స్పష్టమైన దృష్టిగల పరిశీలకులు ఈ విషయం గ్రహించారు. కింగ్ తాలూకు అట్లాంటా ప్రధాన కార్యాలయంలోని గదుల్లో అనేకదినాలు గడిపిన రచయిత, జర్నలిస్టు అయిన జోస్ ఎగ్లియాన్ తన అభిప్రాయాలను ఇలా వివరిం చారు : "ఎత్తుగడలు అహింసాత్మకమైనవి; సదరన్ క్రిష్టియన్ లీడర్‌షిప్ కాన్ఫ రెన్స్ భాషతాలూకు ధోరణి నైతికపరమైనది; కాగా డిమాండ్ల సారమేమో విప్లవ

కరమైనది. వర్గపరమైన డిమాండ్లు ప్రజాతంత్ర క్రమంలోకాక భిన్నమైన పద్ధతుల్లో కాబడ్డాయి.

ఎగ్లియాన్ కింగ్‌ను తన ఈ నిర్ధారణను ధృవీకరించాల్సిందిగా కోరగా కింగ్ ఇలా సమాధానమిచ్చాడు : "ఒక విధంగా, మేము వర్గపోరాటంలో నిమగ్నమయ్యామని మీరు చెప్పవచ్చు. అవును...ఇది సుదీర్ఘమైన, కష్టమైన పోరాటంగా వుంటుంది. ఎందుచేతనంటే ఆర్థికాధికారాన్ని పునఃపంపిణీ చేయాలని మా కార్యక్రమం కోరుతున్నది."

మార్టిన్ లూథర్‌కింగ్ బైబిల్‌లోని ఓ నీతికథను వివరించసాగాడు. అది బిచ్చగాడు లాజరస్‌కు, మరో ధనికునికి సంబంధించిన నీతికథ. లాజరస్ పేదవాడు కాబట్టి స్వర్గానికి వెళ్ళలేక పోయాడు. ధనికుడేమో అతడు ధనవంతుడు కాబట్టి నరకానికి వెళ్ళలేదు. అయితే కింగ్ ఇలా వాదించసాగాడు : "కాదు, ధనికుడు రోజూ లాజరస్ తన పక్కనే వెళ్తున్నప్పటికీ అతన్ని గమనించలేదు కాబట్టి అతడు శిక్షించబడ్డాడు". కింగ్ తన సామ్యాన్ని ఇలా ముగించాడు : "నే చెప్తున్నా వినండి, ఈ దేశం గనక తన పేదప్రజల్ని గమనించకపోతే, వాళ్ళను దారిద్ర్యంలోనూ దుస్థితిలోనూ అలాగే కొనసాగిస్తే ఈ దేశం తప్పకుండా నరకానికి వెళ్తుంది !"

లూథర్‌కింగ్ హత్య అయ్యాక నాలుగురోజులకు కొరెట్టాకింగ్ ఓ స్మారక సమావేశంలో ఇలా అన్నారు. "ఆయన తన జీవితాన్ని ప్రపంచపేదలకు సమర్పించారు. మెంఫిస్‌లోని చెత్తాచెదారం ఎత్తేస్తే కార్మికులకోసం వియత్నాం రైతులకోసం ఆయన తన జీవితాన్ని సమర్పించారు" ఆయన తన జీవితక్రమం ద్వారా పోరాటంద్వారా తన మృత్యువుద్వారా ఆ మాటల సత్యాన్ని నిరూపించాడు. 1968 మార్చి చివరిప్రాంతంలో అమెరికాలోని వర్ణపరమైన రంగంలో కాస్త ప్రశాంతత నెలకొంది.

మెంఫిస్, టెన్నిసీలో మాత్రమే సమ్మె కొనసాగుతూ వుండింది. చెత్తాచెదారం ఎత్తేసే కార్మికులు నిర్వహించిన సమ్మె అది.

టెన్నిసీ దక్షిణానికి ద్వారం వంటిది. మెంఫిస్, మిసిసిపి ప్రాంతంలోని నగరం. నగరజనాభా 5,50,000 కాగా అందులో 40 శాతానికి పైగా నల్లవారే.

వీధుల్ని శుభ్రంచేయడం చాలా తేలికపని. ఈ పని తప్పనిసరిగా నల్ల అమెరికన్లే చేస్తూవుంటారు. మెంఫిస్ సిటీకౌన్సిల్ అందుకు వారికి వేతనాలు ఇస్తుంది. మెంఫిస్ మేయరైన హెన్రీలూబ్ ఆధిపత్యాన ఇది సాగుతుంది. 1,300 మంది నల్ల కార్మికులు వేతనాలు పెంచాలని తమ ట్రేడ్ యూనియన్‌ను గుర్తించాలని కోరుతూ సమ్మె చేశారు.

అతి మామూలు డిమాండ్లతో ప్రారంభమైన ఈ సమ్మె గురించి మెంఫిస్ లోనే తప్ప బయటివారికి తెలీదు. సమ్మె నలభై రోజులుదాటినప్పటికీ విజయావకాశాలు కనిపించలేదు. రోడ్లమీద గుట్టలుగుట్టలుగా పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తగలెట్టడం ద్వారా శుభ్రంచేయడానికి ప్రజలు పలుచోట్ల ప్రయత్నించడంతో అగ్నిమాపకదళాలను తరుచుగా పిలవవలసి వచ్చింది.

సమ్మె విషయం కింగ్ దృష్టికి రానంత కాలం సమ్మెవల్ల అధికారులకు ఎలాటి ఇబ్బంది జరగలేదు. ఏమైనా కింగ్ మెంఫిస్‌లో అడుగుపెట్టి పెట్టగానే సంఘీభావ ప్రదర్శనకు పిలుపు ఇచ్చాడు. అయితే ఇది వాషింగ్టన్ పోరాటానికి రిహార్సల్ ఏమీకాదు. కింగ్ తన సంప్రదాయ పద్ధతినే అవలంబించాడు. అంటే నగరంలోని పరిస్థితిని నాటకీయంగా చిత్రించి "సృజనాత్మక ఉద్రిక్తతను" సృష్టించి అధికార్లను భయపెట్టే పద్ధతి. అలా చేస్తేతప్ప వారు సంప్రదింపులకు దిగి రాయితీలు ఇవ్వరు.

మార్చి 28 వ తారీకున, అంటే కింగ్‌ను కాల్చి చంపడానికి వారం రోజుల ముందు మెంఫిస్‌లో నిరసన, సంఘీభావ ప్రదర్శన జరిగింది. ఆ రోజు పొద్దుట్నుంచీ వేలాది మంది నగరంలో ప్రదర్శన జరిపారు. మార్టిన్ లూథర్ కింగ్, రాల్ఫ్ అబర్నతి, రాల్ఫ్ జాక్సన్‌లు వారికి నాయకత్వం వహించారు. ప్రదర్శకుల ముందు, పక్కల పోలీసులు నడుస్తున్నారు. వారి చేతుల్లో లాఠీలు వాకీటాకీ యంత్రాలు వున్నాయి.

ఇంతలో ఉత్సాహం వురకలువేసే 20 యేళ్ళు కూడా నిండని నల్ల యువకులు వచ్చిపడ్డారు. వారు ప్రదర్శకుల్లో వచ్చి కలవాలనుకున్నారు కాని పోలీసులు అడ్డుపడ్డారు.

పోలీసులపై ఇటుక రాళ్ళు విసిరారు, దుకాణాల కిటికీలు బద్దలుకొట్టారు. కిటికీల గుండా సరుకులు తీసుకెళ్ళడానికి ప్రయత్నించారు.

ఇది రౌడీ మూకల చర్యా? ప్రతీకారమా? లేక ఆలోచన లేని ఆ నల్ల యువకులు ఆ కాసేపు బేలేవీధి తమదే అనుకున్నారా? అక్కడి షాపుల యజమానులంతా తెల్లవారే.

155 షాపుల కిటికీలు బద్దలైపోయాయని షాపుల్లోని సరుకుల్లో ఐదు శాతం సరుకుల్ని దోచుకుపోయారని మరుసటి రోజు మెంఫిస్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ ఛైర్మన్ ఎర్ల్‌లన్నింగ్ ప్రకటించాడు. కాగా 16 ఏళ్ళ నల్ల బాలుడొకడు మరణించాడని 60 మంది గాయపడ్డారని 200 మంది అరెస్టయ్యారని పోలీసులు తమ ప్రకటనలో వివరించారు.

టెన్నిసీ లెజిస్లేటివ్ అసెంబ్లీ చాలా త్వరగా ప్రతిస్పందించింది. కర్ఫ్యూ ప్రకటించడానికి మేయర్లను అనుమతించారు. మెంఫిస్ మేయర్ ఎగిరి గంతేసి కర్ఫ్యూ ప్రకటించాడు. అందరికన్నా ముందు ఆయనే కర్ఫ్యూ ప్రకటించాడు. మార్చి 28 సాయంత్రం ఏడు గంటల నుంచి మెంఫిస్ వీధులు నిర్మానుష్య మయ్యాయి. రాష్ట్ర గవర్నర్ బుఫర్డ్ ఎల్లింగ్టన్ 4,000 మంది జాతీయ రక్షక దళాలను మెంఫిస్‌కు హుటాహుటిగ పంపాడు. ఆ దళాలు కఠినంగా కర్ఫ్యూ అమలు జరిపి వీధుల్ని నిర్మానుష్యం చేశారు. మరో 8,000 మంది సైన్యాలను సన్నద్ధంగా వుంచారు.

నల్లవారు తిరుగుబాటు జరపకుండా శ్వేత మెంఫిస్ నగరం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంది. అయితే ఉద్రిక్తత విస్ఫోటనగా మారనే లేదు.

జాతీయ దళాలు స్వైర విహారం ప్రారంభించగానే కింగ్‌ను లాక్కెళ్ళి కార్లో పడేసి గుర్తు తెలియని స్థలానికి సురక్షితంగా తీసుకెళ్ళారు.

బేలే వీధిలో ఉన్మాదం ఇంతగా తాండవిస్తుందని కింగ్ ఊహించలేదు. "హింసాకాండ జరుగుతుందని నాకు నిన్న తెలిసివుంటే ఆ ప్రదర్శన జరిపి వుండే వాణ్ని కాదు" అన్నారాయన.

మార్చి 29 వ తేదీన చెత్తాచెదారం ఎత్తేసే కార్మికులు ప్రదర్శన చేశారు. వారి పక్కనే రైఫిళ్ళు పట్టుకుని జాతీయ రక్షక దళాలు నడిచాయి. ప్రదర్శకుల రొమ్ము భాగాన వున్న ప్లేకార్డులపై రైఫిల్ మడమల నీడలు పడుతున్నాయి. ప్లేకార్డులపై ఈ అక్షరాలున్నాయి : "నేనో మనిషిని".

ఏమైనా కోపోద్రిక్తపు కేకలు మెంఫిస్‌లోని చెత్తాచెదారం (గార్బేజ్) ఎత్తేసే కార్మికులను కలవర పరచలేదు. ఆ కేకలు మెంఫిస్‌లో మరో సారి తలెత్తిన నల్ల అరాచకత్వానికి వ్యతిరేకంగా ఉద్దేశింపబడినవి. అలాటి అరాచకత్వానికి స్వస్తి చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది. వాషింగ్టన్ కోపంతో ఖస్సుమంది. రాజధానుల్లో జరగనున్న పేదప్రజల ప్రదర్శనను కోర్టు ఉత్తర్వు ద్వారా రద్దు చేయాలని పశ్చిమ వర్జీనియాకు చెందిన సెనెటర్ రాబర్ట్ బైర్డ్ ప్రతిపాదించాడు. ఆయన కింగ్‌ను విమర్శించాడు. కింగ్ కార్యక్రమాలను నివారించక పోతే అవి వాషింగ్టన్‌కు కూడా "అదే రకం హింసాకాండను, వినాశనాన్ని, లూటీని, రక్తపాతాన్ని" తెచ్చి పెడతాయని బైర్డ్ అన్నాడు. అధ్యక్షుడు జాన్సన్ మార్చి 29 న చేసిన మూడు ప్రత్యేక ప్రసంగాల్లో తాను "వివేకరహిత హింసాకాండను" సహించేది లేదని హెచ్చరించాడు.

మెంఫిస్ వైఫల్యం నీడలు ఇప్పుడిక వాషింగ్టన్ ప్రదర్శనపై పడ్డాయి. ఇప్పుడు వెనుకడుగు వేస్తే ఇకముందుకెళ్ళే సమస్యే వుండదు.

కింగ్ మార్చి 29 న ఇలా ప్రకటించాడు: "మేము వాషింగ్టన్ వెళ్ళడానికి కృతనిశ్చయంతో వున్నాము. అది తిరుగులేని అవశ్యకతగా భావిస్తున్నాం".

మరి కొద్దిరోజుల్లోనే తరువాతి ప్రదర్శన జరపాలని యోచించారు. కింగ్ మళ్ళీ అట్లాంటా నుంచి మెంఫిస్ వెళ్ళాడు.

కింగ్ కలలు గన్నట్లే ప్రదర్శన ప్రశాంతంగా జరిగింది. ఆ ప్రదర్శన ఆయన ఆశించిన దానికంటే పెద్దది కూడాను. దేశంలోని నాలుగు చెరగుల నుంచి మొత్తం 35 వేల మంది నల్లవారు తెల్లవారు ప్రదర్శనలో పాల్గొన్నారు. మాంట్‌గోమెరీ ప్రదర్శన నాటి వీరోచిత దినాల్లోనూ వాషింగ్టన్ ప్రదర్శననాటి వీరోచిత దినాల్లోనూ జరిగిన ప్రదర్శనల్లాగా ఇది కూడా జరిగింది. ప్రదర్శకులు ప్రశాంతంగా వీధులగుండా సాగారు. శ్వేత మెంఫిస్‌నగరం మరణించిందా అని పించింది. దుందుడుకు వర్ణదురహంకారుల గుంపులు కనిపించలేదు. పోలీసులు ప్రదర్శకులపై రంకెలు వేయలేదు. దుకాణాల తలుపులకు తాళాలు వేశారు. షాపుల కిటికీలపై ఇనుపపూచల జల్లెళ్ళు వేశారు. ఎవ్వరూ కిటికీలగుండా తొంగి చూడలేదు. పోలీసులు అలా ఆదేశించారు. ఈ ప్రదర్శనకు ప్రేక్షకులు జాతీయ రక్షకదళాలు మాత్రమే. వీరు పేవ్‌మెంట్లపై అక్కడక్కడా నిల్చున్నారు.

గార్బేజ్ కార్మికులకు సంఘీభావంగా కింగ్ సన్నద్ధం చేసిన ప్రదర్శన ఆయన హత్య అయ్యాక నాలుగు రోజులకు మాత్రమే జరిగింది. ఏప్రిల్ 8న జరిగిన ఈ ప్రదర్శన ఆయన స్మృతిలో జరిగిన ప్రదర్శనలా నిలిచిపోయింది.

మనం మళ్ళీ మన కథకు వద్దాం.

ఏప్రిల్ 3వ తేదీన కింగ్ మళ్ళీ విమానంలో మెంఫిస్ వెళ్ళాడు. తాను మృత్యువు దిశగా వెళ్తున్నట్లు ఆయనకు తెలీదు.

కింగ్ ఏప్రిల్ 3వ తేదీ సాయంత్రం మెంఫిస్‌లోని నల్ల ప్రజల చర్చిలో మతపరమైన ప్రసంగం చేశాడు. జీవన్మరణ సమస్యపై ఇలా అన్నాడు:

**"నేనింతలో మెంఫిస్‌లో పడ్డాను. నన్ను ఉద్దేశించి వచ్చిన బెదిరింపుల గురించి కొందరు ప్రస్తావించారు. కొంతమంది రోగగ్రస్త శ్వేత సోదరుల నుంచి నాకేమైనా జరగవచ్చునన్నారు. సరే కానీండి ఇప్పుడేం జరుగుతుందో నాకు తెలీదు. మనకు ముందు ముందు గడ్డు రోజులున్నాయి. అందరిలాగే నేనూ దీర్ఘ జీవనం గడపాలనుకుంటున్నాను. దీర్ఘ జీవనానికి దాని స్థానం దానికుంది. ఐతే ఇప్పుడు దాని గురించి ఆందోళన చెందటం లేదు. దైవ సంకల్పానికి అనుగుణంగా వ్యవహరించాలనుకుంటున్నాను. నేను పర్వతం చేరుకోడానికి నన్నాయన అనుమతించారు. నేను నా చూపును పైకి ప్రసరించి "వాగ్దత్త రాజ్యాన్ని" పరికించాను.**

"మీతో పాటు నేనక్కడకు వెళ్లలేకపోవచ్చు, మనం వాగ్దత్త రాజ్యం చేరుకోగలమని మీరు గ్రహించాలని నేను ఈ రాత్రి కోరుకుంటున్నాను.

"కనుక నాకు చాలా ఆనందంగా వుంది. నాకు దేని గురించీ చింత లేదు. ఎవర్నీ గురించీ భయపడడం లేదు..."

భవిష్యత్ హెచ్చరికలాటిదేదైనా ఆయన్ను కలవరపరచిందా? అదే నిజమైతే అది ఆఖరు హెచ్చరికే తప్ప మొదటి హెచ్చరిక కాదు. ఆయన్ను చంపుతామంటూ చేసే బెదిరింపులు రోజూ వస్తూనే వుండేవి. లేఖల్లో బెదిరించేవారు, గుంపుల్లోనుంచి కేకలువేస్తూ చంపుతామని బెదిరించే వారు, టెలిఫోన్లలో ఆకాశరామన్నలు బెదిరించేవారు. ఆయన తను అకాలమృత్యువుకు గురయ్యే ప్రమాదం వుందని అప్పుడప్పుడూ భావించేవారు. ఆ భావాలలో మత పరమైన మార్మిక వాదం, రాజకీయ వాస్తవికతతో మేళవించివుండేది. ఎందుచేతనంటే తాను నివసిస్తున్న దేశంలో ఒకపోరాటయోధుని జీవితం గండాలతో కూడుకున్నదని ఆయనకు తెలుసు. అయితే ఆయన ఆలా తప్ప మరోవిధంగా జీవించలేడు కాబట్టి ఆయన ఎప్పుడో అందుకు సిద్ధపడేవున్నాడు. ఆయన విధివాదం నటనతో కూడుకున్నది కాదు; నిరంతరం కళ్ళముందు కనిపించే నిజమైన ప్రాణప్రమాదాన్ని వివేకయుతంగా గుర్తించడం తప్ప మరొకటి కాదది.

ఆయనొకసారి ఇలా అన్నారు. "వ్యక్తిగత ప్రమాద సమస్యను పరిష్కరించాను. నేను ప్రతిరోజూ ప్రాణభయంతోనే బతుకుతున్నాను. నన్ను జయించడానికి భయాన్ని అనుమతిస్తే నేనిక నా పనులు చేయలేనని చాలా ఏళ్ళ క్రితమే గ్రహించాను." కాబట్టి ఆయన ధైర్యం గురించి కాక మృత్యువు గురించి మాట్లాడ్డానికే ఇష్టపడ్డాడు.

కింగ్ మామూలుగా నల్లవారు యజమానులుగా వున్న హోటళ్ళలోనే బస చేసేవాడు. ఈ విషయం తెలిసిన ఆయన మిత్రులు లొరెయిన్ మోటల్ రెండవ అంతస్తులో 306 నంబరు గది ఆయన కోసం తీశారు. తలుపు తెరవగానే పొడుగాటి బాల్కనీ, ఆకుపచ్చని ఇనుపఊచలతో నిర్మించిన పిట్టగోడ వున్నాయి. కిందికి దిగాలంటే బాల్కనీ మీదుగా నడిచి స్టేర్‌కేస్ దగ్గరకు వెళ్ళాల్సివుంటుంది.

డాక్టర్‌కింగ్ రెండవ అంతస్తులో నివసిస్తున్న విషయమూ ఆయన బాల్కనీ మీదగా నడవక తప్పదన్న విషయమూ పర్యవసానంగా తుపాకీగురి నుంచి తప్పించుకోలేడన్న విషయమూ జేమ్స్‌రేకు అదే రోజు సాయంత్రం కానీ మరుసటిరోజు ఉదయంకానీ తెలిసింది. ఇక కావలసిందల్లా ఏ మార్గం గుండా బుల్లెట్‌ను వదలాలన్నది తెలుసుకోవడమే. బాల్కనీ కింద పార్కింగ్ స్థలం దాని

ప్రక్కనే ఇరుగ్గావున్న మల్బరీ వీధి వున్నాయి. మల్బరీ వీధికి, పార్కింగ్ స్థలానికి మధ్య రెండుమీటర్ల ఎత్తున గోడ వుంది. గోడ మీదుగా ముళ్ళపొదలు పాకాయి. ఇంకొంచెం ముందుకెళ్తే చెట్లు వాటికవతల ఇనుపతీగల కంచె వున్నాయి. దాని పక్కనే ఓ రెండంతస్తుల భవనపు వెనుక తట్టు ప్రాంతం వున్నాయి. ఈ భవనానికి ముందరివైపు దక్షిణ ప్రధాన వీధి వుంది. ఆ భవనంలో వృద్ధులు ఏకాంత జీవితం గడుపుతున్నారు. భవనంలోని గదుల నిండా చక్కటి ఫర్నిచర్ వుంది. ఏప్రిల్ 4వ తేదిన నల్లటి సూటు ధరించిన ఓ యువకుడు అక్కడికి వెళ్ళి తనకో రోజుకు గది కావాలని అడిగాడు. ఆ భవనం యజమానురాలు శ్రీమతి బ్రెవర్ ఉత్తరం వైపు తలుపున్న గది ఒకటి చూపించింది. అయితే ఆ ఆగంతకుడికి ఆ గది నచ్చలేదు. దక్షిణం వైపైతే చక్కటి ఎండ వుంటుంది కాబట్టి దక్షిణం వైపున ఓ గది కావాలన్నాడు. అక్కడ గది వుండింది. అక్కడ నుంచి లొరెయిన్ మోటల్ స్పష్టంగా కనిపిస్తుంది.

ఆ గదులన్నింటికీ ఉమ్మడి స్నానపుగది వుంది. అక్కడ నుంచి అయితే లొరెయిన్ మోటల్ మరింత స్పష్టంగా కనిపిస్తుంది. అక్కడ నుంచి తలుపుల మీద ఇనుప ముక్కల్తో చేసిన 3,0,6 సంఖ్యలు రెమింగ్టన్ రైఫిల్ గురికి స్పష్టంగా కనిపిస్తాయి.

బాగా అలసి వచ్చాను కాబట్టి చాలాసేపు స్నానపుగదిలో విశ్రాంతి తీసుకుంటానని చెప్పి స్నానపుగది లోపలివైపు తలుపు బిగించుకున్నాడు. అతని మాటల్లో దక్షిణపు యాస వినిపించింది. ఆ స్నానపుగది నుంచి 3,0,6 సంఖ్యల గదులకు 70 మీటర్ల దూరం.

కింగ్ తన గదిలో పగలంతా రద్దీగా గడిపాడు. వివిధ కార్యకలాపాలు చూసుకున్నాడు. సహాయకులతో సంప్రదింపులు జరిపాడు. శ్యామ్యుయేల్ కైల్స్ అనే ఓ నల్ల మతగురువు ఆయన్ను రాత్రికి భోజనానికి ఆహ్వానించాడు. అందుచేత సాయంత్రం ఆరు గంటలకే చర్చలను ముగించక తప్పలేదు. శామ్యుయేల్ కైల్స్ అప్పటికే అక్కడికి వచ్చి కింగ్‌ను తన ఇంటికి తీసుకెళ్ళడానికి నిరీక్షిస్తున్నాడు. రాల్ఫ్ అబర్నతి కూడా కింగ్ గదిలోనే వున్నాడు. కింగ్ నల్లటి టై కట్టుకొని పసుపుపచ్చ గుడ్డను తన బలమైన మెడచుట్టూ చుట్టుకున్నాడు. అద్దంలో తన డ్రస్సు చూసుకుంటూ కైల్స్‌ను ఇలా ఆటపట్టించాడు.

"ఆధ్యాత్మిక ఆహారం వండిపెట్టే వయస్సు మీ భార్యకింకా రాలేదనుకుంటా. ఆమెకు ముప్పయ్యొక్క సంవత్సరమే కదూ? ఆ వయసులో ఆధ్యాత్మిక ఆహారం ఎలా వండుతుంది?"

కింగ్ చివరకు టై బిగించుకున్నాడు. అయినా, కైల్స్ గది నుంచి బయట పడ్డారు. కైల్స్ త్వరగా కింది అంతస్తుకు దిగాడు. కింగ్ మాత్రం ఇనుప ఊచల పిట్టగోడ దగ్గర తారట్లాడుతున్నాడు. ఇంకా గది నుంచి బయట పడని అబర్నతి కోసం ఎదురుచూస్తున్నాడు.

బాల్కనీ పక్కనే నల్లని క్యాడిలాక్ కారు ఒకటి ఆగివుంది. దాన్ని కింగ్ ఉపయోగం కోసం ఆపివుంచారు. ఆ కారు పక్కన కింగ్ మిత్రులు జెస్సీ జాక్సన్, యాండ్రూయంగ్, డ్రైవర్ సాలమన్ జోన్స్ నిల్చుని వున్నారు. అందరూ చలోక్తులు విసురుకునే ఉత్సాహంలో వున్నారు. వారంతా భోజనా లయ్యాక మరో సభకు వెళ్ళాల్సివుంది.

"మీరుబెన్‌ను ఎరుగుదురా"? కింగ్‌ను జాక్సన్ ప్రశ్నించాడు. బెన్‌బ్రాంచ్ అంటే చికాగోకు చెందిన గొప్ప నల్ల సంగీతకారుడు. తరువాత జరగబోయే సభలో అతడు పాటలు పాడతాడు.

"అవునవును అతడు నావాడే." కింగ్ ఇనుపఊచల మీద ఆసుకొని నవ్వుతూ సమాధానమిచ్చాడు. కింగ్ తన పక్కనే వున్న బెన్‌బ్రాంచ్‌ని వుద్దేశించి ఇలా అన్నాడు. "మీ రివ్వాళ ప్రభూ ప్రభూ నా హస్తం పుచ్చుకో అనే పాట పాడాలి సుమా నువ్వాపాట అందంగా పాడతావు."

బెన్‌బ్రాంచ్ ఆ పాట పాడతానన్నాడు. అతడికి విషాదం గురించి తెలుసు గామోలు.

"చలి ఎక్కువవుతూంది డాక్టర్ కింగ్‌గారూ ఓవర్‌కోట్ వేసుకుంటారా?" అన్నాడు డ్రైవర్.

"అలాగే వేసుకుంటాను." అని సమాధానమిస్తూ కొంచెం ముందుకు జరిగాడు. తనను ప్రేమించిన, రక్షించిన, తనను చూసి గర్వించే తన సీనియర్ కామ్రేడ్లనుంచి కాస్త దూరమవుతున్న విధంగా ఆయన కాస్త ముందుకు జరిగాడు.

ఆయన ఆకుపచ్చని ఇనుప ఊచలు పట్టుకునే కాస్త ముందుకు జరిగాడు. సరిగ్గా అదే క్షణంలో ఓ తుపాకీ గుండువచ్చి ఆయన శరీరంలోకి దూసుకు పోయింది. ఆయన మిత్రులకు కాల్పుల శబ్దం వినిపించింది. తొమ్మిది గ్రాముల మారణాంతకశక్తి వచ్చి ఆ భారీ శరీరాన్ని నేలకూల్చింది. డాక్టర్ కింగ్ నిస్తేజంగా చేతులు చాచుతూ బాల్కనీలోని సిమెంట్ గచ్చుమీద వెల్లకిలా పడి పోయాడు. తుపాకీ గుండు మెడ కుడి భాగంతో దూరింది. కంఠ భాగంలోని వెన్నుపూస బద్దలైపోయింది. కింగ్ తన విశాల నేత్రాలను తేలవేస్తూ అబర్నతి

వైపు చూశాడు. అబర్నతి అప్పుడే 306 గది నుంచి బయటకు వచ్చాడు. కింగ్ నోటనుంచి ఒక్కమాట కూడా పెగల్లేదు.

తరువాత గంటకుకానీ వైద్యశాస్త్ర ధ్రువీకరణ రీత్యా ఆయన మరణించని మాట నిజమే అయినా ఆచరణరీత్యా గుండుతలిగిన క్షణమే ఆయన మరణించాడు. మిత్రులు హుటాహుటిగ అక్కడికి చేరుకొని కుడిదిశగా తమ చేతులు ఎత్తి చూపించారు. అంటే శబ్దంతో పాటు గుండువచ్చిన దిశగా వాళ్ళ చేతులు చూపారు.

ఇంతలో పోలీసుకార్ల ఈలలు వినిపించాయి. కెమెరాలు క్లిక్‌మంటున్నాయి. సినీ కెమెరాలు కూడా రంగంలోకి వచ్చాయి. ఇంత జరిగింది కానీ అంబులెన్స్ కారు మాత్రం రాలేదు. కింగ్ ఇంకా నేలమీదే అలాగే పడుకుని వున్నాడు. ఆయన చేతులు బార్లా చాపి వున్నాయి, మోకాళ్ళు వంగివున్నాయి. మోహంమీద తెల్లటి టవల్ ఒకటి కప్పారు. రక్తం కారిపోతూనే వుంది.


**"ప్రభూ ప్రభూ నా హస్తం పుచ్చుకో నన్ను నడిపించు, నన్ను నిలదొక్కుకోనీ, అలసిపోయాను, నీరసించాను, నిస్తేజమయ్యాను. తుఫాను నుంచి బయటకు నడిపించు అంధకారం నుంచి వెలుగులోకి నడిపించు ప్రభూ ప్రభూ."**

ముఖ్యంగా టెలివిజన్ యుగంలో విషాదం వాయువేగంతో పయనిస్తుంది. ఆ విషాద సాయంకాలం అమెరికా నాకెలా కనిపించిందంటే - నిరంతరం ఏదో కార్యకలాపాల్లో మునిగివుండే వ్యక్తిని నిర్వివాద గ్రస్తుడయిన న్యాయనిర్ణేత మెడపట్టుకొని ఆపి "నీ అంతరాత్మలోకి చూసుకో అక్కడేం జరుగుతున్నదీ నీకే తెలుస్తుంది". అని హెచ్చరించినట్లుంది.


లక్షలాది మంది ప్రజలు, బొను కోట్లాది మంది ప్రజలు ఆ సాయంత్రం ప్రతీకారంలో ఆనందం పొందారు. ఓ విధమైన ద్వేషంతో కూడిన సంతృప్తి పొందారు. దీన్ని ఎవరు కాదనగలరు? చివరకు ఇబ్బందులు సృష్టించే ఆ వ్యక్తి, ఇతరుల కంటే ఎక్కువ కోరుకున్న ఆ నిగ్గర్ (అమెరికాలో శ్వేత దురహంకారులు నల్లవారిని నిగ్గర్స్ అని పిలుస్తుంటారు. ఈ పదానికి మూలం నీగ్రోకు - అను.) లభించాల్సిందే లభించింది.

కాగా అటు జేమ్స్‌రే మెంఫిస్ పోలీసులకు టోపీపెట్టి తన తెల్ల ముస్టాంగ్ కారులో చల్లగా జారుకున్నాడు. రేడియోలో వార్త విని తాననుకున్న పని చక్కగా నెరవేర్చినట్లు తెలుసుకుని తనలో తనే వికృతంగా నవ్వుకున్నాడు.

వైట్‌హౌస్‌లో దుఃఖం కంటే భయాందోళనలే ఎక్కువ వ్యక్తమయ్యాయి. నీగ్రోపేటల్లో ప్రతిస్పందన ఎలావుంటుంది? అది ఊహించడం కష్టమేమీ కాదు.



1964 డిసెంబరులో మార్టిన్ లూథర్ కింగ్‌కు నోబెల్‌శాంతి బహుమతిలభించింది. తనతోటి నల్లపౌరులను కొత్త కళ్లతో చూడాల్సిందిగా ఆయన అమెరికాపై వత్తిడి తెచ్చాడు. ఆయన నల్ల అమెరికన్లలో ఆత్మగౌరవ భావాన్ని తమశక్తిపై విశ్వాసాన్ని కలిగించాడు. అంతిమంగా ఆయన తాను బహుశా ఎన్నడూ ఆశించనిది కూడా సాధించాడు. ఎవరికైతే "వజ్రాలకంటె, వెండికంటె, బంగారం కంటె నిజమైన సౌభ్రాతృత్వ సౌందర్యమూ శాంతి సౌందర్యమూ ఎక్కువ విలువైనవో" అలాటి వారికి ఆయన ఆదర్శ ప్రాయుడుగా రూపొందాడు.




అణుయుగంలో అంతర్జాతీయ సంబంధాల విషయంలో నిజమైన ఎంపిక హింస, అహింస మధ్య కానేకాదని అహింస, అస్తిత్వ రాహిత్యం మధ్యనే నిజమైన ఎంపిక వున్నదని కింగ్ నమ్మాడు. 1967 మధ్యభాగంలో సుప్రసిద్ధ మానవతావాది డాక్టర్ స్పాక్‌తో కలిసి డాక్టర్ కింగ్ ప్రప్రథమంగా యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలో పాల్గొన్నాడు.

వారి ప్రతిస్పందనను నివారించడం అటుంచి కనీసం ప్రతిస్పందనను తగ్గించా లన్నా కష్టమే మరి. అధ్యక్షుడు వెనువెంటనే టెలివిజన్‌లో ప్రసంగించాడు. అహింసాయుతంగా జీవించిన డాక్టర్ కింగ్‌ను పొట్టనపెట్టుకున్న గుడ్డి హింసను అమెరికన్లు విడనాడాలని ఆయన విజ్ఞప్తి చేశాడు.

అయితే నోటిమాటల చికిత్సలో బలహీనతలున్నాయని అధికారులకు తెలుసు. విజ్ఞప్తులు పనిచేయవని వారెరుగుదురు. మొట్టమొదటగా చర్య తీసుకున్న వ్యక్తి మెంఫిస్ మేయర్ హెన్రీలూబ్, ఆ తరువాత టెన్నిసీ గవర్నర్ బఫర్డ్ ఎల్లింగ్‌టన్ మెంఫిస్ కాలమాన ప్రకారం రాత్రి ఏడుగంటల ఐదు నిమిషాలకు కింగ్ మరణించినట్లు డాక్టర్లు నమోదు చేశారు. అయితే అందుకు అర్ధ గంట ముందే హెన్రీలూబ్ నగరంలో కర్ఫ్యూ విధించారు. టెన్నిసీ గవర్నర్ ఎల్లింగ్‌టన్ టెలివిజన్‌లో ప్రసంగిస్తూ మొదట సంతాపం ప్రకటించాడు. అంతకు ముందు రోజే ఉపసంహరించుకున్న నాలుగువేలమంది జాతీయ భద్రతా దళాలను తిరిగి నగరానికి పిలిపిస్తున్నట్లు తెలుపుతూ తన ప్రసంగం ముగించాడు. దాడులను అణచడంలో శిక్షణ పొందిన పోలీసులను హుటాహుటిగ విమానాల్లో రప్పించారు. లారెయిన్ మోటల్‌ను ఎవ్వరూ చేరకుండా చుట్టూ పోలీసు వలయం ఏర్పాటు చేశారు. అది ప్రమాదకరమైన స్థలంగా మారింది. నల్లవారు తమ దుఃఖాన్ని, క్రోధాన్ని వ్యక్తంచేసే స్థలంగా మారింది.

అధికార రంగంలోని సంతాపంలో భయం మిళితమయింది. నల్లవారి సంతాపంలో నిస్సహాయ క్రోధావేశం మిళితమయింది. న్యూయార్క్‌లోని సెంట్రల్ పార్కులో హడావుడిగా సభ ఏర్పాటు చేశారు. క్రోధావేశంతో ఆరోపణలు చేశారు. కింగ్ హత్యకు ప్రతీకారం తీర్చుకోవడం ఎలా ? ఈ సవతితల్లి దేశానికి గుణపాఠం నేర్పడమెలా ? వేలాది మంది ప్రజలు సిటీహాల్ దిశగా కదిలారు. న్యూయార్క్ పోలీసులు మొత్తం రవాణాను ఆపి వారికి మార్గం సుగమం చేశారు.

హత్య జరిగిన అనంతరం వాషింగ్టన్ నగరం పేలిపోయింది. మరుసటి రోజు సాయంత్రం మూడింటికల్లా నల్లవారున్న ప్రాంతాల్లో మంటలు, పొగలు అలముకున్నాయి. నీగ్రోపేటల్లోని తెల్ల యజమానుల షాపులను దోచుకుని తగల బెట్టారు. నల్లవారు పోలీసులతోనూ, అగ్నిమాపక దళాలతోనూ ఘర్షణలకు దిగారు.

నగరం మధ్య ప్రాంతంలోకి కూడా గొడవలు వ్యాపించాయి. అక్కడ కూడా భయోత్పాత వాతావరణం నెలకొంది. నీగ్రోపేటల్లోని వారు అక్కడకు వచ్చి షాపులపై దాడులు ప్రారంభించారు. వేలాది మంది ప్రభుత్వోద్యోగులు

తమ పనికాలం ముగియకముందే ఇళ్ళకు పరుగులు తీశారు నల్లవారున్న ప్రాంతాలనుంచి వేలాది కార్లను మెల్లగా ఇతర ప్రాంతాలకు తీసుకెళ్ళారు. శ్వేత వాషింగ్టన్ భయంతో గజగజలాడి శివార్లలోనూ, పొరుగు రాష్ట్రాలయిన మేరీ లాండ్‌లోనూ, వర్జీనియాలోనూ శరణుజొచ్చింది. పౌర వుద్యోగులు, వ్యాపారులు బస్సుల్లో ఎక్కడానికి స్థలంలేక అవతలి వైపు చేరుకోవడానికి మెమోరియల్ బ్రిడ్జి మీదుగా వెళ్ళారు.

తన పేదప్రజల ప్రదర్శనతో అమెరికాను ఒక ఊపు ఊపాలని కింగ్ భావించాడు. ఆ భావనకు అనుగుణంగా వుంది ఇప్పటి ఈ అమెరికావలస పరుగు. నల్లవారి క్రోధావేశపు సంతాపానికి అమెరికా అల్లకల్లోలానికి గురయ్యింది.

విషాదం, వంచన, నిరసనల తాలూకూ పరస్పర విరుద్ధ సంకేతాలను కింగ్ చూడగలిగుంటే ఎంత బాగుండేది

పేదప్రజలు ఉద్యోగాలు, వేతనాలు కావాలని చేసిన డిమాండును విని పించుకోని కాంగ్రెస్ (పార్లమెంట్) భవనాన్ని కాపాడ్డానికి మర తుపాకులతో భద్రతాదళాలు నిల్చున్నాయి.

నల్ల అమెరికన్ల సంతాపంనుంచి వెలువడ్డ మంటలు, పొగలు ఒకవైపు ప్రజ్వరిల్లుతుంటే మరోవైపు తెల్ల అమెరికన్ల వైట్‌హౌస్ ఇందుకు నేపథ్యంలాగా దర్శనమిచ్చింది. వైట్‌హౌస్‌పై సంతాపసూచకంగా పతాకాన్ని అవనతం చేశారు. అయినా 75 మంది సైనికులక్కడ కాల్పుల ఉత్తర్వుతో సిద్ధంగా నిల్చు న్నారు.

ఏప్రిల్ ఐదవ తేదీన అధ్యక్షుడు లిండన్ జాన్సన్ రెండు ప్రకటనలు జారీ చేశాడు. మొదటిది-ఏప్రిల్ 7 ఆదివారం జాతీయ సంతాపదినంగా ప్రకటిం చాడు. రెండవది-రాజధానికి తక్షణమే స్థాయీసైన్యాలను రప్పించే ప్రకటన.

రెండు వేలమంది సైనికులు వచ్చి ప్రభుత్వ కార్యాలయాల ముందు, విదేశీ దౌత్య కార్యాలయాల ముందు బారులుతీరి నిల్చున్నారు. థర్డ్ ఇన్‌ఫాంట్రీ రెజిమెంట్‌కు చెందిన ఐదువందలమంది సైనికులు దగ్గరవున్న ఫోర్ట్‌మేర్ నుంచి కదలివచ్చారు. వైట్‌హౌస్ ప్రాంగణంలో జరిగే విదేశీ అధిపతుల సమావేశ పరిరక్షణకు వీరిని నియమించారు. ఇప్పుడు ఖాకీ డ్రస్సులో వున్నవీరు సామాన్య ప్రజలను కలవడానికి సిద్ధంగా వున్నారు. రెండువేలమంది జాతీయ దళాలకు చెందినవారుకూడా రంగంలోకి దిగడానికి సన్నద్ధంగా వున్నారు.

వాషింగ్టన్ మేయర్ సాయంత్రం 5.30 నుంచి ఉదయం 6.30 దాకా కర్ఫ్యూ విధించారు. మొదటిరోజు గొడవలు ముగిసేసరికి రెండువేలమంది నల్ల వారు అరెస్టయ్యారు.

ఐదుగురు నల్లవారు కాల్పులకుగురై మరణించారు ఈ సంఖ్యను చూసి పోలీసులు గర్వించారు. అంటే తాము మెతకదనం వహించలేకపోతే మృతుల సంఖ్య మరింత పెరిగి వుండేదన్నది వారి భావం. పరిస్థితి చేయిదాటుతున్నది అనుకున్నప్పుడే కాల్పులకు దిగాల్సిందిగా వారికి ఉత్తర్వులు ఇచ్చారు. ఎడా పెడా కాల్పులు జరిపితే దాడిదార్లు మరింత రెచ్చపోతారని అధికార్లకు అనుభవం ద్వారా తెలుసు.

అదనపు దళాలు శనివారం రాత్రికల్లా దేశ రాజధానికి చేరుకున్నాయి. 1967 జులైలో డెట్రాయిడ్‌లో రెచ్చిపోయిన నల్లవారిని అణచివేసిన ప్యారాట్రూప్ డివిజన్ ఇది.

నల్లవారి సంతాపం చివరకు మంటలుగా, పొగలుగా, శిథిలాలుగా, విధ్వంసంగా మిగిలిపోయింది. షాపులన్నీ నామరూపాల్లేకుండా ధ్వంసమైపోయాయి.

అణగారిన నల్లవారికి అమెరికా తన చారిత్రక రుణాన్ని తీర్చకపోతే అల్లకల్లోలం తప్పదంటూ అహర్నిశలూ హెచ్చరిస్తూ వచ్చిన వ్యక్తి హత్యకు గురైన ఫలితం ఇది. ఇప్పుడు నిరాశాపూరిత వాతావరణంలో మరోసారి ఆ హెచ్చరిక ప్రతిధ్వనించింది. విషాదంలో నేరం చోటుచేసుకుంది. సూట్లు, టోపీలు, టైలు, బీరుసీసాలు, విస్కీ-సీసాలు కలర్ టెలివిజన్‌లు అన్నింటినీ షాపులనుంచి విసరివేశారు. క్రమపద్ధతి జయిస్తుందనడం స్పష్టమే అయినప్పటికీ ఇది మహత్తరశక్తి తాలూకు క్రమపద్ధతి అనడం కూడా విస్పష్టమే. ఏమైనా ఇది కింగ్ కలగన్న సౌభ్రాతృత్వం, న్యాయం తాలూకు క్రమపద్ధతి కాదు.

ఇంకా సంఖ్యానేక నగరాలలో సంతాప వ్యక్తీకరణ విభిన్న మార్గాల్లో సాగింది చర్చీలలో ప్రార్థనలు, కాల్పులు. పతాకాల అవనతం, మౌన ప్రదర్శనలు. పోలీసుల హుంకారాలు. అగ్నిమాపక వాహనాల రాకపోకలు, భాష్పవాయు ప్రయోగాలు, నల్లమహిళల విషాదాశ్రువులు వగైరా వగైరా రూపాల్లో విషాదం వ్యక్తమయింది.

నీగ్రోపేటలు ఐదు రోజులపాటు కన్నీరు మున్నీరుగా ఏడ్చాయి; ఐదు రోజులపాటు అల్లకల్లోల వాతావరణం ప్రజ్వలించింది. ఏప్రిల్ 9 న మాత్రమే అంటే అంత్యక్రియల రోజుకు మాత్రమే అమెరికాలో ప్రశాంతత తిరిగి నెల కొంది మళ్ళీ దేశవ్యాపితంగా "మేము జయిస్తాం, మేము జయిస్తాం" అన్న గీతం ప్రతిధ్వనించింది.

చికాగో, బాల్టిమోర్, డెట్రాయిట్, బఫెలో, కాన్సస్ సిటీ, నెవార్క్ వగైరా వందకుమించిన పట్టణాలలో నిరసన ప్రజ్వలించింది. పోలీసులు. 61వేల మంది జాతీయ రక్షణదళాలు ఆ నిరసన జ్వాలల్ని ఆర్పారు. గతంలో ఎన్నడూ అమెరికన్ నగరాల్లోకి ఇంతమంది సైన్యాలను పంపడం జరగలేదు. కాల్పుల్లో 39 మంది మరణించారు, 2,000 మందికి గాయాలు తగిలాయి, 10 వేల మందికి పైగా అరెస్టయ్యారు.

తన మృత్యువు సృష్టించిన ఈ తుఫాను గురించి ఆ "అహింసాదూతకు" ఏమీ తెలీదు. తనతోపాటు ఎంతమంది ప్రాణాలు వదిలిందికూడా ఆయనకు తెలీదు. ఇలాటి హింసాకాండను ఆయన తప్పకుండా ఎదిరించి వుడేవాడు. ఈ చావులు, గాయపడడాలు, అరెస్టు కావడాలు, మంటలు, పొగలు, ధ్వంసమై పోయిన షాపులు-ఆయన ఏ లక్ష్యంకోసం జీవించాడో ఆ లక్ష్యం ఇంకా అసంపూర్ణంగానే మిగిలి పోయిందని ఇవన్నీ సూచించాయి.

కింగ్ భౌతికకాయాన్ని ఆయన జన్మస్థలమైన అట్లాంటాకు తీసుకెళ్ళి థియలాజికల్ కాలేజిలోని చర్చిలో శవపేటికలో వుంచారు. ఆయన సమాధిపై వుంచడానికి ఈ కింది చరమగీతం చెక్కారు;

"చివరకు స్వేచ్ఛ చివరకు స్వేచ్ఛ
ప్రభూ కృతజ్ఞతలు నాకు చివరకు
లభించింది స్వేచ్ఛ"

ఆయన భౌతికకాయాన్ని దర్శించడానికి ఒకటిన్నర కిలోమీటరు పొడుగునా జనం బారులుతీరి నిల్చున్నారు. నల్లమహిళలు బోరున విలపించారు.

అవును ఆయన నిష్క్రమించాడు, అదే సమయంలో మనతోపాటు నిల్చే వున్నాడు. జీవించి వున్ననాటి కింగ్ మొహాన్ని టెలివిజన్ తెరలపైనా, వార్తాపత్రికలపైనా మళ్ళీ చూపించారు. ఇప్పుడాయన్ను అంతా ప్రవక్త అన్నారు. మార్టిన్ లూథర్ కింగ్ చరిత్రలో అంతర్భాగమవుతూ తన మాటలతో కోటి జనుల గుండెల్ని కమిలిపోయేలా చేశాడు. ఆకాశంలో పక్షుల్లాగా ఎగరడమూ, సముద్రాల్లో చేపల్లాగా ఈదడమూ మాత్రమే నేర్చుకుని భూమండలం మీద సోదరుల్లాగా నడవడం నేర్చుకోనట్టి ప్రజానీకానికి దురదృష్టం దుర్ఘటన తప్పదని ఆయన హెచ్చరించాడు.

అమెరికా చరిత్రలో గత 350 యేళ్ళుగా ఏ నల్లవ్యక్తినీ ఖననం చేయని విధంగా ఆయనను ఖననం చేశారు ఆయన భౌతికకాయంవెంట లక్షాయాభై వేలమంది ప్రజలు నడిచారు. ఎబెనెజర్ చర్చినుంచి నాలుగు మైళ్ళదూరం అంతిమ యాత్ర సాగింది. ఎబెనెజర్ చర్చివద్ద అంతిమ ప్రార్థనలు జరిగే సమయంలో ఉపాధ్యక్షుడు హంఫ్రీనుంచి సాదాసీదా జనందాకా అందరూ ఒకేరకం కుర్చీల్లో కూర్చున్నారు. అధ్యక్షుడు జాన్సన్ కూడా అక్కడికి వచ్చేవాడేకానీ భద్రతా కారణాలదృష్ట్యా ఆయనను నివారించారు. హత్యకు గురైన కెన్నెడీగారి భార్య, రాబర్ట్ కెన్నెడీ అంత్యక్రియలకు హాజరయ్యారు. రెండేళ్ళతర్వాత లాస్ ఏంజెల్స్‌లో తనకు మృత్యువు ఎదురు కానున్నదని పాపం రాబర్ట్ కెన్నెడీకి తెలీదు. అధ్యక్షపదవికి పోటీదార్లయిన రిచర్డ్‌నిక్సన్, మెకార్తీ, నెల్సన్ రాక్ ఫెల్లర్ హేమాహేమీలంతా అట్లాంటాకు వచ్చారు.

ఎబెనెజర్ చర్చిలో జరిగిన అంతిమ ప్రార్థనను టెలివిజన్‌లో యావత్ జాతికీ చూపించారు. టెలివిజన్ కెమెరాలు రాజకీయ ప్రముఖుల మొహాలనుకూడా చూపించాయి.

ఆ చిన్న చర్చిలో స్థలం లేనందువల్ల వేలాది మంది జనం బయట నిల్చున్నారు. అలా నిల్చున్నవారిలో అనామకులు, సుప్రసిద్ధులు, మహానగరాల మేయర్లు, హాలీవుడ్ తారలు వున్నారు.

ఈ ప్రజలు చర్చిలోనూ, చర్చి బయటా మార్టిన్ లూథర్ కింగ్ తాలూకు ఉద్వేగభరితవాణిని మరోసారి విన్నారు. ఆయన గొంతులో మార్మికతతోపాటు ఇహలోక తత్త్వంకూడా వుంది. రెన్నెళ్లక్రితం ఇదే చర్చిలో ఆయన చేసిన ప్రసంగాన్ని ఆయన శవపేటికనుంచి వినాలనుకుంటున్నాడని అక్కడున్న జనం భావించారు. ఆయన సోదరుని కోరికపై టేప్‌రికార్డర్‌ను ఆన్ చేశారు. కింగ్ ప్రసంగం ఇలా ప్రారంభమయింది.

"ఆ రోజు గురించి మనమంతా వాస్తవికంగా యోచిస్తామని అప్పుడప్పుడూ నేను ఊహిస్తూవుంటాను. ఆ రోజు అంటే మృత్యువు అనబడే దానిచేత మనం బలి అయ్యేరోజు.

"మనమంతా దాని గురించి యోచిస్తాం. నేను నా మృత్యువు గురించి నా అంత్యక్రియల గురించి అప్పుడప్పుడూ యోచిస్తుంటాను. నేను ఏమి చెప్పానా అని ఈ ఉదయం మీకేమి చెప్పాలా అని నన్నునేను అప్పుడప్పుడూ ప్రశ్నించుకొంటుంటాను.

"నేను నా అంతిమదినాన్ని గడిపినపుడు మీలో ఎవరైనా నా చుట్టుపక్కల వున్నట్లయితే దయచేసి నా అంత్యక్రియలను దీర్ఘకాలం పాటు నిర్వహించకండి.

మీరు నన్ను ప్రశంసించడానికి ఎవరినైనా పట్టుకొస్తే సుదీర్ఘ ప్రసంగం చేయొద్దని ఆయనతో చెప్పండి.

"ఆయన ఏం చెప్పాలా అని నేనప్పుడప్పుడు ఆశ్చర్యపోతుంటాను.

"నాకు నోబెల్ శాంతి బహుమతి వున్నట్లు చెప్పొద్దని ఆయనతో చెప్పండి. అది అట్టే ముఖ్యమైన విషయం కాదు.

"నాకు మరో మూడు నాలుగు వందలు అవార్డులు లభించిన విషయం కూడా ప్రస్తావించవద్దని ఆయనతో చెప్పండి. అది అట్టే ముఖ్యమైన విషయం కాదు. నేను ఏ పాఠశాలలో చదివానన్న విషయం కూడా ప్రస్తావించవద్దని చెప్పండి.

"మార్టిన్ లూథర్ కింగ్ ఇతరులకు సేవచేస్తూ తన జీవితాన్ని సమర్పించడానికి ప్రయత్నించాడని ఆ రోజున ఎవరైనా చెప్పాలని నేను కోరుకుంటున్నాను.

"మార్టిన్ లూథర్ కింగ్ మనుషుల్ని ప్రేమించడానికి ప్రయత్నించాడని ఆ రోజు ఎవరైనా చెప్పాలని కోరుకుంటున్నాను.

"న్యాయంగా వుండడానికి ప్రయత్నించానని వారితో కలిసి నడవడానికి ప్రయత్నించానని ఆ రోజు మీరు చెప్పాలని కోరుకుంటున్నాను. నేను ఆకలి గొన్నవారికి అన్నం పెట్టడానికి ప్రయత్నించిన విషయం మీరు ఆ రోజు చెప్పగలగాలనుకుంటున్నాను. బట్టలు లేని వారికి బట్టలివ్వడానికి నా జీవితంలో ప్రయత్నించానని మీరు ఆ రోజు చెప్పగలగాలనుకుంటున్నాను. నేను జైలులో వున్నవారిని పరామర్శించడానికి నా జీవితంలో ప్రయత్నించానని మీరు ఆ రోజు చెప్పాలనుకుంటున్నాను.

"నేను మానవజాతిని ప్రేమించడానికి, సేవించడానికి ప్రయత్నించిన విషయం మీరు చెప్పాలనుకుంటున్నాను

"అవును నేను రణభేరి వాయించేవాణ్ణని చెప్పాలనుకుంటే చెప్పండి. న్యాయం కోసం రణభేరి వాయించేవాణ్ణని చెప్పండి. శాంతి కోసం రణభేరి వాయించేవాణ్ణని చెప్పండి. ధర్మంకోసం రణభేరి వాయించేవాణ్ణని చెప్పండి.

"మిగతా ఆషామాషీ విషయాలేవీ ముఖ్యం కాదు.

"వదలి వెళ్లడానికి నా దగ్గర డబ్బుండదు. వదలి వెళ్లడానికి అద్భుతమైన విలాసవంతమైన వస్తువులేవీ నా దగ్గర వుండవు. నేను నిబద్ధతా జీవితాన్ని మాత్రమే వదలి వెళ్లాలనుకుంటున్నాను.

"నేను చెప్పదల్చుకున్నది ఇంతే........."

అది అద్భుతమైన అంత్యక్రియల కార్యక్రమం అయితే నిందారోపణ కాదు కాని అవి చిత్రమైన అంత్యక్రియలని కూడా నేనంటాను.

చిత్రమైన అంత్యక్రియలని ఎందుకంటున్నానంటే, ఇన్నాళ్ళూ కింగ్ పోరాటాన్ని గురించి బొత్తిగా పట్టించుకోని అమెరికా, బోధకుడు ప్రజానాయకుడుగా అభివృద్ధి చెందడాన్ని చూసి మోహం పక్కకు తిప్పుకున్న అమెరికా ఇప్పుడు కింగ్ శవపేటిక దగ్గరకు వచ్చింది. అతనిపట్ల గౌరవంతోనే వచ్చినప్పటికీ దాని సొంత పరిగణనలు దానికున్నాయి ఆ పరిగణనలు - అతనితో సాహచర్యం నెరపాలనుకోవడం, ఆయనను తన సొంత పద్ధతిలో వినియోగించుకోవడం, మరణించాక అతని రక్షణ కల్పించి వునికిలోలేని జాతి ఐక్యత పేరుతో ఆయనను పేదవారినుంచి బయటకు లాగడం.

కింగ్ వారసత్వం కోసం పోరాటం ఆయన సమాధిదగ్గరే ప్రారంభమైంది. ఆయన తాలూకు నిజమైన వారసుల పక్కనే కృత్రిమ వారసులు కూడా కనిపించారు. ఈ కృత్రిమ వారసులు ఆ మహా పోరాట యోధుని కేవలం "అహింసా దూత"గా దిగజార్చారు.

ఈ కృత్రిమ నటకావతంసులను కింగ్ సమాధి నుంచి తరిమికొట్టలేకపోయారు. అయితే వారికి మౌన ప్రతిఘటన మాత్రం ఎదురైంది. చర్చినుంచి మోర్‌హౌస్ కాలేజీకి ఆయన భౌతిక కాయం వున్న శవపేటికను మామూలు శవ వాహనంలో కాక వ్యవసాయానికి ఉపయోగించే బండిపై తీసుకెళ్ళారు. ఆ బండికి కంచర గాడిదలను కట్టారు. దక్షిణప్రాంత అమెరికాలో పాలికాపులు వ్యవసాయ పనులకు కంచర గాడిదలను ఉపయోగిస్తారు. వీరికి మోటారు వాహనాల వల్ల కలిగే ప్రయోజనాలు చేకూరనే లేదు. కింగ్ అనుయాయుల్లో ఎక్కువ మంది రైతులు ధరించే బట్టలే ధరించారు. సంతాప సూచకంగా ధరించే నల్లని సూట్ల మధ్య ఈ రైతు వుడుపులు ఒక హెచ్చరికగా, ఒక సవాలుగా ఒక ప్రతినగా కనిపించాయి.

లక్షలాది మంది ప్రజలు కేవలం తమ అంతరాత్మల ఆదేశం మేరకే కింగ్‌ను గౌరవించడానికి అట్లాంటా చేరుకున్నారు. ఆయన ఆ ప్రదర్శనలో సజీవుడుగా కాక నిర్జీవుడుగా పాల్గొన్నాడు. అంత మంది చిత్తశుద్ధి గల నల్లవారు, తెల్లవారు భుజం భుజం కలిపి నడవడం చూసివుంటే ఆయన ఎంతో సంతోషించి వుండేవాడు.

"మనం జయిస్తాం మనం జయిస్తాం" ఈ గీతం ప్రదర్శకుల నోట ప్రతిధ్వనించింది. ఆ పాట నిరంతరం పాడుతూనే వున్నారు. అంత్యక్రియల అనంతరం మోర్ హౌస్ కాలేజి పచ్చిక బయలులో జరిగిన స్మారక సమావేశంలో ఆ గీతాన్ని చివరిసారిగా పాడారు. వాషింగ్టన్ ప్రదర్శన తరువాత సమానత్వం కోసం ఇంత మంది పోరాట యోధులు మరెక్కడా ఒకచోట అలా లేదు. వారంతా చేతులు పట్టుకుని లయబద్ధంగా విషాదంగా సగర్వంగా దృఢచిత్తంతో ఇలా ఆలపించారు :

మాకు భయం లేదు
మాకు భయం లేదు
మాకివాళ భయం లేదు
మేము మా హృదంతరాల్లో
ఏదో ఒక రోజు జయిస్తామని
దృఢంగా నమ్ముతున్నాం నమ్ముతున్నాం

* * *

నేను నా విలేఖరి బాధ్యతలను 'ఇజ్వెస్తియా'కు చెందిన మరో సహచ
నికి అప్పగించి న్యూయార్క్ నుంచి మాస్కో చేరుకున్నాను. 1968 ఏప్రి
4 న వేదనాభరితమైన అనుభవం పొందాను. ఆ రోజు మెంఫిస్‌లో కింగ్ హత
వార్త విని యావత్ అమెరికా ప్రమాదపడిపోయింది. ఏప్రిల్ 9 న టెలివిజన్
అంత్యక్రియలు చూసినప్పుడు నా గుండెల్లో పుట్టిన వేదనాభారం నాకు మ
గుర్తుకొచ్చింది. ఒక మహామనీషి ఈ ప్రపంచం నుంచి నిష్క్రమించినప్పుడ
విశాల హృదయం గల ఒక వ్యక్తి ఈ ప్రపంచం నుంచి నిష్క్రమించినప్పు
అలాటి వేదనాభావం కలుగుతుంది. ఆ హృదయం ఎంత విశాలమైందీ బలమైం
అంటే దాని స్పందన వేలాది ఇతర హృదయాలకు బట్వాడా అయింది.

మార్టిన్ లూథర్ కింగ్ విషాదం అమెరికా విషాదంగా మారింది. అమెరికా
20 వ శతాబ్దపు ద్వితీయార్ధంలో [illegible] లాటి అసాధారణ వ్యక్తి మరొకడులేడ
అలాటి కుమారుడికి [illegible] మామూలుదేశం కాదు, మహత్తర దేశ
అలాటి వ్యక్తిని చంప [illegible] ంకాదు, క్రూరమైన దేశం.

డంబాలు పలికే కొంతమంది రాజకీయనాయకుల్లాగా, రాజకీయవేత్తల్లా
కాకుండా నిజమైన [illegible] తర్వాత కూడా జీవిస్తార
తమ సమకాలికు [illegible] మనసుల్లోనూ అమరజీవులవుతార
ప్రజలు పలికే క [illegible] రాజకీయవేత్తలు తమ జీవి
కాలంలోనే ఒకో [illegible]

సమాన హక్కుల [illegible] పోరాడిన, తన తోటి నల్ల సోద
సోదరులకు న్యాయం చేకూర్చడం కోసం పోరాడిన డాక్టర్ మార్టిన్ లూథ
కింగ్ తన హృదయంతోనూ మేధతోనూ మన కాలానికి చెందిన మరింత విస్తృ
మయిన మరింత సార్వజనీనమైన సత్యాన్ని గ్రహించాడు అవును మన కాల
తక్షణం డిమాండు చేస్తున్న మహత్తర వ్యక్తుల్లో ఆయనొకరు. మహత్తర వ్యక్తు
లంటే వినాశకరమైన ఆయుధ పోటీ నుంచి విశ్వవినాశన ప్రమాదం నుం
మానవజాతిని కాపాడేందుకు ఐక్య కృషి కొనసాగించాలని విజ్ఞప్తి చేసేవారు
మనం ఈనాడు రాజకీయవేత్తలను ఇతరేతర సమకాలిక ప్రముఖులను ఈ
దృక్పథం నుంచే మరింత సన్నిహితంగా చూస్తున్నాం; తమ మీదగల ప్రత్యేక
బాధ్యతకు అనుగుణంగా వారు వ్యవహరిస్తున్నారా లేదా అన్న విషయాన్ని
గమనించడానికి అలా సన్నిహితంగా చూస్తున్నాం.

ఈ అర్థంలో కూడా మహామానవతావాది మార్టిన్ లూథర్ కింగ్ అమర
జీవిగా పరిగణనపొందే హక్కు సంపాదించాడు.